# సమస్యా – పరిష్కారం



# సమస్యా – పరిష్కారం

## 1. సమస్య – నిర్వచనం

సంఘంలోగాని, బయట గాని లక్ష్య సాధనకు వ్యతిరేకంగా ఏర్పడే పరిస్థితిని సమస్య అంటారు.

## సమస్య – రకాలు

1. గ్రూపులో ఉండే సమస్యలు లేదా అంతర్గత సమస్యలు
2. బాహ్య సమస్యలు - గ్రూపుకు బయటి నుండి వచ్చే సమస్యలు

### అంతర్గత సమస్యలు :

సంఘంలోని సభ్యుల మధ్య వచ్చే సమస్యలను అంతర్గత సమస్యలు అంటారు.

ఉదా : రంగారెడ్డి జిల్లాలోని స్నేహ మహిళా సంఘంలో 15 మంది సభ్యులున్నారు. ఈ సంఘం వారు అన్ని కార్యక్రమాలు చక్కగా చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు. ఎప్పటిలాగా 5వ తారీఖున సంఘం సమావేశం జరుపుకొంటున్నారు. దీనికి సభ్యులందరూ హాజరయ్యారు. నాయకురాలు సమావేశానికి అధ్యక్షత వహించి పొదుపులు వసూలు చేస్తుంది. అప్పులు కావల్సిన వారు అడిగారు. ఒక సభ్యురాలు తన భర్త ఆపరేషన్‌కు రూ. 1,000/- అడిగింది. ఇంకొక సభ్యురాలు బియ్యం కొనుక్కోవడానికి రూ. 150/-, ఇంకొక సభ్యురాలు ఆరోగ్యం కొరకు రూ. 300/- మరొక సభ్యురాలు రూ. 200/- అడిగారు. అందరూ మాకు కావాలంటే మాకు కావాలని పోటీ పడుతున్నారు. సంఘంలో ఉన్న పొదుపులు మొత్తం రూ. 1,200/- మాత్రమే. సభ్యులడిగిన అప్పుల మొత్తం రూ॥ 1650/- నాయకురాలు మన దగ్గర రూ. 1,200/- ఉంది కనుక ముఖ్యమైన అవసరం ఉన్నవారు ఈ నెల తీసుకొని, మిగతా వారు వచ్చేనెల తీసుకుందురు అని చెప్పింది. అయితే అప్పు అడిగిన సభ్యులు మాకు ముఖ్యము అంటే మాకు ముఖ్యము అని పోటీ పడి గొడవ చేసుకోవడం మొదలయింది. కనుక ఇక్కడ అది సభ్యుల మధ్య వచ్చిన సమస్య కనుక అంతర్గత సమస్య.

### బాహ్య సమస్యలు :

సంఘానికి సంబంధంలేని వారినుంచి అంటే బయటి వ్యక్తుల ద్వారా సంఘంలో వచ్చే సమస్యలను బాహ్య సమస్యలు అంటారు.

ఉదా :

1 తమ వద్ద అప్పులు తీసుకోవడం లేదని ధనికులు, వడ్డీ వ్యాపారులు సంఘ కార్యకలాపాలకు అడ్డు రావడం

2 సంఘాలు స్థాపించిన తరువాత మహిళలు తమ అధికారాన్ని భరించడం లేదని గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు సంఘ కార్యకలాపాలకు అడ్డు రావడం

3 సంఘాల మధ్య వనరుల వినియోగంలో సమస్యలు

4 ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవడంలో అధికారులు సమస్యలు సృష్టించడం

**కేస్‌స్టడీ :**

పార్వతి మహిళా సంఘం ఏర్పడి 9 నెలలు అయింది. సమావేశాలు సక్రమంగా జరుపుకొంటూ దాని సభ్యులందరు పొదుపులు చేసుకుంటున్నారు. వీరు బ్యాంకు వారిని కలిసి తమకు అప్పు ఇస్తే ఉపాధి కార్యక్రమాలు చేపడతామన్నారు. మేనేజర్ పుస్తకాలు చూసి ఒప్పుకొని ఒక వారం తరువాత రమ్మన్నాడు. వారం తరువాత వెళితే మేనేజర్, సంఘంలోని ముగ్గురు సభ్యుల కుటుంబాల వారు బ్యాంకు నుండి అప్పు తీసుకున్నారు, తిరిగి కట్టలేదు, మీకు ఇస్తే మీరు కూడా కట్టకపోవచ్చు. కాబట్టి అప్పు ఇవ్వము'' అని చెప్పారు. ఆ గ్రూపుకు అప్పు మంజూరు కాలేదు.

సమస్య – పరిష్కార పద్ధతి :



**1. సమస్యను గుర్తించడం :**

నిజానికి, సమస్య అంటే ఏమిటి? చాలా సార్లు మనం ‘‘అడ్డంకులను’’ చూసి ‘‘ సమస్యలుగా’’ పొరపడుతుంటాము. అడ్డంకులనే వాటిని తక్కువ సమయంలో తొలగించడానికి వీలు కాకపోవచ్చును. కాబట్టి ఒక విపులమైన స్పష్టమైన నిర్వచనంతో సమస్యను చూడాలి.

ఏది సమస్య? ఏది సమస్య కాదు? అన్న విషయాన్ని కూలంకషంగా దాని వెనుకగల కారణాలతో పాటుగా లోతుగా విశ్లేషించి అర్థం చేసుకోవాలి. సమస్య ‘‘లక్షణాల’’ను సమస్య ‘‘కారణాలను’’ వేరు చేసి చూడగలగాలి. అసలు సమస్య ఇది అని తేల్చడానికి చాలా సమయం పడుతుంది. ఈ రకంగా సమస్యను మొదట గుర్తించాలి.

**2. కారణాలు తెలుసుకోవడం :**

ఒక సమస్యకు అనేక కారణాలు వుంటాయి. వాటిని తెలుసుకోవడం చాలా అవసరం. వీటినుంచి మూల కారణాలను గుర్తించాలి.

**3. వివిధ పరిష్కార మార్గాలను గుర్తించడం :**

ఒకసారి సమస్య ఏమిటి అన్నది స్పష్టంగా తెలుసుకొని అర్థం చేసుకున్న తరువాత దానికి గల వివిధ పరిష్కార మార్గాలేమిటి అనే విషయంపై శ్రద్ధ చూపాలి. ఇది వివిధ రకాలైన పరిష్కారాల సూచనకు తోడ్పడుతుంది. ఈ దశలో ఎన్ని రకాలైన పరిష్కారాలు కనుగొనడానికి వీలవుతుందో అన్ని రకాల పరిష్కార మార్గాలు ఆలోచించాలి. అంతేకాని ఆ పరిష్కారాల సాధ్యాసాధ్యాల గురించి అప్పుడే చర్చించి నిరుత్సాహ పడకూడదు.

**4. ఒక పరిష్కార మార్గాన్ని ఎన్నుకోవడం :**

ఈ దశలో సూచించిన పరిష్కారాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించాలి. పరిష్కార మార్గాలకు గల అవరోధాలను, సాధ్యాసాధ్యాలను దానికి సంబంధించిన సమాచారాన్ని బట్టి పరిశీలించి నిర్ణయించాలి. ఇది నిర్ణయం చేసే దశ కాబట్టి వివరంగా చర్చలుచేసి, తగినంత విశ్లేషణచేసి సరియైన పరిష్కార మార్గాన్ని ఎన్నుకునేటట్లు నిర్ణయం చేయాలి.

### 5. పరిష్కారాన్ని అమలు పర్చడం :

ఒక పరిష్కారాన్ని నిర్ణయించిన తరువాత దాన్ని ఏ విధంగా అమలు పరచాలి అనేది ముఖ్యం. నిర్ణయాన్ని అమలు పరచుటకు ఒక సవివరమైన ప్రణాళిక బాగా ఉపయోగపడుతుంది. నిర్ణయాన్ని అమలు చేయడంలో ఎవరెవరు ఏ ఏ బాధ్యతలు ఏ విధంగా నిర్వహించాలి అన్న అంశాలపై స్పష్టమైన అవగాహన ముందుగానే కలిగి ఉండాలి.

### 6. ఫలితమును సమీక్ష చేయడం :

అమలు చేయబడిన పరిష్కారం సమస్యను పరిష్కరించిందా? లేదా? లేక అది కొంత వరకు మాత్రమే పరిష్కరించ గలిగిందా? అది ఇంకొక సమస్యకేమైనా దారితీసిందా? అనే విషయాలను ఏ విధంగా పరీక్షించాలి అన్నదాన్ని ఈ దశలో జాగ్రత్తగా చూడాలి.

## కేస్‌స్టడీ :

ధనలక్ష్మి సంఘంలో కాంతమ్మ ఒక సభ్యురాలు. సంఘం పొదుపు నుండి రూ. ౨౦౦/- ఇంటి అవసరములకు అప్పు తీసుకుంది. నెలకు రూ. 100/- చొప్పున ౨ నెలలలో తిరిగి చెల్లించాలనని చెప్పింది. వడ్డీ నెలకు రెండు రూపాయలు. ఆ తరువాత నెల సమావేశమునకు వచ్చింది. కాని అప్పుడు ఇబ్బందులు వలన కంతు కట్టలేనంది. అలాగే మరో రెండు నెలలు ఏవేవో సాకులు చెబుతూ సమావేశాలకు రాలేదు. తరువాతి సమావేశంలో సభ్యులు చర్చించుకొని కాంతమ్మ ఇంటికి వెళ్ళి అడిగారు. దానికి ఆమె తాను సంఘంలో ఉండనని, తన పొదుపును అప్పుకు జమ చేసుకోమని చెప్పింది.

ఈ సమస్యను ధనలక్ష్మి సంఘం సభ్యులు పైన చెప్పిన సమస్య పరిష్కార పద్ధతి చక్రంలోని అంచెల ప్రకారం ఏ రకంగా పరిష్కరించుకున్నారో చూద్దాం.

మొదట సభ్యులందరూ కలసి చర్చించి కాంతమ్మ సంఘంనుంచి వెళ్లి పోవడానికి ఆమెకు గల సమస్యను గుర్తించారు. సమస్య ఏమిటంటే అప్పు తిరిగి కట్టలేకపోవుట ఆమెకు సమస్య.

ఈ సమస్యకు గల కారణాలు తెలుసుకోవాలి. ఎందుకు ఆమె అప్పు తిరిగి కట్టలేక పోతుంది అని చర్చించుకుని, ఒక రోజు కాంతమ్మ ఇంటికి వెళ్ళి తీరుబడిగా కూర్చొని కాంతమ్మతో చర్చించారు. ఎందుకని

నువ్వు అప్పు తిరిగి కట్టలేక పోతున్నావు. నెలకు వంద రూపాయలే కదా కట్టాల్సిందని చర్చలు చేయగా కాంతమ్మ తన సమస్యకుగల కారణాలు చెప్పింది. ''భర్తకు ఆరోగ్యం బాగా లేదు. డాక్టరు 3 నెలలు ఏ పని చేయకుండా విశ్రాంతి తీసుకోమన్నారు. ఇక పిల్లలు చదువు కోవడానికి వెళుతున్నారు. నేను ఒక్కదాన్ని కష్టపడి సంపాదించిన డబ్బుతో కుటుంబం మొత్తం గడవాలి. ఇంతకుముందయితే నా భర్త నేను ఇద్దరం కలిసి సంపాదించే వాళ్ళం. నెల నెలా పొదుపు అప్పు ఖచ్చితంగా కట్టేదాన్ని. ఇప్పుడు కట్టలేకపోతున్నాను అందుకే సంఘం వద్దు అనుకుంటున్నాను'', అని చెప్పింది.

దానిని బట్టి సంఘ సభ్యులందరూ కాంతమ్మ అప్పు కట్టలేకపోవడానికికల కారణాలను గుర్తించారు. తరువాత సభ్యులందరు సమావేశమై ఏమి చేయాలి, సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి? అని ఆలోచించి కొన్ని పరిష్కార మార్గాలను గుర్తించారు. అందులో ఒకటి కాంతమ్మ భర్తకు ఆరోగ్యం బాగయ్యే వరకు టైము ఇచ్చి తరువాత అప్పు కట్టమనడం, రెండవది, ఇంకాకొంత డబ్బును సంఘం నుంచి అందచేసి ఆమె భర్తకు త్వరగా జబ్బు నయమయ్యేటట్లు చేస్తే అతను త్వరగా కోలుకొని తిరిగి పనిలోకివెళ్ళి డబ్బు సంపాదిస్తే కాంతమ్మ అప్పు కట్టేస్తుంది., మూడవది, కాంతమ్మను అంతకు ముందు, నెలకు 100 చొప్పున 9 నెలలలో అప్పు తీర్చమని చెప్పడం జరిగింది. ఆ కంతులను ఎక్కువ చెయ్యడం, అంటే నెలకు రూ. 50/– చొప్పున 18 నెలలలో అప్పు తీర్చమనడం. ఇలా 3 పరిష్కార మార్గాలను ఆలోచించారు.

తరువాత ఈ మూడింటిలో ఏది చేస్తే సమస్య సవ్యంగా పరిష్కారమవుతుందోనని సభ్యులందరూ ఆలోచించారు, ఆమె భర్తకు పూర్తిగా జబ్బు నయమయ్యే వరకు సమయం ఇస్తే మిగతా సభ్యుల అవసరాలకు తగినంత అప్పు అందడం కష్టమవుతుంది, కనుక మొదటి పరిష్కార మార్గం ద్వారా సమస్య తీరదు. సంఘం నుంచి కొంతడబ్బు ఇచ్చి ఆమె భర్తకు జబ్బు నయం చేయిద్దామంటే ఎంత డబ్బు కట్టి త్వరగా నయం చేయించినా కూడా ఖచ్చితంగా మూడు నెలలు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్ చెప్పారని కాంతమ్మ అన్నది కదా! కనుక దాని ద్వారా కూడా సమస్య పరిష్కారం కాదు. ఇక ఆలోచిస్తే మూడవ మార్గమే మంచిదనిపిస్తోంది. నెలకు వంద రూపాయలైతే కట్టలేదు కాని, నెలకు యాభైరూపాయలు కట్టమంటే కాంతమ్మ కట్టగలుగుతుంది. కాబట్టి దీనివల్ల కాంతమ్మ సమస్యా తీరుతుంది. సంఘంలో కూడా నెల నెలా కొంచెమయినా అప్పు కట్టడం వలన సమస్య ఉండదు. కనుక ఈ మార్గాన్ని ఎన్నుకుందాము, దీని వల్ల సమస్య పరిష్కరించవచ్చు అని నిర్ణయం తీసుకున్నారు.

సభ్యులందరు కలసి కాంతమ్మతో చర్చించగా కాంతమ్మకూడా సభ్యులు చెప్పిన విధంగా నెలకు రూ. 50/– చొప్పున కట్టగలను అని ఒప్పుకుంది. ఆ రకంగా ప్రతి నెల కాంతమ్మ నెలకు రూ. 50/– అప్పుకడుతుంది. ఇప్పుడు ఈ సంఘం సభ్యులు పై విధంగా ఏ సమస్య వచ్చినా పై పద్ధతుల ద్వారా సులభంగా పరిష్కరించుకోగలుగుతున్నారు.

## సమస్య పరిష్కారంలో సభ్యులు మరియు లీడర్ల బాధ్యతలు

| సభ్యులు | లీడర్లు |
|---|---|
| 1 సమస్యను గుర్తించడంలోను, పరిష్కరించడం లోను లీడర్లకు సభ్యులు సహకరించుట | 1 ప్రాథమిక దశలోనే గుర్తించి సభ్యులకు దానిపై అవగాహనను కలిగించడం |
| 2 గుర్తించిన సమస్య సంఘానిది, దీనిని అందరూ కలిసి పరిష్కరించాలి అనే అవగాహన పెంపొందించుకొనుట | 2. సభ్యుల సహకారంతో వివిధ పరిష్కార మార్గాలను గుర్తించడం |
| | 3. సమస్యను పరిష్కరించటం |
| | 4 సమస్య పరిష్కారాన్ని ప్రతి దశలోనూ అంచనావేసి, ఫలితాన్ని సమీక్ష చేయడం |



# స్వయం సహాయక సంఘం – ఏర్పాటు దశ



## సమస్య : 1

### కార్యకర్తపై అపనమ్మకం – సంఘాల ఏర్పాటుకు అడ్డంకి....

కార్యకర్తను తొందరగా నమ్మక సంఘాలుగా ఏర్పడి పొదుపు చేసుకోకపోవడం జరుగుతుంది.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ మిమ్మల్ని నమ్మి మేమెందుకు సంఘంగా ఏర్పడి పొదుపులు చేయాలి, పోస్టాఫీసులో కట్టుకోవచ్చు లేదా మా దగ్గరే దాచుకోవచ్చు కదా; నమ్మి పొదుపులు చేసి బ్యాంకులో కడితే డ్రా చేసుకొనిపోతే ఎలా? ఇంతకు ముందు కూడా కొందరు వచ్చి మాతో ఇలాగే చెప్పి, మేము కూడబెట్టిన డబ్బులు తీసుకొని వెళ్ళిపోయారు; మీరు అలా చేస్తే మేము ఏమి చేయాలి? అనే సందేహం | ❶ కార్యకర్త గ్రామంలోని మహిళలతో పరిచయాలు పెంచు కోవాలి. మొదట గ్రామమంతా తిరిగి, గ్రామ పరిస్థితిపై అవగాహన తెచ్చుకొని వాళ్ళ సమస్యలపై పని చేయాలి. ఉదా :-గ్రామంలో ఆడపిల్లలను చదువులకి పంపరు. వారికి హాస్టళ్ళ సౌకర్యం గురించి తెలియదు. అప్పుడు వారికి ఆడపిల్లల హాస్టళ్ళ సౌకర్యాల సమాచారం అందజేయాలి. మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు గుర్తించి వాటిపై చర్చలు చేయాలి. |
| ❷ మీకు ఏదో లాభం వుంది; అందుకే మీరు మేము పట్టించుకోకపోయినా మా దగ్గరకు ఇన్నిసార్లు వచ్చి మమ్మల్ని బలవంతం చేస్తున్నారు వంటి అపోహలను అధిగమించడం సమస్య. దీనివల్ల కార్యకర్త గ్రామంలో సంఘాలను ఏర్పాటు చేయలేకపోతుంది. | ❷ అప్పుడు కార్యకర్తపై మహిళలకు పూర్తి నమ్మకం ఏర్పడి సంఘాలుగా ఏర్పడడానికి ముందుకు వస్తారు. |
| ❸ ఆ గ్రామంలో/ప్రాంతంలో ఇంతకు పూర్వము పనిచేసిన సంస్థకు సంబంధించిన కార్యకర్త ఎవరైనా మోసం చేసి ఉండవచ్చు. లేదా కార్యకర్త ఏదైనా నమ్మకం కలిగే పనిచేయలేకపోవడం వలన సంఘాలు ఏర్పాటు చేయడం కష్టమవుతుంది. | ❸ సంఘాలుగా ఏర్పడిన తర్వాత సంఘంగా మనము ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్ళాలంటే పొదుపును చేసుకోవాలి అని చర్చలు చేయాలి. |
| | ❹ పొదుపులు మీరే చేసుకొంటారు, బ్యాంకులో అకౌంటు మీ పేరు మీదనే ఉంటుంది. బ్యాంకులో డబ్బులు వేయాలన్నా, తీయాలన్నా మీరు సంతకాలు చేయాలి. కనుక మాకు, మీ డబ్బుకు ఎటువంటి సంబంధం ఉండదు. మీ సంతకాలు లేకుండా మీ అకౌంటులో నుంచి డబ్బులు ఎవ్వరు తీయలేరు. ఇంక డబ్బులు మీ దగ్గరే దాచుకొంటే ఏదో ఒక అవసరానికి వాడుకోవడం జరుగుతుంది. అంతేకాక మీ దగ్గర దాచుకొంటే, వడ్డీ రాదు. అదే బ్యాంకులో వేస్తే వడ్డీ వస్తుంది. అని చర్చలు చేయాలి. |

## కేస్‌స్టడీ :

చిత్తూరు జిల్లా చెర్లపల్లి గ్రామంలో లక్ష్మి అనే కార్యకర్త మహిళలతో సంఘాలు చేయుటకు నియమించబడింది. గ్రామంలోకి వెళ్ళీ వెళ్ళగానే సంఘాలు పెడదాము అని ప్రజల వద్దకు, మహిళల వద్దకు వెళ్ళలేదు. గ్రామ ప్రజలు, ముఖ్యంగా మహిళల అభిమానాన్ని చూరగొనడానికి ఏదైనా ఒక మంచి పనిచేయాలని నిర్ణయించుకుంది. కనుక గ్రామములోకి వెళ్ళగానే గర్భిణీ స్త్రీలు పోషకాహార లోపంతో అనారోగ్యంగా వుండటాన్ని గమనించి, ఆ ప్రాంత ఆరోగ్య కార్యకర్తతో చర్చించి అంగన్‌వాడీ సెంటర్‌నుండి గర్భిణీ స్త్రీ పోషకాహారం ఇప్పించడం వలన ఆ గ్రామంలో మహిళలకు లక్ష్మమ్మపైన నమ్మకం ఏర్పడి వారే సంఘాల గురించి అడగడం జరిగింది. (లక్ష్మమ్మను ప్రక్క గ్రామంలో సంఘాలతో పని చేయడం చూడటం వలన) అప్పుడు కార్యకర్త మహిళలకు సంఘాల గురించి ఈ విధంగా చెప్పింది.

సంఘాలలో ఆర్థికపరమైన విషయాల గురించి అంటే సంఘాలు మీవే, పొదుపులు మీరే చేసుకుంటారు, బ్యాంకు ఖాతా మీపేరుమీదే ఉంటుంది, డబ్బులు బ్యాంకులో వేయడం, తీయడం అంతా మీరే చేసుకొంటారు. మేము డబ్బు విషయంలో ఏమీ జోక్యం చేసుకోము. ఏమేమి కార్యక్రమాలు చేసుకోవాలో మీరే నిర్ణయించుకుంటారు, డబ్బు విషయమంతా మీరే చూసుకుంటారు. మా పాత్ర కేవలం మీకు సహకరించడం, తగిన సలహాలు, సూచనలు అందించడం మాత్రమే అని తెలియచెప్పింది. అప్పుడు మహిళలంతా కార్యకర్తను నమ్మి సంఘంగా ఏర్పడ్డారు.



## సమస్య : 2

### అయిష్టత చూపుతున్న కుటుంబ సభ్యులు....

**కొంతమంది మహిళలు సంఘాలుగా ఏర్పడాలంటే అత్తమామలు, తమ భర్తలు ఒప్పుకోరు కనుక వారిని ఒప్పించి సంఘాలుగా ఏర్పడాలంటే కష్టం అంటున్నారు.**

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సంఘాలుగా ఏర్పడాలంటే మా భర్తలు, అత్తమామలు ఒప్పుకోరు; ఇంటి పని, పిల్లలను చూసుకోవడం, పొలం పనులు ఇవన్నీ దెబ్బతింటాయి. | ❶ కార్యకర్త వెళ్ళగానే మొదట కుటుంబంలో వున్న పెద్దవాళ్ళతో సంఘం గురించి అంటే సంఘం వలన కలిగే లాభాల గురించి వివరంగా చెప్పాలి. |
| ❷ సంఘంలో వుంటే ఎక్కువగా తిరగాలి కదా! కనుక ఇంటిని చూసుకోవడం మరియు సంఘ కార్యక్రమాలలో పాల్గొనడం కష్టం అవుతుందని ఇంట్లోవారు ఒప్పుకోరు. | ❷ అంతేకాక సంఘంలో ఉంటే ఇంటిపని, పొలం పనులు అన్నీ ఎప్పటిలాగే చేసుకోవచ్చు. సంఘం వలన మీ పనికి అంతరాయం కలగదు. మీకు వీలయిన సమయంలోనే సమావేశాలు ఏర్పాటు చేసుకోవచ్చు అని వారికి నచ్చజెప్పాలి. |
| ❸ అంతేకాక మేము బయటకు తిరగడం ఇష్టం లేక కూడా ఇంట్లోవాళ్లు ఒప్పుకోరు. కనుక మా ఇంట్లో వారిని ఒప్పించి గ్రూపులో ఉండడం అనేది కష్టమని కొంతమంది మహిళలు సంఘంలో చేరడం లేదు. | ❸ సంఘంలో ఉంటే ఎక్కువ తిరగాల్సిన అవసరం ఉండదు అని కుటుంబ సభ్యులకు వివరంగా చెప్పాలి. అప్పుడు వాళ్ళు కోడళ్ళను కాని, కూతుళ్ళను కాని సంఘంలో చేర్పించడానికి ముందుకు వస్తారు. |
| ❹ సంఘం ఉద్దేశ్యం, లాభాలు తెలియకపోవడం వలన కూడా మహిళలు సంఘాలుగా ఏర్పడడానికి ముందుకు రావడం లేదు. | ❹ ఇంతేకాక ప్రక్క గ్రామంలో ఉన్న సంఘం సభ్యులను తీసుకొచ్చి సంఘాల గురించి వీరికి తెలియచెప్పాలి. అప్పుడు వారికున్న అభ్యంతరాలు తొలగిపోయి నమ్మకం ఏర్పడుతుంది. |

## కేస్‌స్టడీ :

చిత్తూరు జిల్లా పెరుమాళ్ళపల్లి అనే గ్రామములో కావేరి అనే మహిళను సంఘంలో చేరమని అడిగితే తన ఇంట్లో అడగాలి అంది. తరువాత కావేరి అత్త మామలతో సంఘాల గురించి కార్యకర్త వివరంగా తెలియజేయగా అవి చాలా బాగున్నాయి, ఉపయోగకరంగా ఉన్నాయంటూ తాను సంఘంలో చేరుతానంటూ కావేరి అత్త అంది. అప్పుడు కార్యకర్త కావేరి అత్తకు వివరిస్తూ సంఘాలలో 18 సంవత్సరాలు పైబడిన వారి నుంచి పనిచేయగలిగే వయస్సు ఉన్న వారినే చేర్చుకుంటారని తెలియ జెప్పింది. కనుక మీకు కొంచెం పెద్ద వయస్సు కాబట్టి కొన్ని బాధ్యతలు చేపట్టలేకపోవచ్చని, అందుకే మిమ్మల్ని సంఘంలో సభ్యురాలిగా చేసుకోలేమని చెప్పగా ఆమె సంతృప్తిచెంది తన కోడలును సంఘంలో చేర్చడానికి ఒప్పుకుంది.

## సమస్య : 3

### ఎంత కాలం ఈ పొదుపులు చేయాలి ?

పొదుపులు ఎంతకాలం చేయాలి? ఎవరో ఒకరు వస్తారు, గ్రూపులు ఏర్పాటు చేసుకోమని చెప్తారు, కొద్దిరోజులకి వెళ్లిపోతారు. మరల మేము మరచిపోతాము, మళ్లీ కొద్ది రోజులకి ఇంకొకరు వస్తారు. గ్రూపులు, పొదుపులు అంటారు. ఇలా ఎంత కాలం పొదుపులు చేయాలి?

| కారణాలు | పరిష్కారం |
| --- | --- |
| ❶ పొదుపులు చేయమంటున్నారు; గ్రూపులుగా వుండమంటున్నారు; గ్రూపులు చేసుకొంటే మీకు చాలా ప్రయోజనాలు ఉంటాయి, లోన్లు వస్తాయి, గ్యాసులు వస్తాయి అంటారు. కొద్ది రోజులకు మీరు వెళ్ళిపోతారు. అప్పుడు ఏమి చేయాలో అర్థంకాక మరల మేము పూర్వపు స్థితికే వస్తాము, అన్న భావన. | ❶ సంఘాలను గురించి పూర్తి అవగాహన కల్పించాలి, సంఘం అందించే వివిధ రకాల సేవల (పొదుపులు, అప్పులు, బీమా, సామాజిక, మార్కెట్ సేవలు) ద్వారా ఆర్థిక పరిస్థితి మెరుగుపడటానికి ఉపయోగ పడుతుందని చెప్పాలి. |
| ❷ ఈ గ్రూపులు ఎంత కాలం ఉంటాయి. మరలా వడ్డీ వ్యాపారులపై ఆధారపడక తప్పదు కదా; అలాంటప్పుడు ఈ సంఘాలు ఎందుకు? పొదుపులు ఎందుకు అని సభ్యులు మాట్లాడడం. | ❷ సంఘం కాని, పొదుపులు కాని సభ్యులు నిర్ణయించుకొనేవి, అంటే సభ్యులు ఇష్టపడితేనే సంఘం, పొదుపులు చేసుకుంటారు అని నచ్చజెప్పాలి. |
| ❸ సంఘం యొక్క లక్ష్యం, పొదుపు ఆవశ్యకత, పొదుపు ఎన్నాళ్లు చేయాలి అనే దానిపై కార్యకర్తకు అవగాహన లేక సభ్యులకు సరిగ్గా చెప్పకపోవడం | ❸ సంఘం ఏర్పాటు చేసుకొనేటప్పుడు సభ్యులు దానికి కొన్ని ఉద్దేశ్యాలు పెట్టుకొంటారు. అవి నెరవేరే వరకు సభ్యులు సంఘాలుగా కలిసి వుందుకు నడుస్తుంటారు అని చెప్పాలి. |
| ❹ సంఘాలను ఏర్పాటుచేసే కొన్ని ప్రోత్సాహక సంస్థలు స్థిరంగా ఉండకపోవడం వలన మహిళలకు పై విధమైన అపోహలు కలుగుతున్నాయి. | ❹ పొదుపులు పై విధంగా చేసుకుంటుంటారు. కనుక సంఘం కాని, పొదుపులు కాని ఎంతకాలం చేసుకోవాలనేది సభ్యులపై ఆధారపడి వుంటుంది అన్న విషయం వివరంగా చెప్పాలి. |
| | ❺ ఎవరు వచ్చినా, వెళ్లిపోయినా మీ గ్రూపులు, పొదుపులు, మీరు అలాగే ఉంటారు. ఎప్పటి లాగే అన్ని క్రమంగా చేసుకోవాలి. మాకు ఎవరూ రాలేదు అని మానుకోకూడదు అని చెప్పాలి. సంఘాలను ఏర్పాటు చేసిన సంస్థ ఉన్నా, వెళ్ళిపోయినా మనము, మన కార్యక్రమాలు ఎప్పటికీ చేసుకుంటూ ముందుకు వెళుతూ ఉండాలి, అంతేకాని సంస్థ వెళ్ళిపోయిందని మన గ్రూపులు మూసి వేయకూడదు అని వివరించాలి. |

## సమస్య : 4

### సమావేశాలకు ఊరూరూ తిరగలేమంటున్న మహిళలు....

సమావేశాలకు ఊరూరికీ తిరగాలంటూ, తమ ఇళ్లని, పిల్లల్ని వదిలి అలా తిరగలేమని, దానికి తమ ఇంట్లో వాళ్ళుకూడా ఒప్పుకోరని, అందుకే తాము సంఘాలలో వుండమని అంటున్నారు.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సంఘాలలో వుంటే ఎప్పుడూ సమావేశాలకు తిరగాలంట, అది గ్రామములోకాక మండలానికి, వేరేవేరే జిల్లాలకు వెళ్ళాలంట, కుటుంబము, పిల్లలను వదలి అంత దూరం వెళ్ళి వారం, 10 రోజులుండాలంటే కష్టము, మేము ఎప్పుడు బయటకు రాని వాళ్ళము ఇప్పుడు ఒక్కసారిగా అంతదూరం, అన్ని రోజులు రావడం కష్టము అని భావించడం. | ❶ సభ్యులకు మొదట సంఘాలు ఎందుకు ఏర్పాటు చేసుకుంటున్నామో తెలిపి, ఈ సంఘాలను పటిష్టపర్చుకోవడానికి కొన్ని ఉద్దేశ్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని చేరుకోవడానికి ఏ రకంగా పనిచేయాలి అనే విషయాలు చర్చించుకోవడానికి సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలి అని చెప్పాలి. |
| ❷ అంతేకాక మీటింగులకు వెళ్ళినప్పుడు అక్కడ ఎలా ఉంటుందో అనే అనుమానాలతో మహిళలు సంఘాలుగా ఏర్పడడానికి ఇష్టత చూపడం లేదు. దీనివలన సంఘాలు ఏర్పడడం లేదు. | ❷ సభ్యులందరూ కలిసి నెలకొక్కసారైనా కనీసం సమావేశం జరుపుకోవాలి. ఇలా సభ్యులందరూ తెలియని విషయాలు తెలుసుకొని అన్ని రకాల సమాచారాలు తెలుసుకొని అభివృద్ధి పథంలో నడవాలంటే సంఘాలకు సమావేశాలు చాలా అవసరం. ఇలా మొదట్లో నెలకు రెండూ లేదా నాలుగుసార్లు గ్రామస్థాయిలో గ్రూపుల సమావేశాలు జరుగుతాయి. ఇలా కొంత కాలం అయినతర్వాత క్రమంగా సమావేశాల సంఖ్య తగ్గి నెలకొకసారి పెట్టుకోవడం జరుగుతుంది. సంఘం అభివృద్ధిపథంలో నడుస్తున్నప్పుడు ఇంకా కొత్త సమాచారం తెలుసుకోవడానికి, మండల స్థాయి, జిల్లా స్థాయిలో ఎప్పడో ఒకసారి సమావేశాలుంటాయి. అంతేకాని గ్రూపులుగాఉంటే రోజూ సమావేశాలుండవు అని సభ్యులతో వివరంగా చెప్పాలి. |
| ❸ సంఘం అంటే ఏమిటో తెలియక పోవడం వలన, సమావేశాల ప్రాముఖ్యత గురించి తెలియక పోవడం వలన కొంతమంది మహిళలు సంఘమంటే ఊరూరా తిరగడమే అని అనుకోవడం వలన ముందుకు రావడం లేదు. | ❸ సమావేశాలకు కూడా ఎప్పుడూ వెళ్లినవాళ్లే వెళ్లకుండా ఒక్కొక్క సమావేశానికి ఇద్దరు చొప్పున వెళ్లాలని నిర్ణయించుకుంటే, ఎప్పుడూ వెళ్లినవాళ్లే వెళ్లినట్టు అనిపించదు. బాధ్యతలు కూడా అందరూ పంచుకొన్నట్లు ఉంటుంది. ఇంకా మండల, జిల్లా స్థాయిలో సమావేశాలు ఉన్నా కూడా రెండూ లేదా మూడు రోజులుంటాయి. వారం, 10 రోజుల సమావేశాలు ఉండవు అనేది సభ్యులకు వివరంగా చెప్పాలి. |
| ❹ కొంతమంది రాజకీయ నాయకులు, పెద్దలు పార్టీ మీటింగులకని, ఎవరో వస్తున్నారని మహిళలను సమావేశా లకు రమ్మనడం వలన గ్రామాలలో ఈ అపోహఎక్కువగా ఉంది. | ❹ మీటింగుకు కాని, ట్రైనింగుకుకాని మండల, జిల్లా స్థాయికి వెళ్ళినప్పటికీ, మీతో పనిచేసే కార్యకర్తలుండి అన్నీ చూసుకుంటారని చెప్పాలి. |

## కేస్‌స్టడీ :

చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలంలో మహాలక్ష్మి సంఘంలో నిర్మల ఒక సభ్యురాలు. ఆమె భర్త పాండుకు అంగవైకల్యం ఉంది. నిర్మల ఎప్పుడూ ఇంట్లోనే ఉండేది. సమావేశాలకు వచ్చేది కాదు. కాని పొదుపు డబ్బులు సంఘానికి పంపుతూ ఉండేది. తరువాత సభ్యులు అందరూ కలిసి నిర్మల ఇంటికి వెళ్ళి, నీవు ఎప్పుడూ సమావేశానికి రావు, ఇకనుంచి అయినా ఖచ్చితంగా నీవు సమావేశాలకు రావాలి, వచ్చి అన్ని విషయాలు తెలుసు కోవాలి అని చెప్పి ఆమెను సమావేశానికి తీసుకొని వెళ్ళారు. సమావేశంలో చర్చించిన విషయాలన్నీ నిర్మల చక్కగా వినడం జరిగింది. ఆ సమావేశంలో ఒక సంఘ సభ్యురాలు తాను చాలా కాలంనుంచి మూర్ఛవ్యాధితో బాధపడుతున్నానని, దానికి ఏమైనా పరిష్కారం ఉందా అని కార్యకర్తను అడగ్గా కార్యకర్త అటువంటి వారికి వున్న ఆసుపత్రి, ఆ జబ్బుకు సంబంధించిన జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగింది. సమావేశానికి రావడం వలన కొత్త సమాచారం తెలుసుకొన్నానని, నిర్మలకు సంతోషం వేయడం, అప్పటి నుండి సంఘంకు తరచూ రావడం, కొన్ని సమస్యలను పరిష్కరించడంలోను, బయట ప్రాంతాలకు వెళ్ళడం ద్వారాను చాలా విషయాలు నేర్చుకొంది.

అదే విధంగా ఆ మండలంలో ఉన్న ఆరోగ్య కమిటీలకు సెక్రెటరీగా నిర్మల ఎన్నిక కావడం ద్వారా నేటికీ అన్ని సమావేశాలలో తాను ఒక ఉదాహరణగా ఇతర సభ్యులకు సమావేశాల ఆవశ్యకత గురించి తెలియజేయ సాగింది. తన భర్త వికలాంగుడు కావడం వల్ల ప్రభుత్వం నుండి వికలాంగులకు వచ్చే సదుపాయాలు కూడా తీసుకోవడం జరిగింది. ఇవన్నీ తాను ఇంటిలో ఉంటే జరిగేవి కావని, కనుక తాను సమావేశాలకు వచ్చి అన్ని విషయాల గురించి తెలుసుకోవడం వలన ఇంత ముందుకు వచ్చానని, సమావేశాలు సంఘానికి చాలా అవసరం అని నిర్మల ఇప్పుడు అంటుంది.



## సమస్య : 5

# లాభాలు వస్తాయని ఆశలు పెంచుకుంటున్న మహిళలు...

**సంఘంగా వుంటే ఏమి వస్తాయి? అప్పులు ఇస్తారా? బర్రెలు, గొర్రెలు ఇస్తారా? అని అడిగినప్పుడు సమాధానం ఎలా చెప్పాలి అనేది కార్యకర్తకు ఎదురయ్యే సమస్య.**

### కారణాలు

1. కార్యకర్త గ్రామంలోకి వెళ్ళి సంఘాలుగా అవ్వాలి, పొదుపులు చేసుకోవాలి అని చర్చిస్తుంటే మహిళలు సంఘాలుగా వుంటే మాకు ఏమి వస్తుంది,అప్పులు ఇస్తారా; బర్రెలు ఇస్తారా, గొర్రెలు ఇస్తారా; ఏమి వస్తుందో మొదట చెప్పు.. మిగతావన్ని తరువాత చెప్పు అని అడగడం.
2. ఇంట్లో వాళ్ళు మొదట అవే అడిగి రమ్మన్నారు. ఏమన్నా వస్తుంది అంటే చేరమన్నారు, లేదంటే వద్దన్నారు. కనుక ముందు ఏమి వస్తుందో చెప్పండి, అది చాలు; లేదంటే ముందు అప్పులు ఇవ్వండి, సంఘాలుగా అవుతాము. మా పనులన్నీ మానుకొని ఇక్కడొచ్చి కూర్చోవాలంటే కష్టం అవుతుంది. మీరు ఏదయినా వస్తుంది, ఏదయినా ఇస్తాము అంటే అప్పుడు వస్తాము, సంఘాలుగా వుంటాము అనే విధంగా మహిళల వైఖరి ఉంటుంది.
3. ముందు పనిచేసిన కార్యకర్త సంఘాలుగా ఉంటే అప్పులు వస్తాయి, బర్రెలు, గొర్రెలు వస్తాయి అనేటటువంటి ఆశలు కల్పించడం వలన అలాంటి వైఖరి ఏర్పడుతుంది.
4. రాజకీయనాయకులు, అధికారుల హామీలు, ప్రకటనల వలన కొన్ని ప్రోత్సాహక సంస్థలు టార్గెట్లను పూర్తిచేసుకోవడానికి ఏవేవో చెప్పి తొందరగా సంఘాలను చేయడం వలన అలాంటి వైఖరి ఏర్పడుతుంది.

### పరిష్కారం

1. గ్రామాలలోకి వెళ్ళినప్పుడు మొట్టమొదట సంఘాల గురించి కాకుండా వారి వ్యక్తిగత, కుటుంబ, గ్రామ సమస్యలపై పనిచేస్తే అప్పుడు గ్రామంలోని మహిళలకు కార్యకర్తపై నమ్మకం ఏర్పడుతుంది.
2. కార్యకర్త సంఘాల గురించి, అంటే విడివిడిగా వుండి ఎవరికి వారుగా సాధించలేనిది 10 లేక 15 మంది ఏకమైతే సాధించవచ్చు. కనుక మనమంతా కలిసి సంఘాలుగా ఏర్పడి మన సమస్యలపై పనిచేసి మన జీవితాలలో మార్పు తెచ్చుకుందామని చెప్పాలి.
3. మనమంతా కలిసి పొదుపులు చేసుకొని మనలో మనం అప్పులు ఇచ్చుకోవచ్చు. ఈ అప్పులతో ఆర్థిక పరమైన కార్యక్రమాలు చేసుకొంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు మొ॥ చర్చలు చేసి సంఘాలుగా ఏర్పాటు చేసుకుందాము అంటే సభ్యులు ముందుకొస్తారు.
4. సంఘంగా ఏర్పడి క్రమంగా పొదుపులు చేసుకొంటూ అన్ని పథకాలను అందుబాటులోకి తెచ్చుకొని బాగుపడుతున్న ప్రక్క గ్రామాలలోని సంఘాలను చూపడానికి క్షేత్ర సందర్శనకు తీసుకెళ్ళడం చేయాలి.
5. సంఘాలలో సభ్యులందరిని కూర్చోబెట్టి సంఘాలుగా ఉంటే మీకు రుణాలు బర్రెలు, గొర్రెలు కూడా వస్తాయి. కానీ ఇవన్నీ రావాలంటే ముందు ఐకమత్యం పెంచుకొని, క్రమంగా పొదుపులు చేస్తూ సమావేశాలు నిర్వహించుకొంటూ, పుస్తకాలు పెట్టుకొని లెక్కలు వ్రాసుకొంటూ, శిక్షణలు తీసుకుంటూ అన్ని రకాల సమాచారాన్ని తెలుసుకొంటూ ఉండాలి. సంఘం ఏర్పాటైన ఒకటి లేదా ఒకటిన్నర సంవత్సరానికి మీకు పై అవకాశాలు అందుతాయి అని చర్చలు చేయాలి.

## కేస్‌స్టడీ :

కరీంనగర్ జిల్లా పెద్దపల్లి గ్రామంలో కమలమ్మ (51సం॥) వినాయక సంఘంలో సభ్యురాలు. పూల వ్యాపారం చేస్తుంది. ఈమెకు ఇద్దరు కొడుకులు. వారిని చదివించింది. వారికి పట్నంలో మంచి ఉద్యోగాలు కూడా వచ్చి పట్నం వెళ్ళిపోయారు. ఒకసారి కమలమ్మ నీళ్ళ కోసం వెళ్ళి కాలుజారి పడింది. ఆసుపత్రికి వెళ్ళి చూపించగా, కాలు విరిగిందని వైద్యులు తెలియజేసినారు. ఆ సమయంలో సంఘ సభ్యులు ఆమె పరిస్థితిని గమనించి ఆమె కొడుకులకు ఫోనుచేసి వారిని పెద్దపల్లికి రప్పించడం జరిగింది. వారు వచ్చి తల్లిని పరామర్శించి, కొన్ని రోజులు వుండి తర్వాత ముఖ్యమైన పనుల కారణంగా వెళ్లాల్సి వచ్చి వాళ్లమ్మను చూసుకోమని సంఘానికి బాధ్యత అప్పజెప్పి వెళ్లిపోయారు. అప్పుడప్పుడు వారు వచ్చి చూసుకొని వెళ్లేవారు. సంఘ సభ్యులు ఆ రోజునుంచి కమలమ్మను బాధ్యతగా చూసుకునేవారు.

ఒక రోజు డాక్టర్‌ను సంప్రదించగా కమలమ్మకు ఆపరేషన్ చేయించాలని, దానికిగాను ఏడు వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని చెప్పినారు. అప్పుడు సంఘం వారు అందరూ ఆలోచించి ఆమె కొడుకులు వచ్చే వరకు లేటు అవుతుందని కమలమ్మ ఆపరేషన్‌కు కావలసిన డబ్బులు సమకూర్చాలని ఆలోచించి ఇలా చేశారు. కమలమ్మకు సంఘంలో 4,200/- పొదుపు ఉండడం, సక్రమంగా సంఘంకు రావడం లాంటి అంశాలను గమనించి సంఘం నుండి రూ.7000/- అప్పుగా ఇవ్వడం జరిగింది. తరువాత కూడా ఆసుపత్రిలో ఉండగా, 8 రోజులు కమలమ్మను చూసుకోవడానికి, రోజుకు ఒకరు చొప్పున ఆమె దగ్గర ఉండటం, 9వ రోజు ఆమెను ఇంటికి తీసుకురావడం జరిగింది. క్రమేణా ఆమె పూర్తిగా కోలుకొన్నది. తరువాత తన పూల వ్యాపారం ద్వారా సంఘం అప్పును తీర్చివేయడం జరిగింది.

సంఘ సభ్యులకు తాను ఋణ పడి ఉన్నానని, సంఘంలో చేరడంవలన అవసర సమయంలో సభ్యులు తనను ఆదుకొన్నారని, కనుక సంఘం వలన తనకు చాలా మేలు జరిగిందని ఇప్పటికీ కమలమ్మ గర్వంగా చెబుతుంది.



## సమస్య : 6

### గ్రామంలోకి రానివ్వక పోవడం వల్ల కార్యకర్త పడే ఇక్కట్లు....

మొట్టమొదట కార్యకర్త గ్రామంలోకి వెళ్ళినప్పుడు గ్రామస్థులు ఆమెమీద నమ్మకం లేకపోవటం వలన ఆమెతో మాట్లాడకపోవడం, గ్రామంలోకి రానివ్వకపోవడం వలన కార్యకర్తకు గ్రామస్థులతో చర్చించే అవకాశం లేకపోవడం.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ కార్యకర్త గ్రామములోకి మొదట వెళ్ళగానే మీరు ఎవరో, ఎక్కడ నుంచి వచ్చారో, ఇలాగే వస్తారు, పిల్లలను తీసుకెళ్తుంటారు, మొదట ఆడవాళ్ళు వచ్చి అంతా చూసుకొనివెళ్తారు, తరువాత రాత్రిపూట మగవాళ్ళు వచ్చి దొంగతనం చేస్తారు, ఇలాంటి అపోహలతో గ్రామములోకి కార్యకర్తను రానివ్వకపోవడం జరుగుతుంది.<br>❷ కార్యకర్తలకు గుర్తింపు కార్డులేకపోవడము, సంఘాలను ప్రమోట్‌చేసే సంస్థ ముందుగా గ్రామంలో ఎటువంటి మీటింగ్ జరపకపోవడం వలన కార్యకర్తలు గ్రామాలలోకి వెళ్ళి మహిళలతో చర్చించి సంఘాలను ఏర్పాటు చేయలేకపోతున్నారు.<br>❸ కార్యకర్త ఆ గ్రామములోకి వెళ్ళేముందు గ్రామస్థులను కలవకుండా నేరుగా మహిళల దగ్గరకు వెళ్ళి మాట్లాడటం వలన కూడా ఆమెపైన అనుమానం కలగడానికి ఆస్కారం ఏర్పడుతోంది. | ❶ గ్రామములోకి వెళ్ళగానే మొదట సర్పంచ్, గ్రామ పెద్దలు, టీచరు, అంగన్‌వాడీ టీచర్ మొదలగు వారితో పరిచయాలు చేసుకొని తాను ఎవరు, ఎక్కడి నుంచి వచ్చింది, ఏ ఉద్దేశ్యంతో వచ్చింది, వారికి వివరంగా చెప్పి వారిద్వారా మహిళల దగ్గరికి వెళ్లాలి. అప్పుడు మహిళలకు కార్యకర్తపై కొంతనమ్మకం ఏర్పడుతుంది. మన ఊరివారే తీసుకువచ్చారు కనుక ఈమె మంచి వ్యక్తి అయి ఉంటుంది, నిజంగానే మనకు మేలు చేయబోతుంది అని నమ్మకం ఏర్పడి ఆమెతో మాట్లాడతారు.<br>❷ సంస్థవారు కార్యకర్తలకు గ్రామాలను కేటాయించేటప్పుడు వారికి తెలిసిన గ్రామాలనే కేటాయిస్తే పై సమస్యరాదు<br>❸ సంస్థకు చెందిన గుర్తింపు కార్డును కార్యకర్తలు కలిగివుండి గ్రామస్తులకు చూపించాలి.<br>❹ కార్యకర్తలను ఎంపిక చేసేటప్పుడు స్థానికులనే తీసుకోవాలి.<br>❺ కొత్త కార్యకర్త గ్రామాలకు వెళ్ళేటప్పుడు, పాత కార్యకర్తను కొన్ని రోజులు తనతో తీసుకెళ్లాలి.<br>❻ గ్రామములోకి వెళ్ళేముందు ఆ గ్రామము యొక్క పరిస్థితి గురించి కార్యకర్త తెలుసుకోవాలి.<br>❼ మొట్టమొదట గ్రామంలోకి కార్యకర్త వెళ్ళేముందు ఆ గ్రామంలో సభ్యులందరినీ పిలిచి సమావేశం పెట్టి అందులో తన సంస్థ గురించి అందరికీ వివరంగా చెప్పాలి. |

## కేస్‌స్టడీ :

మెదక్ జిల్లాలోని నవజ్యోతి సంస్థలో రాధ అనే కార్యకర్త కొత్తగా చేరింది. చేరిన వెంటనే గ్రామాలకు సంఘాలను ఏర్పాటు చేయడానికి వెళ్ళింది; వెళితే అక్కడ మహిళలందరూ రాధ అనే పేరు గల నక్సలైట్ వాళ్ళ ప్రాంతంలో వుండటం వలన ఆ నక్సలైటే ఈ రాధ అనుకొని ఆమెతో మాట్లాడటం లేదు. అయినా కూడా రాధ వారి ఇంటింటికి వెళ్ళి చర్చలు చేయడం మరియు వారు పనులు చేసుకుంటున్న స్థలముకు వెళ్ళి చర్చలు చేయడం మొదలైన ఎన్నో ప్రయత్నాలు చేసింది. కాని సంఘాలు ఏర్పాటు కాలేదు. అప్పుడు రాధ తన పై అధికారులతో చర్చించగా, వారు ఆలోచించి ఆ ప్రక్క గ్రామంలో ఉన్న పాత సంఘాలలోని సభ్యురాలైన దుర్గమ్మను రాధ వెంట పంపారు. దుర్గమ్మ రాధ వెంట వెళ్ళి సంఘాల గురించి చెబితే అప్పుడు అక్కడ మహిళలు ఆమెతో సహకరించి ఆమె చెప్పేది విన్నారు. మరియు పక్కగ్రామంలో దుర్గమ్మ వాళ్ళ సంఘం గురించి తెలుసుకొని, ఆనందించి కొన్ని రోజుల తర్వాత రాధ చెప్పినట్లు సంఘాలను ఏర్పాటు చేసుకొన్నారు.

గ్రామంలో ఉన్న మహిళలను కలుసుకోవడానికి కార్యకర్త ఆ వూరికి వెళ్ళినది.



1

ఎందుకొచ్చినావో.. నువ్వెవరో.. మాకు తెలియదు. ఇక్కడకు రావద్దు అంటూ గ్రామపెద్దలు కార్యకర్తతో అంటారు.



2

ప్రక్క గ్రామంలోని సంఘ సభ్యులను ఈ గ్రామ మహిళలతో మాట్లాడించిన తరువాత ఈ గ్రామ మహిళలు సంఘ ఏర్పాటు చేసుకొనుటకు ముందుకు వచ్చారు.



3



4

## సమస్య : 7

### భాషా పరమైన సమస్యతో భోరు మంటున్న కార్యకర్త ....

గిరిజన తాండాల్లో పనిచేయడానికి వెళ్ళే కార్యకర్తలకు అక్కడ మహిళలతోకాని, గ్రామ సభ్యులతోగాని చర్చలు చేయడానికి వారి భాష తెలియకపోవడం వల్ల సమస్య వస్తుంది.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ గిరిజన తాండాలకు వెళ్ళినప్పుడు భాష సమస్య వస్తుంది. వారి భాష మనకు, మన భాష వారికి అర్థం కాకపోవడంవలన వారితో మాట్లాడడం కాని, వారికి కార్యకర్త వెళ్ళిన ఉద్దేశ్యం చెప్పడంకాని సమస్య అవుతుంది.<br>❷ కార్యకర్తకు ఇంతకుముందు గిరిజనులతో పనిచేసిన అనుభవం లేకపోవడం అన్నది కూడా సమస్యే.<br><br>బాష తెలియక కార్యకర్త సభ్యులతో కలసి చర్చలు చేయలేక పోవుట | ❶ భాష తెలిసిన వారిని కార్యకర్తగా నియమించటం<br>❷ ఇంకా కొన్ని ప్రయత్నాలు చేసి ఆ తెగకు చెందిన వారిని ముందుకు తీసుకొచ్చి కార్యకర్తలుగా ఎదిగేలాచేసి వారినే నియమిస్తే పై సమస్య రాదు.<br>**ఉదా :** గిరిజన ప్రాంతాలలో చదువుకున్న మహిళలను గుర్తించి ఆ ప్రాంతానికి వారినే కార్యకర్తగా తీసుకోవడం చేయాలి. లేదా వారిని మహిళలతో చర్చలు చేసేటప్పుడు కార్యకర్తకు సహాయంగా తీసుకోవడం చేయాలి. |

## కేస్‌స్టడీ :

నిజామాబాద్ జిల్లాలోని గిరిజన తాండాలో పని చేయడానికి గ్రామాభ్యుదయ మండలి అనే సంస్థ నుంచి కార్యకర్త వెళ్ళింది. గ్రామములోకి వెళ్ళి అందరితో పరిచయాలు చేసుకొని మాట్లాడదామంటే ఆమెకు వాళ్ళు మాట్లాడే భాష రాదు. కనుక కార్యకర్త వారితో చర్చలు చేయలేకపోయింది. దీనివలన కార్యకర్త ఏమి చెపుతోంది, ఎందుకు వచ్చింది అనే విషయం సభ్యులకు అర్థం కాలేదు. కనుక మహిళలు గ్రూపులుగా ఏర్పడలేకపోయారు. కార్యకర్త కొన్ని రోజులు ఆ గ్రామంలో తెలుగు వచ్చిన వారి సహాయం తీసుకొని చర్చలు చేయడం జరిగింది. అయినా కార్యకర్త పూర్తిస్థాయిలో చర్చలు చేయలేకపోయింది. అప్పుడు కార్యకర్త ఈ సమస్యను తనపై అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వారితో సమస్య గురించి చెప్పి గ్రామాలలో కొంతమంది చదువుకున్న వారున్నారని, వారిని ప్రోత్సహించి కార్యకర్తలుగా నియమిస్తే సమస్య తీరుతుందని చెప్పింది. అప్పుడు అధికారులు ఆ విషయాన్ని ఆలోచించి గిరిజన ప్రాంతాలనుంచి చదువుకున్న మహిళలను గుర్తించి కార్యకర్తలుగా ఎంపికచేసుకోవడం జరిగింది. అలా చేసిన తర్వాత ఆ ప్రాంతంలో సంఘాలు తొందరగా ఏర్పడ్డాయి. తమ భాష తెలిసిన అమ్మాయినేకాక తమ ప్రాంతం నుండి వచ్చిన అమ్మాయినే కార్యకర్తగా నియమించడంవలన తొందరగా సంఘాలు ఏర్పడడం జరిగింది.

| | |
|---|---|
|  బాష తెలియక ఇబ్బంది పడుతున్న కార్యకర్త |  భాష తెలిసిన సభ్యురాలు సభ్యులతో కలసి పోవడానికి ప్రయత్నిస్తుంది. |
|  సభ్యుల కష్టాలను,సుఖాలను పంచుకుంటుంది. |  సంఘంలో తాను కూడా ఒక సభ్యురాలు అయినా, సంఘ ప్రగతి కోసం కృషి చేస్తుంది. |

## కార్యకర్త చేయవలసిన, చేయకూడని పనులు :

### చేయవలసిన పనులు

- గ్రామ పరిస్థితి తెలుసుకోవడానికి మొదట గ్రామంలో పి.ఆర్.ఏ. లేదా సర్వే చేయడం
- గృహ సందర్శనలు చేసి ప్రతి కుటుంబ పరిస్థితిపై మరియు గ్రామ పరిస్థితిపై అవగాహన ఏర్పరచు కోవడం
- కార్యకర్త గ్రామ ప్రజలందరినీ చేర్చి సమావేశం జరపడం
- వీధి సమావేశాలను ఏర్పాటు చేయడం
- చురుకుగా ఉన్న మరియు శ్రద్ధ చూపించే మహిళలను గుర్తించి వారితో ప్రత్యేక చర్చలు చేయడం
- చర్చలలోగాని, మీటింగులలోగాని స్థానిక భాషను ఉపయోగించడం
- పై విధానాలలో గ్రూపుగా ఉండడానికి ముందుకు వచ్చిన మహిళలతో ప్రత్యేక చర్చలుచేసి సంఘం ఏర్పాటు చేయడం
- గ్రామంలో ఎక్కువమంది కలిసేచోట, అంటే రచ్చబండ, నీళ్ళపంపులు, టీ కొట్టు మొదలైన చోట్లకు వెళ్ళి సమాచారం తెలపడం.

### చేయకూడని పనులు

- సంఘాల ఏర్పాటుకు దగ్గరదారులు వెతకకూడదు
- పలుకుబడితో సంఘాలు ఏర్పాటు చేయకూడదు
- సంఘాల ఏర్పాటప్పుడు సభ్యులకు ఆశలు పెట్టకూడదు (ఉదా : డబ్బులు, బర్రెలు, గొర్రెలు ఇస్తామని వగైII)
- సంఘాలు ఏర్పాటు చేసేటప్పుడు సభ్యులను తక్కువచేసి మాట్లాడకూడదు. (వారికి ఏమీ తెలియదనుకోవడం లాంటివి)
- సంఘాల ఏర్పాటులో తప్పుడు సమాచారం అందజేయకూడదు
- గ్రామ పెద్దలను విమర్శించడం కాని, నొప్పించే విధంగా మాట్లాడడంకాని చేయకూడదు

# సభ్యత్వం – సమస్యలు

మధ్య వయస్సు మహిళలు

పేద కుటుంబము నుంచి వచ్చిన మహిళ



పూరిల్లు



మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన మహిళ



పెంకుటిల్లు



వృద్ధులు

ఉన్నత తరగతి కుటుంబం నుంచి వచ్చిన మహిళ



డాబా



బాలికలు

ఒకే సామాజిక , ఆర్థిక పరిస్థితులకు చెందిన మహిళలంతా ఒకే సంఘంలో సభ్యత్వము కల్గి ఉంటే ఆ సంఘము లో సమస్యలకు తావే ఉండదు.

## సమస్య : 1

### సంఘంలో ఎంతమంది ఉండాలో .........

ఒక సంఘంలో ఎంతమంది సభ్యులుగా వుండాలనేది సమస్య.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సంఘంలో 15 మంది వుండాలా లేక 20 మంది వుండాలా; 10 మంది వుండాలా ? ఎంత మంది ఉండాలి? అనేది తెలియక పోవడం వల్ల | ❶ సంఘంలో 10 నుంచి 20 మంది సభ్యులు ఉండాలి. 20 మందికంటే ఎక్కువైతే రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంటుంది. కనుక 10 నుండి 20 మంది మాత్రమే సంఘంలో ఉండాలి. |
| ❷ 10 మంది వుంటే తక్కువ మంది కనుక అన్ని కార్యక్రమాలను గొడవలు లేకుండా చేసుకోవచ్చు అని కొందరు, ఎక్కువమంది అయితే ఏ కార్యక్రమము అయినా చేయటానికి చాలా మంది వున్నాము అనే ధైర్యం వుంటుంది, అందరి సహకారం వుంటుంది కనుక 10 మందే కాదు ఇంకా ఎక్కువ మందిని చేర్చుకోవాలి అని కొంతమంది మాట్లాడటము వలన సంఘంలో ఎంతమంది వుండాలనేది సమస్యగా మారుతుంది. | ❷ సంఘంలో 20 మంది ఉంటే ముఖ్యంగా వారి ఆర్థిక లావాదేవీలు సభ్యులు సులువుగా చూసుకో గలుగుతారు. అంతేగాక ఎక్కువ మంది అయితే సంఘ నిర్వహణ కూడా కష్టమవుతుంది. |
| ❸ సంఘ పరిమాణం, పరిధిపై అవగాహన లేకపోవడం వలన | ❸ సంఘంలో 20 మంది ఉంటే అందరూ మాట్లాడటానికి, చర్చించడానికి, అందరి అభిప్రాయాలు పంచుకోవడానికి వీలవుతుంది. సభ్యులమధ్య చర్చలు కూడా బాగా జరుగుతాయి. |
| | ❹ తక్కువ మంది అయితే అందరి అవసరాలు తీర్చుకోగలుగుతారు. అంటే అప్పులు అందరికీ అందుతాయి మరియు వ్యక్తిగత సమస్యలపై పని చేయగలుగుతారు. |
| | ❺ తక్కువ మంది ఉంటే సమావేశంలో చర్చించే విషయాలు అందరికీ అర్థమయ్యేలా వుంటాయి, సమయం కూడా ఆదా అవుతుంది. |



పడవ మోయగల్గినంత మందే పడవలో ఉండాలి
చిన్న సంఘంలో కూడా అంతే మంది సభ్యులు ఉండాలి



## సమస్య : 2

### కులానికి ఒక గ్రూపు కావాలంటున్న మహిళలు....

అన్ని కులాలవారు ఒక గ్రూపులో వుంటే సమస్యలు తలెత్తుతున్నాయి.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ ఒక సంఘంలో అన్ని కులాలవారు వుంటే ఎస్సీ, ఎస్టీ కులాల వారికి వచ్చే ప్రయోజనాలు, ఓ.సి., బి.సి. కులాల వారికి కూడా అందుతాయి కదా! అంతేకాక ఓ.సి., బి.సి. కులాలవారు, చిన్న కులాలవారిని తక్కువ చేసి చూడడం. మేము పెద్ద కులము నుంచి వచ్చాము, మేము చెప్పినట్లు మీరు వినాలి, మేము ఏమి చెప్పితే అది మీరు చేయాలి, ఆ రకంగా అజమాయిషీ చెలాయించడం.<br>❷ తక్కువ కులాల వారి ఇండ్లకు మేము రాము, మేము పెద్ద కులాల వారము కదా అందుకే రాము అనడం. ప్రతిసారి తక్కువ కులాల వారినే పెద్ద కులాల వారి ఇండ్ల దగ్గరకు రమ్మని చెప్పడం, ఇలా చేయడం వలన సంఘంలో సమస్యలు వస్తున్నాయి.<br>❸ సంఘం, దానివలన ఉపయోగాలు, సంఘాలు ఎందుకు ఏర్పాటు చేసుకుంటున్నాము అనే విషయాలపై అవగాహన లేకపోవడం వలన.<br>❹ సంఘం అంటే అందరం కలసి మెలసి సమానంగా ఉండటానికి ఏర్పాటు చేసుకున్న వేదిక అని తెలియక పోవడం. | ❶ సభ్యులను సంఘాలుగా ఏర్పాటు చేసేటప్పుడు ఒకే రకమైన ఆర్థిక పరిస్థితికి చెందిన వారందరినీ ఒక సంఘంగా ఏర్పాటు చేస్తే వారు ఒకరి పరిస్థితిని ఒకరు అర్థం చేసుకొని, ఒకరి సమస్యలను ఒకరు అర్థం చేసుకొని కలిసి పని చేయగలుగుతారు.<br>❷ ఎవరి కోసం ఉద్దేశించిన ప్రయోజనాలను వారే ఉపయోగించుకోవడం జరుగుతుంది. చేసుకొనే పొదుపు విషయంలో కూడా అందరూ ఒకే స్థాయికి చెందినవారు కనుక అందరూ కలిసి నిర్ణయంను చేసుకోగలుగుతారు.<br>❸ అంటే ఉదాహరణకు అందరూ ఒకే ఆర్థిక పరిస్థితి నుంచి వచ్చినవారయితే అందరి పరిస్థితిని దృష్టిలో వుంచుకొని నెలకు ఎంత పొదుపు చేయాలని అందరూ కలిసి ఒకటిగానే ఉండేటట్లు నిర్ణయించుకుంటారు.<br>❹ ఒకే గ్రూపులో అధిక ఆర్థిక స్థాయి, తక్కువ ఆర్థిక స్థాయికి చెందిన వారుంటే కొందరు తక్కువ పొదుపులు (రూ.30) చేద్దామంటే, కొందరు ఎక్కువ (రూ.100) చేద్దామంటారు. ఒకేస్థాయి వారందరు ఒక సంఘంగా ఏర్పడితే ఇలాంటి సమస్యలు రావు.<br>❺ సంఘాలుగా ఏర్పాటై అభివృద్ధి దశలో నడుస్తున్న సంఘాలలో ఈ సమస్యలు వచ్చినట్లైతే సభ్యులందరినీ కూర్చోబెట్టి |



సంఘం అంటే ఒక కుటుంబం లాంటిది, అందులో ఉన్న సభ్యులందరూ ఒకటే, అందులో ఏ విధమైన బేధాలు ఉండకూడదని నచ్చజెప్పాలి.

❻ కుటుంబంలోని సభ్యులను ఎక్కువ తక్కువలుగా చూడము. అందరినీ సమానంగా చూడడం జరుగుతుంది. అలాగే సంఘంగా ఏర్పడ్డాము అంటే అందరమూ ఒకటే అని గుర్తుంచుకొని ముందుకు వెళ్ళాలి అని సభ్యులతో చర్చలు చేయాలి. కనుక ఏది చేసినా అందరమూ కలిసి ఒక నిర్ణయం తీసుకోవాలని చెప్పాలి. సంఘానికి ఎటువంటి సహాయం వచ్చినా అందులో సభ్యులందరికీ సమాన హక్కు ఉంటుంది అని చెప్పాలి.



## సమస్య : 3

## సంఘంలో సభ్యుల మధ్య వయసు తారతమ్యాలవల్ల ఏర్పడే సమస్యలు?

సంఘాలలో సభ్యులను చేర్చుకొనేటప్పుడు ఎక్కువ వయస్సు అయిన వారిని చేర్చుకోవడం వలన సమస్యలు ఎదురవుతున్నాయి.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సంఘంలో సభ్యులను చేర్చుకొనేటప్పుడు ముసలివారైతే వీరికేమీ పని ఉండదు, ఖాళీగా ఇంటిదగ్గరే ఉంటారని మరియు కుటుంబ సభ్యులనుంచి ఎటువంటి అభ్యంతరం ఉండదు కనుక వారిని సంఘాలలో చేర్చడం జరుగుతుంది.<br>❷ కాని వారు గ్రామంలో మరియు బయట జరిగే సమావేశాలకు రాలేకపోతారు. సంఘానికి సంబంధించిన కొన్ని బాధ్యతలు తీసుకోలేకపోతారు. సంఘంలో కొంతమంది మీదే బాధ్యతలు పడుతున్నాయి. దీని వలన సభ్యులలో గొడవలు వచ్చి సమస్యగా మారుతుంది.<br>❸ సంఘంలో చేరడానికి ఉండాల్సిన సభ్యత్వ అర్హతల గురించి తెలియక పోవడం వలన. | ❶ సంఘాలలో సభ్యులను చేర్చుకునేటప్పుడు 18 సం॥ల కన్నా ఎక్కువ వయస్సు ఉన్నవారిని, మరియు సంఘానికి సంబంధించిన అన్ని బాధ్యతలను చేపట్టగలిగే వయస్సున్న వారిని సంఘంలో చేర్చుకోవాలి అని కట్టుబాటు పెట్టుకోవాలి.<br>❷ అంతేకాక 18 సం॥ల కన్నా తక్కువ వయస్సు ఉన్న వారు సంఘంలో చేరడానికి ఆసక్తి చూపుతుంటే ఆ వయసు వారందరినీ కలిపి విడిగా సంఘంగా ఏర్పాటు చేయవచ్చు.<br>❸ ఎక్కువ వయసు వారు, ఏ ఆధారం లేకుండా ఉన్నవారు సంఘంలో చేరడానికి ఆసక్తి చూపితే అలాంటి వారిని సంఘంలో ఉండమని చెప్పవచ్చు. కాని అప్పు, పొదుపు కార్యక్రమంలో పాల్గొనకుండా చూసి ప్రభుత్వం నుండి వచ్చే సదుపాయాలు సంఘం తరఫున వారికి అవకాశం కల్పించవచ్చు. |

## కేస్‌స్టడీ :

కర్నూలు జిల్లాలోని కోసంగి అనే గ్రామంలో మొదట సంఘాలు అయినప్పుడు పెద్దవాళ్ళు (ఎక్కువ వయస్సు) వున్న వారంతా సంఘంలో వుంటామని ముందుకు వచ్చి సంఘంగా ఏర్పడ్డారు. ఆ సంఘంలో ఎక్కువగా పెద్దవాళ్ళు, కొంతమంది చిన్నవాళ్ళు వున్నారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి

సమావేశాలు పెట్టుకోవడం, పొదుపులు చేసుకోవడం మొదలగు అన్ని కార్యక్రమాలు సక్రమంగా చేసుకొంటున్నారు. కాని ఆ సంఘంలో వున్నది ఒకే ఒక్క సమస్య. అది ఏమిటంటే సంఘంలో ఉన్న సభ్యులలో ఎక్కువ మంది పెద్దవాళ్లు అయ్యేసరికి బ్యాంక్‌కు వెళ్ళాలన్నా, మండలంకు వెళ్ళాలన్నా ఏదయినా సంఘం పనికి వెళ్ళాలన్నా ఎప్పుడు వెళ్ళినా ఇద్దరు, ముగ్గురు మాత్రమే వెళ్ళాల్సి వచ్చేది. మిగతా వాళ్ళంతా పెద్దవాళ్ళు కనుక వెళ్ళలేకపోయేవారు.

సంఘంలో జరిగే విషయాల గురించి చర్చలు చేస్తున్నప్పుడు కూడా చాలా మంది మేము ముసలివాళ్ళము మాకు ఏమి గుర్తుండవు, మీరు చిన్నవాళ్ళు కదా, మీరు గుర్తు పెట్టుకోండి చాలు అని చర్చలలో కూడా అందరూ పాల్గొనేవారు కాదు. సమావేశం పూర్తి అయ్యేవరకు కూడా వుండేవారు కాదు. అంతంతసేపు మేము కూర్చోలేము అని వెళ్ళిపోయేవారు. దీనివల్ల బాధ్యతలన్నీ ఇద్దరు, ముగ్గురు మీదనే పడడం వలన సంఘంలో గొడవలు మొదలై పెద్ద సమస్యగామారి అయి సంఘం కొంతకాలం విడిపోయింది. తరువాత సభ్యులు మరలా ఆలోచిం చుకొని చర్చలు చేసి పెద్దవాళ్ళు ఎవరైతే వున్నారో వారితో మాట్లాడి వారి కోడళ్ళను సంఘంలో చేర్పించినారు. ఆ పెద్దవాళ్ళుకూడా వచ్చి సంఘంలో కూర్చొని చర్చలలో పాల్గొంటున్నారు. ఇప్పుడు సంఘంలో పనులన్నీ అందరూ బాధ్యతలు తీసుకొని చేసుకొంటున్నారు. ఇప్పుడు వీరి సంఘం బాగా పనిచేస్తున్నది.

## సమస్య : 4

### ఒక కుటుంబం నుంచి ఒక్కరికన్నా ఎక్కువమంది సభ్యులుగా ఉంటే సంఘానికి చేటు

ఒక సంఘంలో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు వుండటం అనేది సమస్య

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ ఒక సంఘంలో ఒకే ఇంటి నుంచి ఇద్దరు సభ్యులు వుండటం వలన సంఘం నుంచి చేకూరే ప్రయోజనాలు ఒకే కుటుంబానికి దక్కుతాయి.<br>❷ అంతేకాక సమావేశాలకు ఒకరు వస్తే చాలు ఒకే కుటుంబం నుంచే కదా! ఇద్దరు ఎందుకు అని ఎప్పుడూ ఒక్కరే హాజరవడం జరుగుతుంటుంది.<br>❸ సంఘానికి సంబంధించిన అన్ని విషయాలలో బాధ్యత ఒక్కరే తీసుకొంటారు. అప్పు | ❶ ఒక కుటుంబం నుంచి ఒక్కరే సంఘంలో వుంటే గ్రామంలో మిగతా వాళ్ళకు (సంఘంలో లేని వాళ్ళకు) సంఘంలో వుండే అవకాశం వుంటుంది. సంఘం అందించే సేవలు సభ్యులందరికీ సమానంగా అందుతాయి.<br>❷ ఒక కుటుంబం నుంచి ఒకరే సంఘంలో ఉంటే ఆ ఒక్కరూ సమావేశానికి వస్తారు. హాజరు వంద శాతం ఉంటుంది. సంఘం బాధ్యతలు కూడా అందరూ సమానంగా |

తీసుకోవడంలో కూడా ఒకే కుటుంబానికి రెండుసార్లు అప్పు ఇవ్వాల్సి వుంటుంది.

❹ సంఘంలో 15 మంది వుండాలి కదా. అంతేకాక పేరుకు 15 మంది వుంటారు బాధ్యతలు 14 మంది మాత్రమే తీసుకొంటుంటారు; దీనివలన సంఘంలో సమస్యలు వస్తున్నాయి.



మీ కుటుంబంలో నుంచి ఒక్కరే సంఘంలో ఉండాలి. ఇద్దరు ఉంటామంటే కుదరదు.

పంచుకొంటారు. పొదుపులు, తీసుకొన్న అప్పులు నెల నెలా పద్ధతి ప్రకారం చెల్లించడం జరుగుతుంది.

❸ ఒక కుటుంబం నుంచి సంఘంలో ఒకరే ఉండాలనే కట్టుబాటు ఏర్పాటు చేసుకోవాలి.

❹ సంఘం ఇంకా ఏర్పాటు కానిచోట సభ్యులతో పై విషయాలన్నీ చర్చలు చేసి సంఘంలో ఒక కుటుంబం నుంచి ఒక్కరే ఉండేటట్లు చూడొచ్చు. కాని గ్రూపు ఏర్పాటైన చోట ఈ సమస్య ఉంటే సంఘ సభ్యులతో పై విషయాలన్నీ చర్చించి ఒక కుటుంబం నుంచి ఇద్దరు ఉన్న వాళ్లతో సభ్యులందరూ కలిసి చర్చించి ఒకరిని అదే గ్రామంలో ఉన్న ఇంకొక సంఘంలో చేర్పిస్తే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుంది.

❺ ఒకే కుటుంబం నుంచి సంఘంలో ఒకరికే సభ్యత్వ హక్కు ఉంటుంది. రెండవ వ్యక్తి కేవలం సభ్యురాలిగా ఉంటూ పొదుపు చేసుకోవచ్చు. కాని ఇతర సంస్థల ద్వారా వచ్చే ఆర్థిక సహాయం మాత్రం ఒక కుటుంబం నుండి ఒకరికే అందుతుంది అని తెలియజేయాలి.

❻ ఒక కుటుంబంలోంచి ఇద్దరు ఒకే సంఘంలో ఉంటే కట్టుబాట్లను అమలు చేయుటకు కష్టము. సంఘంలో తోటి సభ్యులలో ఒకే కుటుంబం వారు ఉండుట వలన ఒత్తిడి చేయలేరు. ఫలితంగా సంఘం నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది.

శిక్షణకు వెళితే నా కేంటి లాభం?



## సమస్య : 5

### సభ్యులకు ఆశలు చూపుతున్న కార్యకర్తలు ....

మొదట సభ్యులకు ఏవేవో ఆశలుపెట్టి అప్పులు ఇస్తాము, గ్యాస్‌లు ఇస్తాము సంఘాలుగా వుంటే డబ్బులు వస్తాయి, ఇండ్లు ఇస్తాము మొదలగు ఆశలన్నీ పెట్టి సంఘాలుగా చేయడం వలన సమస్యలు వస్తున్నాయి.

| కారణాలు | పరిష్కారం |
| --- | --- |
| ❶ మొదట కార్యకర్తలు గ్రామాలకు వెళ్ళగానే సభ్యులందరిని సంఘాలుగా చేయడం చాలా కష్టమని, దీని కోసం కొన్ని సులభమైన మార్గాలను వెతుకుతారు. అవి సభ్యులకు లోన్లు ఇస్తాము, ఇండ్లు ఇస్తాము, గ్యాస్‌లిస్తాము, ఇలా రకరకాల ఆశలుపెట్టి వారిని సంఘాలుగా చేస్తారు.<br>❷ కొద్దిరోజులు గడిచాక ఇవేవీ అందచేయకపోయేసరికి సభ్యుల నుండి డిమాండ్ వస్తుంది. ఈ డిమాండ్‌కు తట్టుకోలేక కార్యకర్త ఆ గ్రామానికి పోవడం మానేస్తుంది. దానితో సంఘం వెనక బడుతుంది. అంతేకాక ఇంకెవరైనా వెళ్ళినా కూడా గ్రామస్తులు నమ్మరు. దీనివల్ల సంఘాలు చేయడం కష్టమవుతుంది.<br>❸ కొంతమంది ప్రమోటర్‌లు తమ టార్గెట్‌లను పూర్తిచేసుకోవడానికి, తొందర తొందరగా సంఘాలు ఏర్పాటు చెయ్యాలని మహిళలకు ఏవేవో ఆశలుపెట్టి సంఘాలు ఏర్పాటు చేస్తారు. | ❶ కార్యకర్త గ్రామాలలోకి వెళ్ళి సభ్యులందరితో సంఘాలు ఏర్పాటు చేయడానికి దగ్గరదార్లు వెతుక్కోకూడదు.<br>❷ అప్పులు, పొదుపులు, గ్యాస్‌లు మొదలైనవి ఇస్తాము సంఘాలుగా ఏర్పడండి అని చెప్పడం కాకుండా సంఘం అంటే ఏమిటి, సంఘం ప్రాముఖ్యత ఏమిటి, సంఘం వలన సభ్యులకు ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి, సంఘం వలన వారి జీవితాలకు ఎలాంటి ఉపయోగాలు ఉంటాయి అనే వాటి గురించి వివరంగా చెప్పడం జరిగితే అవన్నీ సభ్యులందరికి అర్థమై వారంతకు వారే తాము సంఘంగా ఏర్పడతాము అని నిర్ణయించుకునే వరకు కార్యకర్త సంఘాల గురించి చర్చలు చేస్తూ వుండాలి.<br>❸ అభివృద్ధి దశలో ఉన్న సంఘాలలో ఈ సమస్య ఉంటే సభ్యులందరినీ కూర్చోబెట్టి కార్యకర్త వివరంగా లోన్లు, గ్యాస్‌లు సంఘాలకు ఎప్పుడు వస్తాయి అనేది చెప్పాలి.<br>❹ సంఘాలుగా ఏర్పడి మన సమస్యలను పరిష్కరించుకొని ఐకమత్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకొంటూ, కొత్త కొత్త సమాచారాలు తెలుసుకొంటూ వ్యక్తిగత, |



ఎవరు ఏ మాటలు చెప్పినా మేము వినం. మా సభ్యులందరము చర్చించి సంఘ శ్రేయస్సు కోసం కృషి చేస్తాము.

కుటుంబ జీవితాలలో కూడా మార్పులు తెచ్చుకొంటూ క్రమంగా సమావేశాలు జరుపుకొంటూ, పొదుపులు చేసుకుంటూ పుస్తకాలు పెట్టుకొని రాసుకొంటూ ఉంటే సంవత్సరం లేదా ఆపైబడిన తర్వాత రుణాల కోసం, గ్యాస్‌లకోసం ధరఖాస్తులు పెట్టుకొని ప్రయత్నించవచ్చు అని సభ్యులకు చెప్పాలి.

5. అప్పుడు సభ్యులు తమ గ్రూపు ఆ స్థాయిలో ఉందా లేదా అని చూసుకొని ఆ స్థాయికి ఎదగాలంటే ఏమి చేయాలో ఆలోచిస్తారు.

## సభ్యత్వానికి సంబంధించి చేయవలసిన–చేయకూడని పనులు

| **చేయవలసిన పనులు** | **చేయకూడని పనులు** |
|---|---|
| • సంఘంలో 10 నుంచి 20 మంది వరకు ఉండవచ్చు<br>• ఒక సంఘంలో ఒక కుటుంబం నుంచి ఒక్కరే ఉండాలి<br>• సంఘంలో 18 సంవత్సరాలపైబడిన, పనిచేసే శక్తి కలిగిన వయస్సున్న వారు ఉండాలి. | • సంఘంలో చిన్న పిల్లలను, ముసలి వారిని చేర్చుకోకూడదు<br>• సంఘంలో మతి స్థిమితం లేనివారిని కూడా చేర్చుకోకూడదు.<br>• ఒక సంఘంలో ఒక కుటుంబం నుంచి ఇద్దరు ముగ్గురు సభ్యులు ఉండకూడదు<br>• ఒకే సభ్యురాలు రెండు లేదా అంతకన్నా ఎక్కువ సంఘాలలో ఉండకూడదు. |

మన సమస్యలను మనం పరిష్కరించుకొనుట ద్వారా, మన సంఘంలో సరిపోయినంత సభ్యులు ఉన్నందువలన మన నావ ఎటువంటి అడ్డంకులు లేకుండా సాగిపోతుంది కదా!



## సభ్యత్వ అర్హతలు :

- 10 నుండి 20 మంది పేద వివాహిత స్త్రీలు సంఘంలో సభ్యులుగా ఉండవచ్చు.
- సభ్యులు ఒకే ఆలోచన, ఒకే ప్రాంతం, ఒకే జీవన విధానం, ఒకే విధమైన ఆర్థిక పరిస్థితి, ఒకే విధమైన సమస్యలు కల్గి ఉంటే మంచిది
- 18 నుండి పనిచేసే శక్తి కలిగిన వయస్సున్న వారి వరకు ఉండవచ్చు. బాలికలకు, వృద్ధులకు వేరుగా సంఘాలు పెట్టవచ్చు.
- ఒక కుటుంబం నుండి ఒకరే ఉండాలి.
- సంఘ ఉద్దేశ్యాలకు కట్టుబడి ఉండేవారు, సంఘ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనడానికి ఆసక్తి కలిగినవారై ఉండాలి.
- పొదుపును చేయగలిగినవారై ఉండాలి.
- ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతుల వారు, ఒంటరి స్త్రీలు సొంత ఆస్థి లేని వారు సభ్యులుగా ఉండవచ్చు

## సభ్యత్వ అనర్హతలు :

- బ్యాంకులో కాని లేదా మరి ఏ యితర సంఘాలలో కాని మొండి బకాయిలు కలవారు.
- ఇతర పొదుపు సంఘాలలో సభ్యత్వం ఉన్నవారు
- ఉద్యోగం చేస్తున్న వారు
- ఎల్లప్పుడు పోట్లాట పెట్టుకునేవారు
- రాజకీయ పార్టీలతో సంబంధాలు కల్గివున్నవారు

## సభ్యత్వ ఉపసంహారణ :

- ఎవరైనా సభ్యురాలు సంఘం నుంచి తన సభ్యత్వాన్ని రద్దు చేసుకోవాలనుకున్నచో ముందుగా సంఘానికి తెలియజేయాలి. ఈ సభ్యురాలు సంఘానికి చెల్లించవలసిన అప్పు లేదా ఇతర రుసుము బకాయిలు ఉన్నచో వాటిని క్లియర్‌చేసుకొని నాయకురాలు సభ్యుల అనుమతితో తన సభ్యత్వాన్ని ఉపసంహరించుకోవచ్చు.

# స్వయం సహాయక సంఘ విధులు

- క్రమం తప్పని సమావేశాలు జరపడం
- సక్రమమైన పొదుపులు - అప్పులు - వసూళ్ళు చేయటం
- కట్టుబాట్లు ఏర్పాటు - మార్పులు, చేర్పులు చేయటం
- కట్టుబాట్లు అమలు చేయటం
- వివిధ ఆర్థిక సంస్థల నుండి వెసులుబాటైన ఋణసహాయంతో సంఘ నిధిని సభ్యులమధ్య అప్పుల రూపంలో తిప్పడం
- సామాజికాభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనుట
- దిగువ పుస్తకాలు/రికార్డులు నిర్వహించటం
  - అడ్మిషన్ (సభ్యత్వ నమోదు) పుస్తకము
  - హాజరు పట్టిక
  - బ్యాంకు పాసు పుస్తకము - చెక్కు పుస్తకము
  - క్యాష్ బుక్
  - వ్యక్తిగత పాసు పుస్తకము
  - జనరల్ లెడ్జర్
  - మినిట్స్ బుక్
  - రశీదులు మరియు చెల్లింపు వోచర్లు
  - పొదుపులు - అప్పుల పుస్తకము
- యితర సంస్థలతో సత్సంబంధాలు కల్గివుండి వనరులసమీకరణలో మద్ధతు పొందుట
- స్వయం సహాయక సంఘం తన సంఘ సభ్యులు వ్యక్తిగతంగా తమ తమ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి శిక్షణావకాశాలను కలిగించుట
- సంఘ సభ్యులమధ్య సమన్వయము, సహకారము, పరస్పర అవగాహనను పెంపొందించుకోవడానికి శిక్షణావకాశాలను కలిగించుట
- సంఘ సభ్యులమధ్య సమన్వయము, సహకారము, పరస్పర అవగాహనను పెంపొందించి, సంఘ పటిష్టత, గుర్తింపు పొందేందుకు అందరికి సంబంధించిన సామాజిక ప్రయోజన కార్యక్రమాన్ని చేపట్టుట.

# సమావేశాలు – సమస్యలు

నేను ఇటివల మండలం ఆఫీసుకు వెళ్ళాను





అక్కడ చర్చించినా విషయాలన్నీ సభ్యులకు చెబుదామంటే మా సంఘ మీటింగ్ ఎవరు రారు ?
ఆ ప్రక్క సంఘంలో చూడండి ఏం చక్కా మాట్లాడుకుంటున్నారో?

అక్కడ అధికారులను కలిశాను

మా సంఘంలో అన్ని విషయాలు చర్చించుకుంటాము. పారదర్శకత, జవాబుదారీ తనము, బాధ్యత మా సంఘ సభ్యులందరికి ఉన్నాయి.

## సమస్య : 1

### సమావేశాలు లేక తికమక అవుతున్న సంఘాలు....

సంఘాలు ఏర్పాటు చేసుకొన్న తరువాత వారు నిర్ణయించుకున్న తేదీ ప్రకారము సక్రమంగా సమావేశాలు జరుపుకోకపోవడం సమస్య.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సమావేశాలు సక్రమంగా జరగకపోవడానికి ముఖ్యంగా గ్రామాలలో సరైన స్థలము లేకపోవుట వలన ఎక్కడ కూర్చొని సమావేశాలు జరుపుకోవాలో తెలియక సమావేశాలు జరగవు. | ❶ సమావేశాలు జరిపే స్థలం, సమయం, తేది అందరికీ (సభ్యులకు) అనుకూలంగాను, అందుబాటులోను వుండాలి. వాటిని నిర్ణయించేటప్పుడు సభ్యులందరి ఇష్టపూర్వకంగా అందరి ఆమోదం ప్రకారం నిర్ణయం చేయాలి. **ఉదా :** సమావేశ స్థలం కమ్యూనిటీ హాల్, స్కూల్ బిల్డింగ్, పంచాయతీ ఆఫీస్, అంగన్‌వాడీ బిల్డింగ్ అలా వేటిలోనైనా అందరూ చర్చించి నిర్ణయించుకోవచ్చు. ఇవి అందుబాటులో లేకపోతే సభ్యులందరి ఆమోదంతో ఏదైనా ఉమ్మడి ప్రాంతంలో సమావేశం జరుపుకోవచ్చు. |
| ❷ అందరికీ అనుకూలమైన సమయాన్ని నిర్ణయించు కోకపోవడము వలన ఒక్కొక్కసారి సమావేశాలు జరగవు; పనుల కాలము (సీజన్స్)లో కూడా జరగవు; ఒక్కొక్కసారి రాజకీయ కారణాల వలన జరగవు; ఇంట్లోవాళ్ళు సహకరించకపోవడం, పనుల ఒత్తిడి వలన కొంతవరకు, కొంతమంది రాకపోవడం వలన కూడా మీటింగులు జరగవు. | ❷ సమావేశాల ఆవశ్యకత, సమావేశాలు సక్రమంగా జరుపుకోకపోతే కలిగే నష్టాల గురించి సభ్యులకు తెలియజెప్పాలి. |
| ❸ ఆడవాళ్ళు సమావేశాలు జరుపుకుంటున్నప్పుడు మగవాళ్ళు హేళన చేయడం, చిన్నచూపు చూడటం వలన ఆడవాళ్లు కొంతవరకు భయపడి సమావేశాలు చేసుకోవడం నిలిపివేయడం జరిగింది. | ❸ పనుల కాలంలో, వారికి అనుకూలమైన సమయంలో అంటే రాత్రిపూట లేదా ఉదయాన్నే కాని (ఉ॥ 8 గం॥లోపు) సమావేశాలు పెట్టుకోవచ్చు. |
| ❹ సమావేశాల ఆవశ్యకత తెలియకపోవడం వలన కూడా సభ్యులు సమావేశాలు జరుపుకోక పోవడం | ❹ పనుల కాలంలో సమావేశాల సంఖ్య తగ్గించుకోవచ్చు. ఉదా: నెలకు రెండు సమావేశాలు జరుపుకొంటుంటే పనుల కాలంలో ఒకటి చేసుకోవడం. సమావేశ సమయాన్ని తక్కువ చేసుకొని ముఖ్యమైన విషయాలపై చర్చలు చేయాలి. హేళన చేసేవారి మాటలు పట్టించుకోకూడదని సభ్యులకు తెలపాలి. |
| ❺ సమావేశాలలో కేవలం పొదుపులు, అప్పుల కార్యక్రమాలే చేయడం వలన సభ్యులకు సమావేశాలు ఆసక్తికరంగా ఉండవు. కనుక పొదుపు, అప్పులే కదా అనే నిరుత్సాహముతో సమావేశాలు జరుపుకోవడం లేదు. | |



సమావేశానికి హాజరు కాని సభ్యుల కోసం ఎదురు చూస్తున్న మిగతా సభ్యులు

5 సక్రమంగా సమావేశాలు నిర్వహించుకొనే కొత్త సంఘాల సభ్యులను చూపించి ప్రోత్సాహ పరచాలి.

6 సమావేశాలలో పొదుపులు, అప్పులే కాక సభ్యులకు అవసరమైన వ్యక్తిగత, కుటుంబ సమస్యలపై కొంత చర్చలు చేయడం వలన. సమావేశాలు సభ్యులకు ఆసక్తి కరంగా ఉండేటట్లు చూడాలి.
(ఉదా: ఆరోగ్యపరమైన, విద్య పరమైన అంశాలు.) పై విధంగాచేస్తే సభ్యులకు సమావేశాలపై ఆసక్తి కలిగి సక్రమంగా సమావేశాలు జరుపుకొంటారు.

7 తన డబ్బుకూడా సంఘంలో ఉంది కనుక అది ఎంత వుంది? ఎక్కడ ఉంది? ఎవరు అప్పులు తీసుకున్నారు? ఎవరు కట్టడము లేదు? ముగింపు నిల్వ ఎంత వుంది? ఎక్కడ ఉంది? మొ॥ తెలుసుకోవలసిన బాధ్యత ప్రతీ సభ్యురాలికి ఉందని ముమ్ముందు ఏదైనా నిధుల దుర్వినియోగం జరిగితే నష్టం వారికేనని తెలియ చెప్పాలి.

8 సమావేశమును ఫెసిలిటేట్ చేసేవారు ముఖ్యంగా ఆ ప్రాంతంలో పండే పంటలు, వాటి ధరలు, వాతావరణ విశేషములు, ప్రభుత్వము చేపడుతున్న, చేపట్టబోతున్న కార్యక్రమములు, వివిధ స్థాయిలలో స్వయం సహాయక సంఘాలపై జరుగుతున్న చర్చలు, నిర్ణయాలు వంటివి చర్చించడం వలన సభ్యులకు సమావేశం పై ఆసక్తి కలిగి ఆలోచనా దృక్పథం మారే అవకాశం ఉంది.



సమస్య వచ్చిందని దిగాలు పడకండి! సమస్యను పరిష్కరించుకోవడానికే ఈ సమావేశము

## సమస్య : 2

### హాజరుకాని సభ్యులు వలన సంఘం ఎదుగుదలకి ఆటంకం....

సంఘంలో సభ్యులు నిర్ణయించుకొన్న తేదీ ప్రకారం జరుపుకునే సమావేశాలకు సభ్యులందరు హాజరు కాకపోవడం, ఒకవేళ హాజరైనా నిర్ణీత సమయానికి హాజరు కాకపోవడం అన్నది సమస్య.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ కుటుంబంలో పని ఒత్తిడి వలన, భర్త, అత్తమామలు, పిల్లలు అందరినీ చూసుకొనే బాధ్యతలు వుండటం వలన, మరియు పనుల కాలంలో పొలం పనుల వలన చాలామంది నెల నెలా జరిగే సమావేశాలకు విధిగా హాజరు కాకపోవడం జరుగుతుంది.<br>❷ అందరూ ఒక సమయానికి రాకపోవడం వలన కొంతమంది ముందు వచ్చినవాళ్ళు ఎదురుచూసి, విసుగుపుట్టి వెళ్ళి పోవడం జరుగుతుంది.<br>❸ ఒక్కొక్కరు ఒక్కో సమయానికి రావడం వలన సమావేశం మొదలయ్యేటప్పటికి ఆలస్యం అవుతోంది; అర్థగంట కాగానే మేము వెళ్ళాలి లేటు అవుతుంది అంటారు. ఈ కారణాల వలన సమావేశంలో అన్ని విషయాలు చర్చించడానికి అవకాశం వుండడం లేదు. కనుక నెలసరి సమావేశాలకు సభ్యులందరూ హాజరు కావడం లేదు. | ❶ సమావేశ తేదీ ముందే సభ్యులకు తెలుసు కనుక ముందుగానే ఇంటి పనులన్నింటిని చక్కబెట్టుకొని ఇంట్లోవారిని ఒప్పించి సమయానికి సమావేశానికి రావాలి.<br>❷ ఒకవేళ ఆలస్యంగా ఎవరైనా వస్తే అలా వచ్చిన వారిపై ఏమి చర్యతీసుకోవాలన్నది వారు పెట్టుకున్న కట్టుబాట్ల ప్రకారం అమలు పరచాలి.<br>❸ సమావేశానికి ముందు వచ్చిన సభ్యులు వెళ్ళి రాని సభ్యురాళ్ళను దగ్గరుండి తీసుకుని రావాలి. సభ్యురాళ్ళకు ఇంటి బాధ్యతలు ఎంత ముఖ్యమో సంఘ సమావేశం కూడా అంతే ముఖ్యమని తెలియచెప్పాలి.<br>❹ సమావేశాలలో చర్చించే అంశాలు సభ్యులకు ఉపయోగపడేవిగా, వాళ్ళ జీవితంలో మార్పు తీసుకొచ్చేవిగా ఉంటే (తెలియని విషయాలు తెలియచెప్పడం) సమావేశం ప్రాముఖ్యత సభ్యులకు తెలిసి క్రమంగా సమావేశాలకు వస్తారు.<br>❺ ప్రతి సభ్యురాలు తను వచ్చేటప్పుడు తనతో మిగిలిన వారిని తీసుకురావడం వలన ఎవరి సమయం వృధా కాదని, అందుకని ఏ సభ్యురాలైనా ఆలస్యం చేస్తే ఆమె ఇంటి ముందు నిలబడడం వలన తొందరగా వస్తారని చెప్పాలి. |

## సమస్య :3

### ఎజెండాలేక ఇబ్బందులనెదుర్కొంటున్న సంఘాలు....

అనుకున్న కట్టుబాట్ల ప్రకారం ఎజెండా తయారు చేసుకోలేకపోవుట, ఒకవేళ ఉన్నా దాని ప్రకారం సక్రమంగా సమావేశం నిర్వహించుకోలేకపోవుట.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సంఘానికి తగిన తర్ఫీదు లేకపోవుట వలన ఎజెండా ప్రకారం సమావేశాన్ని నిర్వహించుకొనాలి అనే కట్టుబాటు పెట్టుకొనలేరు.<br>❷ ఎజెండా ఎలా తయారు చేసుకోవాలి అనే విషయం వారికి తెలియకపోవుట, కార్యకర్త కూడా ఎజెండాకు తగినంత ప్రాముఖ్యత ఇవ్వకపోవుట, సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించుట జరుగుతుంది.<br>❸ గత నెలలో లేదా సమావేశంలో మాట్లాడుకున్న విషయాలు, తీసుకొన్న నిర్ణయాలపై సమీక్ష చేయరు. క్రమశిక్షణ, కట్టుబాట్లు లేని ఈ సంఘం ఒక గ్రుడ్డి సంఘం వలె నామమాత్రంగా సాగుతూ ఉంటుంది. సంఘంలో ఏమి జరుగుతున్నది ఎవరికీ తెలియదు.<br>❹ సంఘానికి ఎజెండా ఎంత ముఖ్యమైనదో సభ్యులకు తెలియక పోవడం వలన ఎజెండా తయారు చేసుకోలేకపోతున్నారు. | ❶ సమావేశం ఏ రకంగా చేసుకోవాలి, ఏ రకంగా చేస్తే సభ్యులు అందరూ వస్తారు, సమావేశాలలో ఎలాంటి విషయాలు చర్చించాలి అనే విషయాలన్నింటిపై కార్యకర్త సభ్యులకు అవగాహన కల్పించాలి.<br>❷ సమావేశంలో ఏయే విషయాలపై చర్చించాలను కొంటున్నావు అనేది సభ్యులను అడిగి తెలుసుకొని ఎజెండా తయారు చేసి, దానిలో ప్రాముఖ్యతనుబట్టి విషయాలపై చర్చలు చేయాలి.<br>❸ సమావేశం అనేది నామమాత్రంగా కాకుండా, సభ్యులకు ఉపయోగపడే విధంగా చేయాలి. అంటే ప్రతి సమావేశంలో క్రొత్త విషయం సభ్యులు తెలుసుకొనేటట్లు ఉండాలి.<br>❹ క్రితం నెలలో మాట్లాడుకొన్న విషయాలు, తీసుకొన్న నిర్ణయాలు ఎంతవరకు అమలు జరిగాయో చర్చించాలి.<br>❺ సమావేశానికి కట్టుబాట్లు ఉండి, ఆ కట్టుబాట్లు ఖచ్చితంగా అమలుపరిచే విధంగా ఉండాలి.<br>❻ ఎజెండా ప్రాముఖ్యత గురించి సభ్యులకు తెలియ జెప్పాలి. ఎజెండా తయారుచేసుకోవడం వలన ఏ విషయాలైతే ముఖ్యంగా ఆయా సమావేశాలలో చర్చించాలనుకున్నారో వాటిపై చర్చించవచ్చు. అనవసర విషయాలపై ఎక్కువసేపు చర్చించి సమయం వృధా చేయడానికి అవకాశం ఉండదు. |

## సమస్య :4

## సమావేశాలు తమను ఉద్ధరించేవి కావు అంటున్న కుటుంబ సభ్యులు....

సమావేశాలకు నేను రాను మా ఇంట్లో వారు వద్దు అన్నారు. ఎందుకు ఆ సమావేశాలకు వెళ్లి ఏమి ఉద్ధరిస్తావు? ఏమితెస్తావు ? అప్పులు కాని, డబ్బులు కాని తెచ్చేటట్లు అయితేనే సమావేశంకు వెళ్లు అంటున్నారు అని అంటున్న సభ్యులు.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సమావేశాల ప్రాముఖ్యత తెలియకపోవడం వలన<br>❷ సమావేశాలలో ఏమి జరుగుతుంది అనేది వెళ్ళినవారు తిరిగి వచ్చిన తరువాత ఇంట్లో చెప్పకపోవడంవలన<br>❸ సమావేశాలలో తగిన సమయం లేక అన్ని విషయాల గురించి చర్చలు జరగక పోవడంవలన<br>❹ సమావేశాల ఉపయోగం తెలియకపోవడం వలన, మగవాళ్లకు ఆడవాళ్ళను బయటకు పంపడం ఇష్టము లేక వారిని సమావేశాలకు పంపించడం లేదు.<br>❺ సంఘం అంటే కేవలం డబ్బు, రుణాలు వస్తాయని అనుకోవడం వలన<br>❻ పై కారణాల వలన కుటుంబంలో వారు సమావేశాలకు పంపడానికి ఒప్పుకోకపోవడం అనేది సమస్య. | ❶ సంఘం ద్వారా డబ్బులు, అప్పులు కూడా వస్తాయి, అవన్నీ రావాలంటే సభ్యులందరము సమావేశాలు జరుపు కొని, చర్చలు చేసుకొని సంఘాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళితే అప్పుడు సంఘానికి అన్నీ వస్తాయి అని కుటుంబ సభ్యులతో సంఘ సభ్యులు చర్చలు చేయాలి.<br>❷ సమావేశాలు అనేవి డబ్బులు పంచడానికో లేదా ఇంకేదయినా ఇవ్వడానికో జరిపేవి కావు. సమావేశాలు అనేవి మనకు తెలియని విషయాలు తెలుసుకోవడానికి మరియు మన సంఘాలు ఏ విధంగా నడిపించుకోవాలి, ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవాలి, సంఘాల ద్వారా ఏ రకంగా మనము వ్యక్తిగతంగా, కుటుంబ, గ్రామ, సమాజ అభివృద్ధి సాధించవచ్చు అనే విషయాలన్నింటి గురించి చర్చించి కొంతవరకు మార్పు తీసుకొని రావడానికి సమావేశాలు ఉపయోగపడతాయి.<br>❸ సభ్యులు కూడా సమావేశాలకు వెళ్ళివచ్చిన తర్వాత సమావేశాలలో నేర్చుకున్న విషయాల గురించి మరియు వాటివలన జీవితంలో ఎలాంటి అభివృద్ధి సాధించవచ్చు అనేది కుటుంబ సభ్యులతో చర్చించాలి. |

## కేస్‌స్టడీ :

విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి గ్రామములోని స్వయం సహాయక సంఘంలోని రాజమ్మ అనే సభ్యురాలు ఎప్పుడూ సమావేశాలకు వెళ్ళదు. ఎప్పుడు వెళదామన్నా ఇంట్లోవాళ్ళు ఒప్పుకోరు, సమావేశాలకు వెళ్ళి ఏమి తెస్తావు, ఏమి ఇస్తారు  అని గేలిచేసేవారు. రాజమ్మ తాను సమావేశాలకు వెళితే తెలియని విషయాలన్నీ తెలుస్తాయి అని ఎంత చెప్పినా ఇంట్లోవాళ్ళు ఒప్పుకోలేదు. ఒకసారి రాజమ్మ అనారోగ్యంతో బాధపడుతూ వుంటే అది తెలిసి సభ్యులందరూ వచ్చి చూసి వెళ్ళారు. రత్నమ్మ అనే ఒక సభ్యురాలు ఆమె రోగానికి మందు తయారుచేసి ఇచ్చి (ఆయుర్వేదం) తర్వాత ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి చూపించుకోమని అక్కడ డాక్టర్ తనకు తెలుసని, తానే తీసుకెళ్లి చూపిస్తాననీ, తొందరగా నయం అవుతుందని చెప్పి రాజమ్మను ఆస్పత్రికి తీసుకెళ్ళి డబ్బు ఖర్చు లేకుండా చూపించి తీసుకొచ్చిన రెండు రోజులకు రాజమ్మ ఆరోగ్యం నయమయింది.

అప్పుడు రాజమ్మ వారి ఇంట్లోని వారందరు రత్నమ్మను మెచ్చుకొని ఇంత తెలివి నీకు ఎక్కడి నుంచి వచ్చింది, హాస్పిటల్, డాక్టర్లు ఎలా తెలుసు, డాక్టర్లతో ఇంత తెలివిగా మాట్లాడటం నీకు ఎలా వచ్చింది అని ఆశ్చర్య పోయారు. అప్పుడు రత్నమ్మ "నేను సంఘంలో వున్నాను. మీ రాజమ్మ సంఘంలో వుంది. నాకు ఇన్ని విషయాలు తెలుసు, రాజమ్మకు తెలియవు, ఎందుకని? నేను క్రమం తప్పకుండా సమావేశాలకు వెళతాను, అందుకే నేను ఈ విషయాలు తెలుసుకున్నాను" అని చెప్పగా అప్పటి నుంచి రాజమ్మను వారి కుటుంబ సభ్యులు విధిగా ప్రతి సమావేశానికి పంపుతున్నారు.

## సమస్య : 5

### పొదుపు పంపుతాము కాని సమావేశానికి రాము అంటున్న సభ్యులు....

సమావేశానికి రమ్మని నాయకురాలు సభ్యులను పిలిస్తే కొన్ని చోట్ల సభ్యులు పొదుపు డబ్బు పంపుతాము కాని సమావేశానికి రాము, సమావేశానికి వచ్చి ఏమి చేయాలి, అక్కడైనా పొదుపు కట్టడమే కదా ! కనుక డబ్బు పంపుతాం కాని సమావేశానికి రాము అని అంటున్నారు.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ కొన్ని గ్రామాలలో చాలా మంది సభ్యులు సమావేశాలకు వచ్చి ఏమి చేయాలి, పొదుపు డబ్బులు ఎవరితోనైనా పంపిస్తాము సమావేశంలో చేసేది ఏముంది. వెళితే అందరూ ఒకే సమయానికి రారు, చాలాసేపటివరకు కూర్చోవాలి, చాలా సమయం వృథా అవుతుంది అని చెబుతారు | ❶ సమావేశం ఆవశ్యకత; సమావేశంలో ఏమేమి చర్చిస్తారు దాని వల్ల వారి జీవితాలకు ఏ రకంగా ఉపయోగం అనేది సభ్యులందరికీ తెలియజేయాలి.<br>❷ సమావేశం అంటే కేవలం పొదుపులు, అప్పులు మాత్రమే కాదు. అక్కడ మనము ప్రతిసారి కొన్ని మనకు తెలియని కొత్త |

2 అంతసేపు కూర్చున్నా, అందరి దగ్గర పొదుపులు కట్టించుకొంటారు. అంత మాత్రం దానికి సమావేశంకు రావడం, ఎదురు చూడటం ఇవన్నీ ఎందుకు, ఇంట్లో కూర్చొని పొదుపు డబ్బులు పంపితే చాలు కదా అని చాలామంది సమావేశాలకు రాకుండా ఉంటారు

3 సమావేశంలో ఆర్థిక లావాదేవీలు, నిర్ణయాల గురించి చర్చించకపోవడం వలన అలా జరుగుతుంది

4 సమావేశంలో కేవలం పొదుపులు తీసుకోవడం, అప్పు కట్టించుకోవడం మాత్రమే జరుగుతుంది, ఇంకేమి ఉండదు అని సభ్యులు అభిప్రాయ పడటం వలన

5 సమావేశాలు సృజనాత్మకంగా చేయకపోవడం, సభ్యులు శ్రద్ధ చూపించక పోవడం

విషయాలను చర్చిస్తాము. దాని వలన మనకు కొత్త సమాచారం తెలుస్తుంది అనేది తెలియచెప్పాలి.

3 సమావేశానికి అనుకున్న సమయానికి అందరూ ఖచ్చితంగా రావాలని కొన్ని కట్టుబాట్లు ఏర్పాటు చేసుకోవాలి. చేసుకొన్న కట్టుబాట్లను ఖచ్చితంగా అమలుపరచాలి.

4 పొదుపు డబ్బులు సమావేశానికి రాకుండా సభ్యురాలు ఇతరులతో పంపితే అది సక్రమంగా చేరిందా, లేదా అనేది తెలియదు. దాని వలన సభ్యులలో మనస్పర్థలు వస్తాయి. కనుక సమావేశానికి సభ్యులందరూ వచ్చి, అందరూ కలిసి మన సంఘం ఎలా నడవాలి అనేది చర్చించుకోవడం మరియు సంఘానికి ఉద్దేశ్యాన్ని ఏర్పాటుచేసుకొని దానిని ఎలాచేరుకోవాలనే విషయాలన్నీ సమావేశాలలో చర్చించుకోవాలి.

**ఉదా :** ఇద్దరు అక్కా చెల్లెళ్ళు కలిసి ఒక వ్యాపారం పెట్టుకుంటే ఆ వ్యాపారం నడపటాన్ని గురించి తెలుసుకోవలసిన బాధ్యత ఇద్దరికీ ఉంటుంది. అదే విధంగా సంఘం కూడా కొంతమంది మహిళలు కలసి పెట్టుకున్నదే కనుక దీనిని ఎవరు చూడాలి? నడపాలి? అని అర్థం అయ్యేటట్లు వివరించాలి.

## కేస్‌స్టడీ :

చిత్తూరు జిల్లా పెరుమాళ్ళపల్లి గ్రామంలో గంగమ్మ సంఘంలోని జయమ్మ అనే సభ్యురాలు సంఘం సమావేశానికి సక్రమంగా రాదు. ఎందుకు రావడం లేదు అని అడిగితే, తనకు అప్పు కావలసినప్పుడు వస్తానని అంతవరకు పొదుపు చేసుకొంటూ ఉంటానని చెప్పి తాను సంఘంకు రాకుండా పక్కింటి జయలక్ష్మి ద్వారా డబ్బులు పంపించేది. కాని జయలక్ష్మిపై ఉండే నమ్మకంతో జయమ్మ ఎప్పుడూ సంఘానికి వచ్చి తన లెక్కలు చూసుకునేది కాదు. 3 నెలల తరువాత జయమ్మకు అప్పు కావాలని సంఘంకు వచ్చి సభ్యులను అడగగా బుక్ కీపర్ జయమ్మ పొదుపు మొత్తం లెక్కచూసి రెండు నెలలు పొదుపు నీవు కట్టలేదు అని జయమ్మను

అడిగితే నేను నెల నెలా ఖచ్చితంగా జయలక్ష్మితో పొదుపు డబ్బు పంపాను అని జయమ్మ చెప్పింది. అప్పుడు జయమ్మ మరియు సభ్యులు అంతా కలిసి జయలక్ష్మిని అడిగితే నాకే అవసరం ఉండి వాడుకున్నాను, కనుక గడువు ఇస్తే తిరిగి ఇచ్చేస్తాను అని చెప్పింది. జయమ్మ అప్పట్నుంచీ సంఘ సమావేశంకు తానే రావడం, పొదుపు డబ్బులను తనే కట్టడం, పుస్తకాలను తనిఖీ చేసుకోవడం జరుగుతున్నది. దీనివలన జయమ్మకు కొత్త విషయాల గురించి మరియు సంఘంలో ఏమేమి కార్యక్రమాలు జరుగుతున్నాయనేది తెలుస్తుంది. అంతేకాక జయమ్మకు సమావేశం ఆవశ్యకత గురించి తెలిసింది.




**సమావేశము అంటే ఒక చర్చావేదిక- సమస్యల సాధనకు ప్రతీక - ఓ చిన్న కధానిక**

| | | |
|---|---|---|
|  |  |  |
| సమావేశంలో ఇళ్ళ పట్టాల గురించి అందరు సభ్యులు చర్చించారు | అధికారులతో చర్చించడానికి ఇద్దరు సభ్యులను పంపిస్తారు. | వారు బస్సు ఎక్కి మండల ఆఫీసుకు వెళతారు |
|  |  |  |
| మండల ఆఫీసు చేరుకుంటారు | అధికారులతో చర్చిస్తారు | కార్యకర్త ఇళ్ళ పట్టాల మంజూరు అయినట్టు తెలియజేస్తుంది |
|  సభ్యులందరు ఇళ్ళ పట్టాలు గురించి చర్చిస్తారు |  | సమావేశానికి హాజరయిన వారందరికి ఇళ్ళ పట్టాలు వస్తాయి. సమావేశానికి హాజరుకాని సభ్యులకు ఇళ్ళ పట్టాలు రావు. హాజరుకాని సభ్యులు తమ తప్పును తెలుసుకుంటారు. |

## సమస్య : 6

## గ్రామం వదిలి బయటి సమావేశాలకు రామంటున్న సభ్యులు....

పక్క గ్రామాలలో, మండల, జిల్లా స్థాయిలో జరిగే సమావేశాలకు సభ్యులు హాజరు కావడానికి ఇష్టం చూపకపోవడం అనేది సమస్య.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ కుటుంబాన్ని వదిలి బయటకు వెళితే కష్టం అవుతోందని, బయటకు వెళ్ళడానికి భయమేసి వెళ్ళకపోవడము<br>❷ బయటి మీటింగులకు పంపడానికి ఇంట్లోవాళ్ళు ఒప్పుకోకపోవడం<br>❸ బయటి సమావేశాలకు వెళితే గ్రామంలో ఎవరు ఏమనుకుంటారో అనే భయం వలన సభ్యులు మండల, జిల్లా స్థాయిలో జరిగే సమావేశాలకు హాజరవ్వడానికి ఇష్టం చూపకపోవడం.<br>❹ సమావేశాలంటే ఊరికే వెళ్ళిరావడమే, వాటి వలన ఉపయోగం ఉండదు అని సభ్యులకు అపోహ ఉండడం<br>❺ సమావేశాల వలన కలిగే ఉపయోగాల గురించి తెలియక పోవడం | ❶ సమావేశాలకు పంపము అని అంటున్న సభ్యుల కుటుంబంలోని పెద్దలతో సమావేశము యొక్క ఆవశ్యకత, అక్కడ సౌకర్యాల గురించి వివరంగా చెప్పాలి. అదే విధంగా మీతో పనిచేసే, మీ సంఘానికి ఎప్పుడూ వచ్చే కార్యకర్త మీతోనే ఉండి అక్కడ అన్నీ చూసుకొని తిరిగి ఇంటికి వచ్చేవరకు బాధ్యత తీసుకొంటుంది అని చెప్పాలి.<br>❷ సమావేశాలకు వెళ్ళినప్పుడు బాధ్యతలన్నీ సంబంధిత సంస్థవారు జాగ్రత్తగా చూసుకొంటారు, మీతోనే వుంటారు అని చెప్పాలి మరియు సమావేశ ప్రాముఖ్యత గురించి తెలియజేయాలి.<br>❸ సమావేశము తేదీని 3, 4 రోజులు ముందుగా చెప్పాలి. గ్రామములోనేకాక, బయట జరిగే సమావేశాలకు హాజరు కావడం వలన, సభ్యులకు, ఇతర సంస్థలు, వ్యవస్థల గురించి తెలుస్తుంది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల అధికారులు పరిచయమవుతారు.<br>ఉదా : గవర్నమెంటు అధికారులతో పరిచయాలు, గవర్నమెంటు ఆఫీసులు తెలుస్తాయి. అందరితో మాట్లాడగలిగే సామర్థ్యం పెరుగుతుంది మరియు అన్ని రకాల సమాచారాలు తెలుస్తాయి అని వివరిస్తే పై సమస్య పరిష్కారం అవుతుంది. |

## సభ్యులు చేయవలసిన, చేయకూడని పనులు

| చేయవలసిన పనులు | చేయకూడని పనులు |
|---|---|
| ● సమావేశానికి సంబంధించిన కట్టుబాట్లను ఏర్పాటు చేసుకోవాలి<br>● నిర్ణయించుకొన్న తేదీ ప్రకారం ఖచ్చితంగా సమావేశం జరుపుకోవాలి<br>● సమావేశానికి సభ్యులందరు తప్పక హాజరు కావాలి. ముఖ్యమైన నిర్ణయాలన్నీ సమావేశాలలోనే తీసుకోవాలి<br>● పొదుపులు కట్టడం, అప్పులు తీసుకోవడం లాంటి అన్ని ఆర్థిక లావాదేవీలు సమావేశంలోనే జరగాలి.<br>● ప్రతీ సమావేశంలో కొంత కొత్త సమాచారం తెలుసుకొనేటట్లు సమావేశాలు ఉండాలి.<br>● సమావేశంలో జరిగే చర్చలు ఉపన్యాస పద్ధతిలో కాక భాగస్వామ్య పద్ధతిలో ఉండాలి<br>● ప్రతీ సమావేశానికి ఖచ్చితంగా ఎజెండా తయారుచేయాలి<br>● పుస్తకాలన్నీ కూడా సమావేశంలోనే రాయాలి. సమావేశ మినిట్స్‌నుకూడా సమావేశంలోనే రాయాలి | ● సమావేశంలో అందరూ ఒకేసారి మాట్లాడకూడదు<br>● సంఘంలో సగం కంటే తక్కువ సభ్యులు వచ్చినప్పుడు సమావేశం వాయిదా వేయాలి<br>● పుస్తకాలు, హాజరు, ఎజెండా లేకుండా సమావేశం జరపకూడదు<br>● సమావేశాలు ఎక్కడబడితే అక్కడ పెట్టుకోకూడదు. అంటే చర్చలు చేసుకోవడానికి ఇబ్బంది కలిగేచోట పెట్టరాదు<br>● సమావేశం జరిగేటప్పుడు సమావేశాన్ని పక్కదోవపట్టించే వారిని, ఇబ్బంది కలిగించేవారిని, సంఘానికి సంబంధం లేని వారిని సమావేశంలోనికి రానివ్వకూడదు |

## సమావేశ నిర్వహణా పద్ధతి

- సభ్యులందరూ ఒకేచోట గుండ్రంగా కూర్చోవాలి
- ప్రార్థనాగీతంతో సమావేశం మొదలు పెట్టాలి
- హాజరు తీసుకోవాలి
- ఎజెండా తయారు చేయాలి
- క్రితం సమావేశంలో జరిగిన అంశాలను చర్చించాలి
- అప్పు దరఖాస్తుల స్వీకరణ
- అప్పు పరిశీలనా మరియు మంజూరీ
- సామాజిక కార్యక్రమాలపై చర్చ
- మీటింగ్‌లో వసూలైన మొత్తం అందరికీ చెప్పాలి
- బ్యాంకుకు వెళ్ళే వ్యక్తిని ఎంపిక చేయాలి
- బుక్ కీపర్ మీటింగ్ మినిట్స్ పుస్తకంలో వ్రాసిన విషయాలను సభ్యులకు చదివి వినిపించాలి. సభ్యులందరితో సంతకాలు చేయించాలి

## అవరోధాలు - పరిష్కార మార్గాలు

| | |
|---|---|
| • లీడర్ రాకపోవడం | • ప్రతి సమావేశానికి ఒక్కొక్క అధ్యక్షురాలిని సమావేశం నిర్వహించుటకు ఎన్నుకొను పద్ధతిని పాటించాలి<br>• సభ్యులందరూ సంఘ నిర్వహణపై శిక్షణ పొందాలి |
| • బుక్ కీపర్ రాకపోవడం | • సభ్యులలో వ్రాయగల వారు పుస్తకాలు వ్రాయడం<br>• సభ్యుల కుటుంబ సభ్యులు లేదా ఇతరుల సహాయంతో పుస్తకాలు వ్రాసుకోవడం |
| • పెళ్ళిళ్లు, తిరునాళ్ళు, పండుగలు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు | • సభ్యుల అంగీకారంతో సమావేశం వాయిదా వేయడం<br>• వేరే తేదీన ఇంకొక ప్రత్యేక సమావేశం జరపడం<br>• 2/3వ వంతు సభ్యురాళ్ళు ఉన్నచో సమావేశం జరపడం |
| • వలసలు | • ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను సంఘం ఆలోచించడం<br>• ఒక నిర్ణీతమైన రోజు/తేదీన అందరూ గ్రామానికి వచ్చి సమావేశం జరుపుకోవడం |
| • పుస్తకాలు లేకపోవడం | • చిన్న నోట్ పుస్తకాలు వ్రాసుకోవడం<br>• గుర్తుపెట్టుకొని వ్రాయించడం |

## సమావేశం యొక్క ప్రాముఖ్యత :

- సంఘానికి సమావేశం ప్రాణం వంటిది
- సభ్యులు ఒకరితో ఒకరు మాట్లాడుకునే అవకాశం కలుగుతుంది
- సభ్యులకు క్రమశిక్షణ అలవడుతుంది
- సభ్యులు పొదుపులు, అప్పలు, వడ్డీలు అందరి సమక్షంలో చెల్లించుటకు వీలవుతుంది. డబ్బులలో తేడా రావడానికి అవకాశం ఉండదు
- సామాజిక కార్యక్రమములపై సభ్యులు చర్చించుకొనుటకు అవకాశం కల్పిస్తుంది
- సభ్యులు తీసుకున్న అప్ప, చెల్లింపులపై సమీక్ష చేయడానికి మరియు చెల్లించని వారిపై ఒత్తిడి తేవడానికి ఉపయోగపడుతుంది
- సభ్యుల నైపుణ్యము, విజ్ఞానము పెంపొందించుకొనుటకు అవకాశం కల్పిస్తుంది
- సభ్యులు సంఘటిత శక్తిగా ఎదుగుటకు ఉపయోగపడుతుంది
- సభ్యులందరికి సంఘంలో జరిగే అన్ని విషయాలను తెలియచేయడానికి వీలువుతుంది, సంఘం పారదర్శకతను పెంచుతుంది
- సంఘంలో సమిష్టి నిర్ణయం చేయుటకు వీలువుతుంది
- సభ్యుల మధ్య అవగాహన, సహకారము, ఐకమత్యము పెరుగుతుంది
- సంఘంలో అవకతవకలను అరికట్టుటకు వీలవుతుంది
- సంఘం పనితీరును గమనించుటకు వీలవుతుంది
- పారదర్శకత ఉంటుంది

# నాయకత్వము – సమస్యలు



## సమస్య : 1

### భారమంతా మీదపడుతుందని భయపడుతున్న మహిళలు...

సంఘ నాయకురాలిగా ఉండటానికి ఎవ్వరూ ఇష్టపడక, ముందుకు రాకపోవడం

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ నాయకురాలిగా ఉంటే అన్ని పనులు తనే చేయాలనే భయం వలన<br>❷ సంఘంలో మంచి జరిగినా, చెడు జరిగినా ముందు నాయకురాలినే ప్రశ్నిస్తారు అనే భయం వలన<br>❸ నాయకురాలిగా ఉంటే బాధ్యతలన్నీ తనమీదే పడతాయి అనే భావం వలన<br>❹ నాయకురాలిగా ఉంటే ఎక్కువగా తిరగాలి అనే భావన ఉండడం వలన<br>❺ నాయకురాలిగా ఉండాలంటే చదువు, తెలివి తేటలు బాగా ఉండాలి అనే భావన వలన | ❶ సంఘంలో నాయకురాళ్ళ విధులు, బాధ్యతలు, సభ్యుల విధులు/బాధ్యతల గురించి వివరంగా చెప్పాలి<br>❷ సంఘంలో ఏది జరిగినా సభ్యులు, నాయకురాళ్ళు ఇద్దరూ బాధ్యులు<br>❸ సంఘంలో జరిగే సమావేశాలకుగాని, బ్యాంకు పనులకు గాని నాయకురాలు ఒక్కతే కాకుండా ఒక్కొక్కసారి ఇద్దరు సభ్యుల చొప్పున వెళ్ళాలి అని కట్టుబాటు ఏర్పాటు చేసుకోవాలి<br>❹ నాయకురాలిగా ఉండాలంటే ఖచ్చితంగా చదువు ఉండాలనే నియమం లేదు |

## సమస్య : 2

### మంచి నాయకురాలిని ఎన్నుకోవడంలో ఇక్కట్లు పడుతున్న సభ్యులు...

మంచి నాయకత్వ లక్షణాలున్న నాయకులను ఎన్నుకోవడంలో సమస్య

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ ఒకే సంఘంలో ధనిక, పేద వర్గాలకు చెందిన మిశ్రమ సభ్యులు ఉండడం వలన ధనిక సభ్యులు నిరుపేద సభ్యులను అన్ని విధాలా వెనుక వరుసలో ఉంచుతుండటం.<br>❷ ధనికుల అవసరాలు, పేదల అవసరాలు వేరు వేరుగా ఉండటం; ధనికులలో ఎక్కువగా | ❶ మంచి భావాలు కలిగిన, నిజాయితీ పరులైన సభ్యులను నాయకులుగా సభ్యులందరూ కలిసి ఎన్నుకోవాలి.<br>❷ పొదుపులు, అప్పులు సక్రమంగా కడుతూ సభ్యుల దగ్గరకూడా కట్టించే విధంగా ఉండేవారిని ఎన్నుకోవాలి. |

అధికార దాహం వలన సంఘంలో వారు నాయకులుగా చెలామణీ అవటం.

3. పేదలలోని బలహీనతలను ఆధారం చేసుకొని, పేదలకు సంఘ నాయకత్వంలో చోటు ఇవ్వకపోవటం.

4. సంఘాలలో నాయకురాళ్ల ఎన్నిక విషయంలో రాజకీయ నాయకుల జోక్యం ఉండడం

5. అనువైన వారిని సంఘ నాయకులుగా పెట్టుకుంటున్న అధికారులు / కార్యకర్తలు

6. ప్రభుత్వం చేసిన సంఘాలను నియంత్రించటానికి పట్టు నిలబెట్టుకోవటానికి తక్కువ కదలికతో సమాచారాన్ని పొందటానికి, నాయకురాళ్లనే అధికారుల వద్దకు రప్పించుకోవటానికి వారికి అన్ని విధాలా అనువైన వారినే సంఘం నాయకులుగా ఏకపక్షంగా అధికారులే నియమించడం

7. ఎటువంటి వారిని సంఘనాయకులుగా ఎన్నుకోవచ్చు అనేది సభ్యులకు తెలియకపోవడం వలన, ఎవరైతే బాగా తిరుగుతూ, గట్టిగా మాట్లాడుతుంటారో అలాంటి వారినే నాయకులుగా ఎన్నుకోవడం

3. అన్ని వర్గాల వారిని నాయకులుగా ఎన్నుకొనేటట్లు చూడాలి. నాయకుల ఎన్నిక విషయం సభ్యుల నిర్ణయాలకే వదలాలి.

4. బయటి వ్యక్తుల ప్రమేయం ఉండకుండా చూడాలి.

5. సంఘం భావన, ఉద్దేశ్యాలు, లక్ష్యాలపై అవగాహన ఉండి సంఘంలో ఉన్న సభ్యులందరి పరిస్థితుల గురించి ఆలోచించగలిగేటట్లు ఉండి అందరి సమస్యలను తన సమస్యలుగా భావించి పనిచేయగలిగేటట్లు మరియు లక్ష్యాలను సాధించే దిశలో సభ్యులందరినీ కలుపుకొని ముందుకు తీసుకెళ్లేటటువంటి సభ్యులను నాయకులుగా ఎన్నుకోవాలి.

6. ఏర్పాటయిన సంఘాలలో ఈ సమస్య ఉంటే సభ్యులందరితోకలసి కూర్చొని సంఘానికి మంచి నాయకురాలు ఉంటేనే మన సంఘం అనుకొన్న లక్ష్యాలను సాధించే దిశలో వెళ్లడానికి, సాధించడానికి వీలుగా ఉంటుంది కనుక ప్రస్తుతం ఉన్న నాయకురాలితో సభ్యులందరూ కలిసి చర్చలుచేసి ఆమెతో బాగా పనిచేయించుకోవడం చేయాలి లేదా నాయకురాలిని మార్చి సభ్యులకు అనువైన నాయకురాలిని ఎన్నుకోవాలి

7. నాయకులను ఎన్నుకునేటప్పుడు మంచి లక్షణాలున్న వారిని ఎన్నుకోవాలి. అయితే అన్ని మంచి లక్షణాలు ఒకే వ్యక్తిలో ఉండవు కనుక మనమనుకున్న లక్షణాలలో కనీసం సగం లక్షణాలున్న వ్యక్తిని నాయకురాలిగా ఎన్నుకుని మిగిలిన లక్షణాలను అభివృద్ధి చేసుకునేటట్లు ప్రోత్సాహించాలి.

## సమస్య : 3

## వడ్డీ వ్యాపారం, చీట్లు నడిపే మహిళల వల్ల సంఘానికి చేటు...

సంఘ నాయకులుగా వడ్డీ వ్యాపారం చేసే మహిళలు, చీట్లు నడిపే మహిళలు ఉండడమనేది పెద్ద సమస్య

### కారణాలు

1. ఇది మరీ దారుణం! ఈ మధ్య సంఘాలలోని గ్రామాలలో చిట్టీ నడిపే మహిళలు, వడ్డీ వ్యాపారాలు చేసే మహిళలు, ప్రైవేటు సంస్థలలో స్కీములు కట్టించే మహిళలు రావటం, వారు సంఘాలను ఆధారం చేసుకొని వారి కార్యక్రమాలను సంఘాల ద్వారా నడిపించడం వలన సంఘాలలో వడ్డీ రేట్లు ఎక్కువగా పెట్టి సంఘాన్ని కూడా వ్యాపారంలాగ చూస్తున్నారు. దీని వలన సంఘాలలో గొడవలు వస్తున్నాయి
2. సంఘంలో పొదుపులు చేస్తూనే ఇతర సభ్యులను చీటీలలో చేర్పించటం
3. సంఘం నుండి అప్పులు తీసుకొని బయటి వారికి ఎక్కువ వడ్డీకి అప్పులు ఇవ్వటం
4. సంఘ సభ్యులు వడ్డీ వ్యాపారం చేసే మహిళలకి అన్నీ బాగా తెలుసు అనే ఉద్దేశ్యంతో వారినే నాయకులుగా ఎన్నుకోవడం

### పరిష్కారం

1. సంఘ నాయకులుగా వడ్డీ వ్యాపారం చేసే మహిళలు, చీట్లు నడిపే మహిళలను సంఘాలలో ఎన్నుకోకుండా ఉంటే మంచిది.
2. సంఘానికి, చీటీలకు సంబంధం లేదని లీడర్లుగా ఎన్నిక చేసేటప్పుడు సభ్యులకు, లీడర్లకు తెలియజేయాలి.
3. సభ్యులకు కూడా ఇక్కడ సంఘంలో ఉండడం, అక్కడ చీటీలలో ఉండడం, ఒక సమయంలో డబ్బులు కట్టకపోతే ఎదురయ్యే సమస్యలను తెలియజెప్పాలి.
4. సంఘంలో అప్పు తీసుకొని, ఆ డబ్బును చిట్టీలకు కట్టడం వంటివి సభ్యులు, నాయకులు ప్రోత్సహించకుండా చూడాలి.
5. సంఘం నుండి అప్పు తీసుకొని, బయట ఎక్కువ వడ్డీకి ఇవ్వడం వంటివి లేకుండా ఉండే విధంగా కట్టుబాటు పెట్టుకోవడం.

## కేస్‌స్టడీ :

ఆదిలాబాద్ జిల్లాలో కేశవాయనిపేట గ్రామంలోని దేవుడమ్మ సంఘంలో కమలమ్మ అనే సభ్యురాలు ఉంది. కొత్తగా 1000/- కడితే పట్నంలో ఇంటి జాగా వస్తుందని, కొత్త స్కీము ఉందని సభ్యులు అందరినీ ఒప్పించి 14 మంది సభ్యుల దగ్గర 1000/- చొప్పున కట్టించుకొన్నది. ఇలా 14,000/-లను ఆ స్కీము నడిపే పెద్దలకు ఇవ్వడం, 2 నెలల తరువాత ఆ స్కీమ్‌ను ఎత్తివేయడం, వారు పరారీ కావడం జరిగింది. ఈ విషయం తెలుసుకొన్న సభ్యులు అందరూ భయపడి నాయకురాలిని ఒత్తిడి చేయడం, నాయకురాలికి సంబంధించిన కుటుంబ సభ్యులను గట్టిగా అడగడం వల్ల సంఘం నుండి 14,000/- అప్పు తీసుకొని

సభ్యులందరికి తిరిగి కట్టడం జరిగింది. వెంటనే కమలమ్మను నాయకత్వము నుండి తప్పించి రాణమ్మను నాయకురాలుగా ఎన్నుకోవడం జరిగింది.

## సమస్య : 4

## నాయకత్వంలో మార్పులేక ఇబ్బంది పడుతున్న సంఘాలు....

### కారణాలు

❶ రెండవస్థాయి నాయకులు తయారు కాకపోవటం, ఒకసారి ఎన్నుకున్న నాయకులు వారే సంఘ నాయకులుగా ఉండటం, రెండవస్థాయి నాయకత్వాన్ని సంఘంలో అభివృద్ధి చేసుకోలేకపోవటం, సంఘంలో ఉన్న ఇతర సభ్యులకు, శక్తియుక్తులున్న వారికి అవకాశం కల్పించ కపోవటం. క్లిష్ట పరిస్థితులలో సంఘంలో ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి వారి మీదనే ఆధారపడటం.

❷ నాయకుల మార్పునకు బ్యాంకు ఖాతా నిర్వహణలో సమస్యలు తలెత్తడం, బ్యాంకువారు నాయకులను మార్చటానికి ఒప్పుకోకపోవటం.

❸ సభ్యులలో ఉన్న సహజమైన బలహీనతలు, వారికి అవకాశాన్ని వినియోగించుకోలేకుండా చేస్తున్నాయి.

❹ సంఘాలలో నాయకత్వ మార్పిడి, అందరూ నాయకత్వం చేపట్టే విధంగా ప్రణాళిక లేకపోవడం

❺ నెలకొక సభ్యురాలు సంఘ సమావేశాన్ని నిర్వహించే విధంగా ప్రణాళిక చేయకపోవుట.

### పరిష్కారం

❶ సంఘం ఏర్పాటు చేసేటప్పుడే నాయకులు ఎంత కాలం నాయకురాలిగా ఉంటారు అనేది, నాయకులు చేయవలసిన పనులు, బాధ్యతలు వంటివి తెలియచెప్పాలి.

❷ కొత్త నాయకులను ప్రోత్సహించడం, వారిని ఉత్తేజపరిచి అన్ని కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చూడాలి.

❸ కొత్త నాయకులకి క్లిష్ట సమస్యలు ఎదురైనపుడు సభ్యులందరితో చర్చించాలి. సమస్యలు ఎదుర్కొనేందుకు తగిన ప్రోత్సాహం సభ్యుల నుండి వచ్చేటట్లు చేయాలి.

❹ నెలకు ఒకసారి ఒక సభ్యురాలిని సమావేశాన్ని నడిపేటట్లు సంఘం తప్పకుండా చూడాలి. అంతేకాకుండా ఇది నాయకురాలు (ప్రణాళిక) ఎజెండాగా తయారుచేయాలి. తప్పనిసరి నియమంగా చూడాలి. దీనివల్ల బాధ్యతలు పంచుకోవడం ముందునుంచే అలవాటు పడుతుంది. అంతేకాకుండా నాయకురాలును మార్చేటప్పుడు కొత్త నాయకురాలు నాకేం తెలియదు, నేను చదువుకోలేదు అనే సమస్య తలెత్తదు.

❺ సంఘంలో ప్రతి సభ్యురాలు ఏదో ఒక సమయంలో నాయకురాలు కావడం మంచిదనే విషయాన్ని తెలియ జెప్పడం.

❻ నాయకురాలి మార్పు అనేది సంఘసభ్యులందరూ చర్చించుకుని, అది సంఘం ప్రగతికి ముఖ్యమని పిస్తే మార్పు చేసుకోవచ్చు. దానికి కార్యకర్తలుకాని, బ్యాంకు అధికారులుకాని కాదనే నియమం లేదు.

# నాయకత్వము–సమస్యలు

## సమస్య : 5

## అన్నింటికీ నాయకులే దిక్కంటున్న సభ్యులు...

### కారణాలు

1. సంఘం కార్యకలాపాలు, సంఘం బయటి సంస్థలతో సంబంధ బాంధవ్యాలను పెంచుకొనుట, సంఘంలో నిర్ణయాలు చేయుట బయటి వారితో మాట్లాడుట వంటి విషయాలలో సభ్యులు నాయకుల మీదనే ఆధారపడుట.
2. సభ్యులు నోరు విప్పరు, సంఘంలో భాగస్వామ్యం పొదుపులు, అప్పుల వరకే, మాట్లాడటానికి మేము నాయకురాళ్లను తెచ్చుకుంటామని అంటారు
3. మా పని పొదుపులు చేయటం, అప్పులు ఈయడం
4. మేము నాయకురాళ్ళుగా ఉండము అని మొదట్లోనే చెప్పాము, అందుకు ఇష్టపడే సంఘంలో చేరాము.
5. మా నాయకురాళ్లపై మాకు చాలా నమ్మకం ఉంది.
6. మా నాయకురాలు మాకు అవసరమైనప్పుడల్లా ఏ సమయంలో అయినా అప్పులు ఇస్తుంది
7. మా బాగోగులు ఆమె చూసుకుంటుంది

ఇలా రకరకాలుగా సభ్యులు అభిప్రాయ పడుతుంటారు

### పరిష్కారం

1. సంఘంలో జరిగే అన్ని విషయాలు సభ్యుల అంగీకారంతో జరగాలి. ముందుగా సభ్యులకే నిర్ణయాలు చేసే అవకాశం కల్పించాలి
2. సంఘంలోని నాయకురాలు, సభ్యులు అందరూ మాట్లాడేలా చూడాలి
3. సభ్యులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలి.
4. సంఘంలోని పొదుపులు - అప్పులు వంటి విషయాలు ప్రతి సమావేశంలో అందరికీ తెలియపరచాలి
5. బయట వారితో మాట్లాడేటప్పుడు ముందుగా సభ్యులకే అవకాశం కల్పించాలి.
6. సంఘం కట్టుబాట్ల ప్రకారం నాయకురాళ్లను మార్చి ప్రతి సభ్యురాలికి నాయకురాలు అయ్యే అవకాశం కల్పించాలి
7. అప్పు మంజూరులో సభ్యుల నిర్ణయాలకే ప్రాధాన్యత ఇవ్వాలి. నాయకురాలు జోక్యం, ఒత్తిడి, బలవంతం చేసే వారికే అప్పు ఇచ్చే పద్ధతిని నిలిపివేయాలి.
8. సంఘంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు సభ్యులకే ముందు నిర్ణయాలు చేసుకునే వీలు కల్పించి తరువాత నాయకురాలు పరిష్కరించాలి.
9. నాయకురాలితో పాటు సభ్యులను కూడా శిక్షణా కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చూడాలి
10. నాయకురాళ్లపని శ్రమతో కూడినది. తెలివి తేటలు, చాకచక్యం, సమయ పాలన, క్రమశిక్షణవంటి పద్ధతులతో కూడినది అనే భయం పోగొట్టి నాయకురాళ్ల బాధ్యతలుకూడా సులభమైనవే అనే విషయాన్ని సభ్యులందరికీ తెలియచేయాలి. దీని వలన సభ్యులలో నాయకురాళ్లపని అంటే భయం పోతుంది

## కేస్‌స్టడీ :

మెదక్ జిల్లా రామాయంపేట మండలం వినాయక సంఘం 1993వ సంవత్సరంలో ఏర్పడింది. మొదట్లో సమావేశాలకు నాయకురాళ్లు మాత్రమే వచ్చేవారు. ఎంత ప్రయత్నించినా సభ్యులు వచ్చేవారు కాదు. కాని నాయకురాళ్లు మాత్రం అన్ని సమావేశాలకు వచ్చేవారు. తరువాత ఒక సమయంలో నాయకులకు అత్యవసర పరిస్థితిలో తమకు బదులు సంఘంలో ఉన్న మరో సభ్యురాలైన పద్మను సమావేశమునకు పంపించడం జరిగింది. అక్కడ ఇంటి పరిస్థితులు మరిచి అందరూ సంఘం గురించి ఆలోచించడం, ఎక్కడెక్కడ, ఏయే సదుపాయాలు ఉన్నాయో తెలుసుకోవడం చూసి పద్మ ముచ్చటపడింది. ఈ విషయం గ్రామంలోని సభ్యులు అందరికీ తెలియజేయడం వల్ల తరువాత నెల నుండి ఒక్కొక్కరు సమావేశాలకు రావడం, అక్కడ జరిగిన విషయాలను అందరికీ తెలియజేయడం వలన నేడు సంఘ సమావేశాలకుగాని, బయట శిక్షణలకుగాని సంఘ సభ్యులు అందరూ కలిసి వస్తున్నారు. సంఘం గురించి పూర్తి అవగాహన, సంఘాలపై పాటలను పాడటం వంటివి చేస్తున్నారు.

## సమస్య : 6

### అప్పులు తీసుకోవడంలో ముందు మేమున్నాం అంటున్న నాయకులు....

సంఘంలో అప్పులు నాయకులే ముందుగా తీసుకోవటం

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సంఘాలలో అప్పులు నాయకులే ముందుగా తీసుకోవటం, వారి అవసరాలు తీరిన తరువాతనే మిగిలిన సభ్యులకు అప్పులు ఇవ్వటం చాలా సంఘాలలో జరుగుతుంది<br>❷ అటువంటి పరిస్థితులలో సభ్యులు సంఘంపై నమ్మకం కోల్పోవటం జరుగుతుంది. నాయకులపై విశ్వాసాన్ని కోల్పోవడం ఈ పరిస్థితుల్లో ఫెసిలిటేషన్ చేయడం కార్యకర్తకు పెద్ద తలనొప్పిగా తయారు కావడం జరుగుతుంది. మరియు నాయకురాలు సంఘం అంతా తనదేనని అనుకోవటం<br>❸ తమకే కాక బయట వున్న బంధువులకు అవసరమైనా సంఘం నుండి అప్పులు తమ పేరుపై తీసి బయట వారికి ఇవ్వటం<br>❹ సంఘం నుండి అప్పులు తీసుకొని బయట ఎక్కువ వడ్డీలకు త్రిప్పటం. మరియు సభ్యుల అవసరాల కంటే వారి అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వటం వంటివి కొన్ని సంఘాలలో కనిపిస్తుంది. | ❶ సంఘ సమావేశాలలో సభ్యులందరి ముందు మొత్తం పొదుపులు ఎంత వచ్చాయి అనేది చూడటం, అప్పులు ఎవరెవరికి కావాలి అనేది తెలుసుకోవడం, తెలుసుకొన్న వారి లిస్టు నుంచి ప్రాధాన్యతనుబట్టి అప్పులు సంఘ సభ్యులందరి ఆమోదం మేరకు ఇవ్వడం జరగాలి<br>❷ అంతేకాని మేము నాయకురాళ్లము కదా! మేము ముందు తీసుకుంటాము, మాకే కావాలి అప్పులు అనడం ఇలాంటివేవి జరగకూడదు |

## సమస్య : 7

## తీసుకున్న శిక్షణలు–ఉపయోగించుకోలేని నాయకులు

**సంఘం తరపున శిక్షణలు పొందిన నాయకులు తిరిగి వచ్చిన తరువాత సభ్యులకు శిక్షణలో నేర్చుకున్న విషయాలపై సరైన అవగాహన కల్పించలేకపోవటం.**

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ నామమాత్రపు శిక్షణలకు హాజరయి రావటం. | ❶ సంఘం తరపున శిక్షణ పొందిన నాయకులు వెనుకకు వచ్చి సభ్యులకు జరిగిన విషయాలపై అవగాహన కల్పించాలి. |
| ❷ వారు నేర్చుకున్న విషయాలను సంఘంలో తిరిగి వివరించే సామర్థ్యం లేకపోవటం. | ❷ సంఘం తరపున శిక్షణా కార్యక్రమాలను పెట్టినప్పుడు నాయకులు ఖచ్చితంగా హాజరై అక్కడి విషయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొనేటట్లు చూడాలి. మరియు చదువుకున్న వారైతే ఒక పుస్తకంలో వ్రాసుకునేటట్లు, చదువురాని వారు కనీసం గుడ్డి గుర్తుల (చూచాయగా) ద్వారా అయినా గుర్తు పెట్టుకొనేటట్లు ప్రోత్సహించాలి. |
| ❸ సంఘ సమావేశాలు తమకు ఆ అవకాశాన్ని ఇవ్వకపోవటం, నాయకురాళ్లు చురుకైన పాత్రను వహించి చర్చ చేయలేకపోవటం. | ❸ శిక్షణా విషయాలను అక్కడ విన్న తరువాత సభ్యులకు తెలియజేసి, దాని గురించి చర్చ జరిగేటట్లు చూడాలి. |
| ❹ అన్ని విషయాలు సభ్యులకు తెలిస్తే తమను నిర్లక్ష్యం చేస్తారు అనే దుర్బుద్ధి ఉండటం. | ❹ సభ్యులు కూడా నాయకులు శిక్షణకు వెళ్ళి వచ్చిన తరువాత అక్కడ జరిగిన విషయాలు ఏవి జరిగిందని, దేని గురించి తెలుసుకోవడం జరిగిందని అడిగేటట్లు చేయాలి. |

శిక్షణకు వెళ్ళాను. చాలా విషయాలు చెప్పారు. మన సంఘ సమావేశములో చెబుతాలే .....



## సమస్య : 8

### నాయకుల ఎన్నికల్లో రాజ్యమేలుతున్న రాజకీయం....

సంఘాలలో నాయకులను ఎన్నుకోవడంలో రాజకీయ నాయకుల ఒత్తిడి వలన సమస్య

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ తమ వర్గం వారిని, తమ వెనుక తిరిగే కార్యకర్తలను నాయకులుగా పెట్టి కొత్త సంఘాలను పెట్టిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. సంఘాల స్థాయిదాటి క్లస్టరుస్థాయి, సమాఖ్య స్థాయికి వెళ్ళే సమయంలో నాయకులకు సన్నిహితులను సంఘాల లీడర్లుగా పెట్టడానికి అంతర్గతంగా ప్రయత్నిస్తుంటారు. | ❶ సభ్యుల అంగీకారం, నిర్ణయాల ప్రకారం లీడర్లను ఎన్నుకొనేటట్లు చూడాలి.<br>❷ నాయకుల ఎన్నికలో బయటి వ్యక్తుల ప్రమేయం ఉండకుండా చూడాలి.<br>❸ సంఘ సమావేశంలో ప్రభుత్వం నుండి వచ్చే పథకాల గురించి చర్చించుకోవాలి. దీనివల్ల ఏయే పథకాలు ప్రభుత్వం నుండి వస్తున్నాయెూ తెలుసుకోవచ్చు. దాని కారణంగా రాజకీయ నాయకులపై ఆధారపడకుండా ఉండేటట్లు చూడవచ్చు. |

## కేస్‌స్టడీ :

నెల్లూరు జిల్లాలో మహాలక్ష్మి సంఘంలో సంఘ సభ్యులు ముందుగా నాయకురాలిని ఎన్నుకొనే సమయంలో అదే గ్రామానికి సంబంధించిన రాజకీయ నాయకుల ప్రమేయం ఎక్కువగా ఉన్నది. ఆ గ్రామ సర్పంచ్ ఆ గ్రామంలోని సంఘాలను ఏర్పాటు చేయడంలో పాల్గొనడం జరిగింది. కనుక నాయకురాలిని ఎన్నుకునే సమయంలో తాను చెప్పినట్లు వినాలి, తనకు అనువుగా ఉన్నటువంటి సభ్యురాలిని ఎన్నుకోవలసిందిగా సభ్యులను అందరినీ ఒత్తిడి చేయగా, సభ్యులు అందరూ సరే అని, రాజకీయ నాయకుల మాటలకు కట్టుబడి నాయకులను ఎన్నుకోవడం జరిగింది. ఎన్నిక తరువాత 2 నెలలు నాయకురాలు బాగానే పనులు చేయడం జరిగింది. తర్వాత సంఘం గురించికాని సంఘ కార్యక్రమాల గురించి కాని పట్టించుకోకపోవడం, సంఘం సమావేశానికి హాజరు కాకపోవడం లాంటివి జరిగాయి. కారణం, ఆమెకు రాజకీయ నాయకుల చుట్టూ తిరిగే దానికి సమయం సరిపోతుంది. ఈ కారణంచేత సంఘ సభ్యులందరూ కలిసి చర్చించి కొత్త నాయకురాలిని ఎన్నుకోవడం జరిగింది. (పాత నాయకురాలి అంగీకారంతో) ఇప్పుడు మహాలక్ష్మి సంఘం చాలాబాగా జరుగుతోంది. రాజకీయ ఒత్తిడులకు ఇకపై నాయకులను ఎన్నుకోకూడదనే కట్టుబాటు కూడా పెట్టుకోవడం జరిగింది.

## సమస్య : 9

## సంఘం నాయకులు స్థానిక రాజకీయాలలో జోక్యం చేసుకోవటం

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| 1. సంఘంలో సభ్యులు కానీ లీడర్లు కానీ ఏదో ఒక పార్టీకి చెందినవారై ఉండటం సహజం. సంఘాల వరకు వస్తే అటు - ఇటు కాక మధ్యస్తంగా ఉంటే ఫర్వాలేదు.<br>2. కొన్ని గ్రామాలలో సంఘాల లీడర్లు ఒక పార్టీకి సపోర్ట్ చేస్తూ రాజకీయ నాయకుల వెనుక తిరగటం, అలా తిరిగితే మనకు రివాల్వింగ్ ఫండ్ వస్తుంది, గ్యాస్ కనెక్షన్‌లు వస్తాయి అని సభ్యులను కూడా మభ్యపెట్టి రాజకీయ నాయకుల వెనుక త్రిప్పటం, పర్యవసానం ఏమిటంటే సంఘంలోని సభ్యుల మధ్య కలతలు రేగుతాయి. తెలివిగల వారు అవకాశాన్ని తమ స్వార్థానికి ఉపయోగించుకుంటారు<br>3. సంఘం నాయకుల స్వప్రయోజనాలు తమ రాజకీయ నాయకుల వద్ద మెప్పు పొందడం<br>4. సంఘం నాయకులు / వి.ఓ.లో సంఘం గూర్చి సరిగా మాట్లాడలేకపోవటం / పోరాడలేకపోవటం<br>5. సంఘం నుండి క్లష్టరుకు ప్రాతినిధ్యం వహించే నాయకులు వారి సంఘం గురించి పోరాడలేరు<br>6. ధీటుగా మాట్లాడగలిగే సామర్థ్యం లేకపోవటం.<br>7. తమ సంఘానికి సంబంధించిన సమాచారం వారి వద్ద ఉండకపోవటం<br>8. అందరితోపాటు మాకు అనే భావన<br>9. సంఘంలో సభ్యుల అవసరాలు తెలుసుకోకపోవటం. | 1. సంఘం నాయకులు స్థానిక రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం అనేది సంఘ నియమాలకు విరుద్ధమనే విషయాన్ని సంఘ సభ్యులకు ముందుగానే తెలియజేయాలి.<br>2. సంఘం కట్టుబాట్ల ప్రకారం పని చేయాలి.<br>3. సంఘం, రాజకీయాలకు దూరంగా ఉండి, అందరిని కలుపుకొని వెళ్ళాలి.<br>4. నాయకురాలిగా ఉండి, సంఘ సభ్యులను పార్టీలకు పని చేయించడం, పార్టీల మీటింగులకు తీసుకెళ్ళడం వంటివి లీడర్లు చేయకూడదని ముందే తెలియజేయాలి.<br>5. నాయకులుగా ఉండేవాళ్ళు సభ్యుల అవసరాలను తెలుసుకుని, వారి అవసరాలను తీర్చే విధంగా ఉండాలి.<br><br>మీ సంఘ సభ్యులందరీ ఓట్లు అన్నీ నాకే..... |



## కేస్‌స్టడీ :

పుత్తూరు మండలంలో రాజరాజేశ్వరి పొదుపు సంఘంలో రమణమ్మ అనే లీడరు మంచి సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటూ రాజకీయ నాయకులతో పరిచయాలను ఏర్పాటు చేసుకొంది. రాజకీయ నాయకులతో పాటు ఆమె తన ఎదుగుదలను పెంచుకోవడం కోసం సంఘంను ఉపయోగించుకొంది. వారి మీటింగ్‌లకు సంఘ సభ్యులను తీసుకెళ్ళడం, వారి కార్యక్రమాలకు సంఘ సభ్యులు సహాయం చేయడం వంటివి చేయడంద్వారా రాజకీయ నాయకుల నుండి మెప్పు పొందింది. దీనిద్వారా ఆమె రాజకీయ నాయకుల ద్వారా గ్రామస్థాయి పదవులను కూడా చేపట్ట గలిగింది. ఈ మధ్యనే పార్టీ సభ్యత్వం కోసం నమోదు చేయించండని రాజకీయ నాయకులు చెప్పగా, ఆమె ఆ గ్రామంలోని 18 సంఘాల సభ్యులతో మట్లాడి, వారి వెంట వుండి వారు చెప్పిన మాట వింటే మనకు గ్యాస్ వస్తుంది, బ్యాంక్ నుండి లోను వస్తుంది వంటివి చెప్పి సభ్యత్వ నమోదు క్రింద సభ్యురాలి దగ్గర డబ్బులు వసూలు చేయించింది. ఆ విధంగా సుమారు 150 మంది దగ్గర డబ్బులు కట్టించింది. తరువాత కొంతమంది ఈ విషయాలను గ్రహించి ఒక్కసారిగా ఆ లీడరుపై ఎదురుతిరిగి నిలదీయడం జరిగింది. ఇక ఎవరూ పార్టీలో సభ్యత్వం తీసుకోం, అంతేకాకుండా నీవు ఈ విధంగా ఇంతకుముందు నమోదు చేసిన వారిది కూడా తిరిగి ఇచ్చేయమని అందరూ అడిగేసరికి రమణమ్మ భయపడిపోయింది. ఈ సంఘటన జరిగిన తరువాత అందరూ కలిసి ఆమెను లీడరు పదవి నుండి తీసివేయడం జరిగింది.

మీ ఓట్లు నాకు వేస్తే వచ్చే పంచాయితీ ఎన్నికలలో నిన్ను వార్డు మెంబర్ ను చేస్తాను.



## సమస్య : 10

### సమస్య: సంఘ నిధిని దుర్వినియోగపరుస్తున్న నాయకులు, బుక్ కీపర్లు...

**సంఘస్థాయిలో పుస్తకాలు రాసే బుక్‌కీపర్‌లు, సంఘం నాయకులు కలిసి సంఘ నిధిని సొంత ఖర్చులకు ఉపయోగించడం వలన సంఘంలో గొడవలు వచ్చి సంఘం విడిపోయే పరిస్థితి రావడం**

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ నాయకురాళ్ళు తాము చెల్లించవలసిన బాకీలు చెల్లించకుండా పుస్తకాలలో తప్పు లెక్కలు వ్రాయించడం, బుక్ కీపరుతో కుమ్మక్కు కావడం | ❶ సమావేశం ఏర్పాటు చేసి దుర్వినియోగమయిన మొత్తాన్ని అంచనా వేయాలి. అంచనా వేయగా వచ్చిన మొత్తాన్ని ఏ విధంగా సంఘానికి తిరిగి చెల్లించడమనేదానిపై ఓ విధానాన్ని నిర్ణయించాలి. |
| ❷ బుక్ కీపరు, నాయకురాలు సంఘంలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలను గోప్యంగా ఉంచి సభ్యులకు తెలియనీయక పోవడం | ❷ సంఘం భవిష్యత్తు కార్యక్రమము గురించి నిధుల దుర్వినియోగంలో భాగం పంచుకున్న వ్యక్తులపై తీసుకోవలసిన చర్యలను చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలి |
| ❸ సంఘం సొమ్మును స్వార్థ ప్రయోజనాల కోసం సభ్యులకు తెలియకుండా చేసి వాడుకోవడం | ❸ నిర్ణయాలను అమలు చేయడానికి అవసరమైన నాయకులను సమావేశంలోనే గుర్తించి బాధ్యతలను పంచుకునేలా చేయాలి |
| | ? ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పుస్తకాలలో వ్రాసి ఉన్న వివరాలను చదివి వినిపించి అవసరమైన సవరణలను చేయాలి |
| | ? తీర్మానాల పుస్తకములో వివరాలు అన్నీ రాసి సభ్యులందరూ సంతకాలు చేయాలి. |

**సంఘనిధి మరియు లోటు అంచనా**

సంఘనిధి మరియు లోటు అంచనా వేయుటకు సంఘ సమావేశం ఏర్పాటు చేసి ఆనాటికి లావాదేవీల పట్టిక ఒకటి తయారు చేయాలి. పుస్తకాలు అందుబాటులో ఉంటే వాటిలోని వివరాలను మరియు సభ్యులకు గుర్తు ఉన్న వివరాలను బేరీజు వేసుకుంటూ లావాదేవీల పట్టికను తయారు చేయాలి. అందరు సభ్యులు, నాయకురాళ్ళు మరియు బుక్ కీపరు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ముఖ్యం.

1. సభ్యులపై ఉన్న అప్పుల మొత్తాన్ని అంచనా వేయాలి
2. సంఘం వద్ద ఉండవలసిన మొత్తాన్ని అంచనా వేయాలి
   - 2.1 సభ్యుల పొదుపుల మొత్తం
   - 2.2 సంఘానికి వచ్చిన విరాళాలు

2.3 సంఘం బయటి సంస్థల నుండి తెచ్చిన అప్పులు

2.4 సభ్యులు అప్పులపై చెల్లించిన వడ్డీలు

2.5 సంఘానికి వచ్చిన ఇతర ఆదాయాలు : పెనాల్టీలు, ఫీజులు వంటివి

3. సంఘంలో జరిగిన ఖర్చుల మొత్తం

పై ఆర్థిక లావాదేవీల వివరాలన్నింటినీ పొందుపరుస్తూ లావాదేవీల పట్టికను తయారు చేసి సంఘనిధి పుస్తక నిల్వను లెక్కించాలి. పుస్తక విలువ నుండి నగదు నిలువ (బ్యాంకులో నిల్వ + చేతిలో నగదు) తీసివేయగా మిగిలినది లోటుగా గుర్తించాలి.

### మంచి నాయకత్వ లక్షణాలు

- ధైర్యం
- అంకిత భావము
- నీతి, నిజాయితీలు
- నిష్పక్ష పాతము
- సహభాగ నాయకత్వము
- ముందు చూపు
- వ్యక్తి ప్రయోజనాల కన్నా సంఘ ప్రయోజనాలకు ప్రాముఖ్యతనివ్వడం
- పారదర్శకత ఉండేటట్లు చేయడం
- సంఘం యొక్క విధులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండడం
- తగాదా మరియు సమస్యా పరిష్కారంలో నైపుణ్యం కలిగి ఉండడం
- సభ్యులందరికీ సమానావకాశాలు కల్పించడం
- నమ్మకం, సహనం కలిగి ఉండడం
- విశ్లేషణాశక్తి
- విషయ పరిజ్ఞానం కలిగి ఉండడం
- తెలివి తేటలు
- క్రమ శిక్షణ కలిగి ఉండడం
- ఫెసిలిటేషన్ నైపుణ్యాలు

# కట్టుబాట్లు – సమస్యలు



అందరూ ఒకే సారి అప్పులు కావాలంటే సంఘంలో ఉన్న డబ్బు సరిపోదు



అనుకున్న కట్టుబాట్లు ప్రకారం సమస్య ప్రాధాన్యతను బట్టి అప్పులు తీసుకుందాము

# కట్టుబాట్లు – సమస్యలు

## సమస్య : 1

### కట్టుబాట్లు లేక అవస్థలు పడుతున్న సంఘాలు....

కొన్ని సంఘాలలో కట్టుబాట్లు పెట్టుకోకపోవడం వలన క్రమమైన సమావేశాలు, నిర్ణయాలు చేయడం, సమయ పాలన పాటించడం, హాజరు మొదలైనవి సరిగా లేకపోవడం వలన సంఘం అభివృద్ధి పథంలో ముందుకెళ్ళడంలో సమస్యలు వస్తున్నాయి.

#### కారణాలు

1. సంఘం మొదలు పెట్టిన తరువాత సభ్యులకు – సంఘ నిర్వాహణ విధానము, ఆచరించవలసిన నియమ నిబంధనలపై కార్యకర్త తగిన శిక్షణ ఇవ్వకపోవుట.
2. కట్టుబాట్లను ఏర్పరచుటలో సభ్యులకు సరియైన అవగాహన లేకపోవుట. అంటే, ఏ రకమైన కట్టుబాట్లు సంఘంలో పెట్టుకుంటే సక్రమంగా నడుస్తుంది అనేదానిపై అవగాహన లేకపోవడం.
3. కట్టుబాట్లు ఏర్పాటుచేసుకొంటే వాటికి కట్టుబడి ఉండాలి. కనుక ఇవన్నీ మనకు కుదరవు అనే భావనతో కట్టుబాట్లు ఏర్పాటు చేసుకోవడంపై సభ్యులు మొగ్గు చూపడం లేదు.



#### పరిష్కారం

1. కట్టుబాట్లు పెట్టుకోవలసిన అవసరం గురించి, దాని వల్ల కలిగే ఉపయోగం గురించి కార్యకర్త తెలుసుకొని సంఘ సభ్యులకు వివరించాలి
2. కట్టుబాట్లు ఉంటే సంఘ లక్ష్యాలను సులభంగా సాధించేందుకు అవకాశం ఉంటుందని కూడా చెప్పాలి.
3. కట్టుబాట్లు పెట్టుకొని సంఘ కార్యక్రమాలను సక్రమంగా చేసుకొంటూ తమ లక్ష్యాలను సాధించుకునే దిశలో వెళుతున్న సంఘాలను తీసుకొచ్చి సభ్యులకు చూపించడం (చర్చలు చేయడం).
4. కట్టుబాట్లు ఏర్పాటు చేసుకొంటే సమావేశాలకు అందరూ సమయానికి రావడం, అప్పు తిరిగి చెల్లించే విధానం క్రమంగా ఉండటం మొదలైనవన్నీ జరుగుతాయి అని సంఘ సభ్యులకు ఉదాహరణలతో చేర్చి చెప్పడం. కట్టుబాట్లు ఏర్పాటు చేసుకోవడం వలన చేసే పనిని ఒక పద్ధతి ప్రకారం చేయొచ్చు. దీని వలన అభివృద్ధి సులభంగా సాధించవచ్చు.
5. సంఘం కట్టుబాట్లను పెట్టుకొని, ఆ కట్టుబాట్లు అమలు పర్చుతున్నదీ, లేనిదీ కార్యకర్త సంఘ సమావేశములకు హాజరవుతూ, ప్రతీసారి సభ్యులకు కట్టుబాట్లను గుర్తుచేస్తూ అమలు జరిగేటట్లు చూసుకోవాలి.

## సమస్య : 2

### చేసుకున్న కట్టుబాట్లు అమలుచేయక ఇబ్బందులెదు ర్కొంటున్న సంఘాలు....

సంఘంలో ఏర్పాటు చేసుకున్న కట్టుబాట్లను అమలు పరచకపోవడం వలన సమస్య

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| 1 సభ్యులు సమావేశానికి హాజరు కానపుడు, అప్పులు సకాలంలో చెల్లించనపుడు అట్టి వారిపై జరిమానాలు విధించాలి అనే కట్టుబాట్లు పెట్టుకొన్నా వాటిని అమలు పరచకపోవుట.<br>2 కొన్నిసార్లు అధిక మొత్తాలలో జరిమానాలు విధించుట, జరిమానా విధించేటపుడు ఒక పద్ధతి లేకపోవుట వలన కూడా కట్టుబాట్లు అమలుపరచడం కష్టమై వాటిని అమలు పర్చకపోవడం జరుగుతుంది.<br>3 జరిమానాలు విధిస్తే మేము సంఘం మానుకుంటాము అని సభ్యులు బెదిరించుట వలన జరిమానాలను అమలు చేయలేరు. తద్వారా సంఘంలో క్రమశిక్షణ తగ్గుతుంది. సభ్యులపై ఒత్తిడి ఉండదు.<br>4 కట్టుబాట్లు అమలు పరిస్తే వ్యక్తిగత స్పర్థలు వస్తాయని భావించడం.<br>5 స్వల్ప కారణమేకదా అని వదిలేయడం<br>6 కట్టుబాట్ల ఏర్పాటులో కొన్ని కఠినమైన నిర్ణయాల వలన సభ్యులకు వీటిని అమలు పర్చడం కష్టముగా/ ఇబ్బందిగా ఉండుట వలన.<br>7 కట్టుబాట్ల ఏర్పాటు అనేది సభ్యులందరి సమక్షంలో జరగకపోవడం వలన కొంతమంది అవి ఉన్నట్లు కూడా మాకు తెలియదు అనడం.<br>8 కట్టుబాట్లు సభ్యులకుగాని మాకు కాదు అని సంఘ నాయకులు భావించుట వలన. | 1 సంఘం ఏర్పాటు చేసుకున్న కట్టుబాట్లు అనేవి సభ్యులందరికి ఆమోద దాయకంగా వుండాలి.<br>2 ఏర్పాటు చేసుకున్న కట్టుబాట్లు కఠినమైనవిగా వుంటే అవి అమలుపరచడానికి సభ్యులకు ఇబ్బందికరంగా వుంటుంది. కనుక ఏర్పాటు చేసుకున్న కట్టుబాట్లు అమలుపరచడానికి వీలుగా వుండేలా చూడాలి<br>3 కట్టుబాట్లు సంఘ సమావేశంలో సభ్యులందరి ముందు ఏర్పాటు చేసుకోవాలి.<br>4 కట్టుబాట్లు అనేవి సంఘంలో సభ్యులకు మరియు నాయకులకు అందరికీ వర్తిస్తాయి అనేది సంఘంలో నిర్ణయించుకోవాలి.<br>5 కట్టుబాట్ల అమలులో బంధుప్రీతి లాంటివి చూపకూడదు. చిన్న కారణమైనా, పెద్ద కారణమైనా ఖచ్చితంగా అమలు జరపాలి. |

# కట్టుబాట్లు–సమస్యలు

## కేస్‌స్టడీ :

రంగారెడ్డి జిల్లాలోని రాంపల్లి గ్రామములోని స్వయం సహాయక సంఘంలో సంఘ సభ్యులందరు కలిసి కట్టుబాట్లు పెట్టుకొన్నారు; కాని అమలు పరచడం లేదు. దీనివల్ల సంఘంలో చాలా సమస్యలు వచ్చాయి. కట్టుబాట్లు ఎవరూ పాటించకపోవడం వలన సమయానికి సమావేశాలకు వచ్చేవారు కారు. అందరూ ఒకేసారి గొడవ, గొడవగా మాట్లాడుకునేవారు. అప్పులు తీసుకున్న వారే మరలా మరలా తీసుకునే వారు. దీనివల్ల గొడవలొచ్చి సంఘం వద్దు అని విడిపోయారు. కొన్ని నెలల తర్వాత కార్యకర్త వచ్చి ఎందుకు మీ సంఘం సరిగా పనిచేయడం లేదు, ఎందుకు మీరు విడిపోయారు అని అడగ్గా జరిగిందంతా సభ్యులు చెప్పారు. అప్పుడు కార్యకర్త సంఘానికి కట్టుబాట్లు ఏర్పాటు చేసుకున్నారు కదా! అవి ఎందుకు అమలు పరచడం లేదు అంటే అవి చాలా కష్టమైనవి అని సభ్యులు అన్నారు. అప్పుడు కార్యకర్త సభ్యులందరినీ పిలిచి సమావేశం పెట్టి ఆ సమావేశంలో మీ ఇష్టపూర్వకంగా మీ సంఘానికి ఏమి కట్టుబాట్లు పెట్టుకోవాలను కుంటున్నారు, ఏమి పెట్టుకుంటే సంఘం బాగా నడుస్తుంది అనుకొంటున్నారు, ఏ కట్టుబాట్లు పెట్టుకొంటే మనము కరెక్టుగా పాటించగలము అని నిర్ణయించుకొని మీరే కట్టుబాట్లు పెట్టుకోమనగా వారు కొన్ని కట్టుబాట్లు పెట్టుకొన్నారు. ఆ కట్టుబాట్లు అనేవి ఒక్క సంఘ సభ్యులకే కాక నాయకురాళ్లకు, సభ్యులకు అందరికీ వర్తింపజేయాలని నిర్ణయించుకున్నారు. అందరూ అమలు పరచాలి అని గట్టి నిర్ణయం తీసుకొన్నారు. అప్పటి నుంచి అందరూ వారు పెట్టుకొన్న కట్టుబాట్లను పాటిస్తున్నారు. సంఘంలో సమస్యలు రావడం లేదు.



# నిర్వహణపరమైన కట్టుబాట్లు

**హాజరు :**

- లేటుగా వచ్చిన వారిపై జరిమానా విధించుట
- హాజరు కాని సభ్యులకు జరిమానా విధించుట
- హాజరు కాని సభ్యులు ముందుగానే తెలియ జేయుట దానిని సెలవుగా భావించుట
- సమావేశాలకు నిరంతరంగా రాని వాళ్ళ గురించి చర్యలు తీసుకొనుట
- సమావేశం జరుగుతున్నప్పుడు మధ్యలో వెళ్ళు వారిపై చర్యలు తీసుకొనుట

**సంఘంలో నిర్ణయాలు తీసుకొనుటకు కావాల్సిన సభ్యులు :**

- సంఘంలో నిర్ణయాలు తీసుకొనుటకు ఎంత మంది సభ్యులు కావాలో నిర్ణయించుకొనుట. కనీసం నాలుగింట మూడు వంతుల మంది నిర్ణయాలలో పాలు పంచుకోవాలి. వారు నిర్ణయాలకు ఒప్పుకోవాలి.

**నాయకులలకు కావల్సిన లక్షణాలు మరియు ఎన్నిక విధానము :**

- సంఘంకు ఇద్దరు లేదా ముగ్గురు నాయకులను ఎన్నుకొనుట
- నాయకులు వాక్‌చాతుర్యము, సహనము, నిధి నిర్వహణ, నమ్మకము వంటి లక్షణాలు కలిగి ఉండినచో మంచిది
- నాయకులను సంవత్సరానికి లేదా రెండు సంవత్సరాలకు ఒకసారి మార్చాలి

**బ్యాంకు ఖాతా నిర్వహణ :**

- బ్యాంకు ఖాతాను సంఘం పేరుపై తెరవాలి. దానికి సంఘ ప్రతినిధులు సంతకం దార్లుగా (సిగ్‌నేటరీస్) వ్యవహరించవచ్చు.
- బ్యాంకునందు డబ్బు జమ చేయుటకు ప్రతిసారీ ఒక సభ్యురాలు వెళ్ళునట్లు నియమం పెట్టుకొనుట వలన సభ్యులందరికీ బ్యాంకు ఖాతా నిర్వహణపై అవగాహన పెరుగుతుంది.

**పుస్తకాల నిర్వహణ :**

- పుస్తకాలు రాయడానికి ఒక వ్యక్తిని నియమించుకొని, ఆమె/ అతని సేవలకు కొంత ప్రతిఫలం (జీతం) ఇవ్వడం మంచిది. ఆ వ్యక్తిని అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి.
- పుస్తకాలు సంఘంలో సమావేశం జరుగుతున్నప్పుడే రాయించుకొనుట మంచిది

**అంతర్గత, బాహ్య ఆడిట్ :**

- అంతర్గత, బాహ్య ఆడిట్‌కి సంబంధించిన నియమాలు ఏర్పరచుకోవాలి. కనీసం మూడు నెలలకొకసారి అంతర్గత ఆడిట్, సంవత్సరానికి ఒకసారి బాహ్య ఆడిట్ చేయించడం మంచిది.

# ఆర్థిక వనరులు-సమస్యలు

**సంఘాలు తీసుకున్న అప్పులను ఏ ఏ అవసరాలకు వాడుకుంటారు**



## సమస్య : 1

### సమస్య: పొదుపు చేసే విధానంపై కట్టుబాట్లు లేని సంఘాలు....

**పొదుపు చేసే విధానము, ఎంత చేయాలి, ఎక్కడ కట్టాలి, ఎలా కట్టాలి అనే విషయాలలో నిర్ధిష్టమైన కట్టుబాట్లు పెట్టుకొనకపోవుట సమస్య**

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సభ్యులు పొదుపు చేసే పద్ధతిపై సరియైన కట్టుబాట్లు పెట్టుకొనక పోవుట వలన పొదుపులు పదిహేను రోజులకు ఒకసారా? నెలకొకసారా? అనే విషయంలో మరియు పొదుపు ఎంత చేయాలి, పొదుపు ఎక్కడ చేయాలి (సంఘ నాయకుల ఇంటికి తీసుకెళ్ళి ఇవ్వాలా, సమావేశంలో పొదుపు చేయాలా) వంటి విషయాలపై అవగాహన లేకపోవుట. | ❶ పొదుపు నెలకు రూ.20/-, రూ.30/-, రూ.50/- ఎంత కట్టుకోవాలి అనేది సభ్యుల ఆర్థిక స్థాయికి తగినట్లు వుందా లేదా అని చూసుకొని ఖచ్చితమైన నెలసరి పొదుపు ఇంత అని సభ్యులందరూ కలిసి కట్టుబాటు పెట్టుకోవాలి. |
| ❷ అనవసరపు ఖర్చులు, కూలీ దొరకకపోవుట వలన సభ్యుల రాబడిలో వ్యత్యాసములు అదే పరిస్థితిలో సంఘంలో పొదుపులు ఎలా చేయాలి, కరువు సమయంలో సక్రమమైన పొదుపు ప్రణాళిక ఎలా చేసుకోవాలి వంటి విషయాలపై కట్టుబాట్లు లేకపోవుట. | ❷ పొదుపులు సమావేశములోనే కట్టాలి అని కట్టుబాటు పెట్టుకోవాలి. |
| ❸ సమావేశంలోనే పొదుపులు చెల్లించాలి అనే కట్టుబాట్లు పెట్టుకోకపోవడం | ❸ వారం వారం జరిగే సమావేశాలలో (నెలకు నాలుగు సమావేశాలు జరుపుకొనుచోట) ఏ సమావేశంలో పొదుపులు కట్టాలి అనేది సభ్యులు నిర్ణయించుకొని కట్టుబాటు పెట్టుకోవాలి.<br>**ఉదా:** ఒకవేళ ఏదైనా సంఘం వారం వారం సమావేశం పెట్టుకొంటే ఏ వారంలో పొదుపులు కట్టాలి అనేది నిర్ణయించుకోవాలి. నెలకు ఒక సమావేశం అయితే అదే సమావేశంలో పొదుపులు జరుగుతాయి. |
| ❹ పొదుపులు చేసుకునే విధానాలు తెలియక పోవడం వలన | ❹ పనుల కాలంలో డబ్బులు ఎక్కువగా వస్తున్న సమయంలో స్వచ్ఛంద పొదుపులు కూడా చేసుకోవచ్చని చెప్పాలి. |

## సమస్య : 2

### అవసరానికి తగినంత అప్పు దొరకక నిరుత్సాహం చెందే సభ్యులు....

సంఘంలోని సభ్యులందరికీ అవసరానికి కావలసిన అప్పు దొరకకపోవడం వలన సభ్యులు తాము చాలా కాలం నుంచి గ్రూపులో ఉన్నామని పొదుపు చేసుకుంటున్నామని అయినా తమకు అవసరానుగుణంగా తగినంత అప్పు అందడం లేదని, అందుకే తాము గ్రూపులో ఉండమని అంటున్నారు.

#### కారణాలు

1. సంఘంలో సభ్యులు తీసుకునే అప్పులు వారి పొదుపులు సమకూర్చుకున్న మొత్తం నుండే తీసుకుంటారు కదా, కాబట్టి పొదుపులకు సభ్యులు తీసుకునే అప్పులకు సంబంధం వుంటుంది. ఇంతకుముందు అప్పు తీసుకున్న సభ్యులు సరిగా చెల్లించకపోవటం, వాయిదా ప్రకారం కట్టకపోవటం, సభ్యులు తీసుకున్న అప్పులు ఒకేసారి చెల్లిద్దాములే అనే అభిప్రాయంతో ఉండటం వలన సంఘంలో డబ్బులు తగ్గిపోతాయి. మిగతా సభ్యులకు కావలసిన అప్పులు దొరకవు. ఈ విధంగా చేయుట వలన సంఘం మిగతా సభ్యులకు భారం అవుతుంది. వారు సంఘాన్ని ద్వేషిస్తారు. సంఘంపై నమ్మకం పోయి, చివరికి వేరుకావడానికి కూడా ప్రయత్నిస్తారు.




#### పరిష్కారం

1. తీసుకున్న అప్పు వాయిదాల ప్రకారం ఖచ్చితంగా కట్టాలని కట్టుబాటు పెట్టుకోవాలి
2. నెలకు ఎంత కట్టాలి అని అనుకుంటారో, అదేవిధంగా కంతులు/వాయిదాల ప్రకారం కట్టాలి. (కొందరు 2,3 నెలలది ఒకసారే కట్టడం వంటివి చేయకూడదు)
3. అప్పు తీసుకున్న వారే మరలా మరలా తీసుకోవడం కాకుండా (2,3 సార్లు తీసుకోవడం) అందరికీ అప్పు అందే విధంగా ప్రణాళిక తయారుచేసుకొని దాని ప్రకారం అప్పులు తీసుకోవాలి
4. మొదటి అప్పు సభ్యులందరికీ అందేవరకు రెండవసారి అప్పు తీసుకోకూడదు అని కట్టుబాటు పెట్టుకోవాలి
5. నెల నెలా పొదుపులు చేయాలి. సంవత్సరానికి ఒకసారి పొదుపులు పెంచే విధంగా సభ్యులు నిర్ణయించుకోవాలి
6. సభ్యులు సంఘంలో పొదుపులను దృష్టిలో ఉంచుకొని అప్పులు అడగాలి
7. సంఘంపై నమ్మకం, గౌరవం అనేది సభ్యులకు కలిగి ఉండాలి

## సమస్య : 3

## అప్పు మంజూరీ సంఘంలో నిర్ణయించకపోవటం

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ కొన్ని స్వయం సహాయక పొదుపు సంఘాలలో అప్పుల మంజూరు నాయకుల ఇంటి వద్ద జరుగుతుంటుంది. సంఘం సమావేశం ఉన్నప్పటికీ నామమాత్రంగా కానిచ్చి పొదుపులు మాత్రం సంఘంలో కట్టించి, అప్పులు ఇవ్వడం మాత్రం నాయకురాలి ఇంటి దగ్గర చేయడం జరుగుతుంది. దీని వలన సభ్యులందరికీ అప్పు మంజూరీ గురించి తెలియదు. | ❶ అప్పు మంజూరీ అనేది సంఘ సమావేశంలో సభ్యులందరి సమక్షంలో జరగాలి అనే కట్టుబాటు పెట్టుకోవాలి. |
| ❷ నాయకురాలి నియంత్రణ, అజమాయిషీ, తనకు అనుకూలంగా ఉండే వారికి అప్పు ఇవ్వటం. | ❷ అప్పు ఇచ్చేటప్పుడు సభ్యులందరి నిర్ణయాలు తీసుకోవాలి. అందరి సంతకాలు పెట్టించుకోవాలి. |
| ❸ బినామీ పేర్లపై అప్పులు రాసి బయటి వారికి ఎక్కువ వడ్డీకి అప్పులు ఇవ్వటం. | ❸ బినామీ పేర్లపై అప్పులు ఇవ్వకూడదు. |
| ❹ సంఘంలో అప్పుపై వడ్డీరేటు తగ్గించి నాయకురాళ్ళ అజమాయిషీతో అందరూ ఒకటై సంఘంలోని పొదుపులు, ఇతరత్రా వచ్చిన గ్రాంట్లను సభ్యులకు కాకుండా బయటి వ్యాపారస్తులకు ఎక్కువ వడ్డీకి అప్పు ఇస్తుంటారు. | ❹ సంఘం నుండి అప్పుతీసుకొని ఎక్కువ వడ్డీకి బయటి వ్యక్తులకు ఇవ్వకూడదని కట్టుబాటు పెట్టుకోవాలి. |




## కేస్‌స్టడీ :

మిడ్తూరు మండలంలో కలమందలపాడు గ్రామములో శ్రీకళ సంఘంలో నాయకురాలు సంఘంలోని ఇంద్రమ్మ పేరు మీద అప్పు రాసి ఆ డబ్బుతనే తీసుకుని బయట వారికి ఎక్కువ వడ్డీకి ఇవ్వడం జరిగింది. సంఘం సమావేశంలో అందరికీ అప్పులు వచ్చాయా లేదా అని అడుగుతూ ఇంద్రమ్మను కూడా బుక్‌కీపర్ అడుగగా, ఇంద్రమ్మ తాను అప్పు తీసుకోనేలేదని, తన పేరు ఎలా వచ్చిందని గట్టిగా నాయకురాలిని అడగ్గా, అప్పుడు నాయకురాలు వడ్డీ వస్తుంది కదా అని తానే వేరేవాళ్ళకు ఇంద్రమ్మ పేరు మీద ఇచ్చానని చెప్పింది. తనకు తెలియకుండా తన పేరు మీద ఎలా ఇస్తావని ఇంద్రమ్మ గొడవచేసి నాకు పొదుపు వద్దు, సంఘం

వద్దు అని వెళ్ళిపోయింది. సభ్యులందరూ నాయకురాలిని నిలదీసి నాయకురాలుగా వుండి ఇలాంటి పని చెయ్యకూడదు కదా! అని గొడవ చేశారు. ఈ సమస్య వలన సంఘం ఆగిపోయింది. ఒకనెల తరువాత కార్యకర్త వచ్చి సభ్యులందరినీ కూర్చోబెట్టి ఎందుకు మీ సంఘం విడిపోయింది అని అందరినీ అడగ్గా సభ్యులు జరిగింది చెప్పారు. అప్పుడు కార్యకర్త నాయకురాలును, ఇంద్రమ్మను పిలిపించి చర్చలు చేసి ఇకమీదట మీ గ్రూపులో ఇలా జరగకుండా వుండాలంటే మీరు సంఘం సభ్యులందరి ముందు సమావేశంలోనే అప్పు మంజూరీ చేయాలి, సభ్యుల అందరి నిర్ణయం మేరకు చేయాలి, అంతేకాని నాయకురాలు తనకు ఇష్టమొచ్చినవారికి ఇవ్వకూడదని చెప్పింది. అప్పు మంజూరీ సభ్యులందరి ముందు, అందరి నిర్ణయం మేరకు, ప్రాధాన్యత ప్రకారము మంజూరీ చేయాలని కట్టుబాటు పెట్టుకోవాలని చెప్పగా, అప్పుడు సభ్యులందరు అదే విధంగా కట్టుబాటు పెట్టుకొని, దానిని రిజిష్టరులో కూడా రాసుకొన్నారు. అంతేకాక సభ్యులందరూ కలిసి ఇకనుంచి ఇలాంటివి జరుగకుండా ఉండాలంటే లీడరు చేసిన తప్పుకు అపరాధం చెల్లించాలని దండన విధించారు.

## సమస్య : 4

### అప్పు కట్టని సభ్యులనుంచి బాకీలు రాబట్టలేక భోరుమంటున్న సంఘాలు....

అప్పులు క్రమంగా తిరిగి కట్టని సభ్యుల నుంచి బాకీలు రాబట్టే విషయంలో అంతర్గత ఒత్తిడి లేకపోవుట వలన క్రమంగా అప్పు కిస్తులు చెల్లించకపోవుట వలన అందరికీ అప్పులు అందక సభ్యులలో గొడవలు రావడం జరుగుతుంది.

| కారణాలు | పరిష్కారం : |
|---|---|
| ❶ ఒక సభ్యురాలు అప్పు కట్టనిచో నాయకురాలు ఆ సభ్యురాలిని గదమాయించి నీవు అప్పు ఎందుకు కట్టలేదు, చాలా నెలల తరబడి అప్పు బాకీ పడుతున్నావు, ఇలాగైతే నిన్ను సంఘం నుండి తీసివేయవలసి వస్తుంది అని భయపెట్టి బెదిరించడం జరుగుతుంది. ఇది చాలా సంఘాలలో జరుగుతోంది. | ❶ సంఘం ఏర్పాటు దశలో ఉన్న సంఘాలకైతే ముందే పైన చెప్పినట్టు పొదుపులు మరియు అప్పులు క్రమంగా నెలనెలా తప్పక కట్టాలని కట్టుబాట్లు ఏర్పాటు చేసుకొని అమలుపరిచేటట్లు చూడాలి అని చెప్పొచ్చు. |
| ❷ సంఘంలో సభ్యులు ఎవరూ మాట్లాడరు. ఒక సభ్యురాలు కట్టాల్సిన అప్పు గురించి సంఘంలోని సభ్యులందరూ ప్రశ్నించటానికి వెనుకాడతారు. ఒకరిపై ఇంకొకరికి నమ్మకం ఉండకపోవడంతోపాటు అడిగితే ఏ సమస్య వస్తుందో అనే భయం కూడా ఉంటుంది. సభ్యులు జట్లు కట్టడం, ఒక కుటుంబం లేదా ఒక వర్గానికి చెందినవారు అందరూ మూకుమ్మడిగా నిశ్శబ్దంగా ఉండటం | ❷ ఏర్పాటయిన సంఘాల్లో అయితే సభ్యులందరూ కలిసి పొదుపులు, అప్పులు తిరిగి కట్టని వారితో చర్చించి వారు తిరిగి కట్టకపోవడానికి గల కారణాలు లేదా సమస్యలు ఏమిటో తెలుసుకొని దాని గురించి సభ్యులందరూ చర్చించి వారితో వాయిదాల రూపంలోనైనా కట్టించడానికి ఒత్తిడి తీసుకొని రావాలి. అంతేకాక వారికున్న సమస్యను పరిష్కరించడానికి సంఘం తరపున సహకారం అందజేయవలెను. |

జరుగుతుంది.

❸ అప్పులు ఇచ్చేటప్పుడు నాయకురాలు ఒకరే నిర్ణయం తీసుకోవడం

❹ ఎవరెవరికి ఎంత అప్పు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించక పోవడం

❺ పొదుపులు, అప్పులు, వసూలు బాధ్యతలు నాయకురాలివే అనుకోవడం

❻ అంతర్గత ఒత్తిడి లేకపోవడం

❸ అప్పులు సమావేశంలోనే సభ్యులందరి అంగీకారంతో ఇవ్వాలి. అప్పుడు తిరిగి కట్టించడంలో నాయకురాలే కాక సభ్యులందరు బాధ్యత తీసుకుంటారు

❹ అప్పు తీసుకునే ప్రతి సభ్యురాలు సంఘంలోని ఇంకొక ఇద్దరి సభ్యుల జమానత్ తీసుకోవాలి. ఒకవేళ సభ్యురాలు బకాయి పడితే జమానత్ ఉన్న ఇద్దరి సభ్యులను ఒత్తిడి చేయడం వలన అప్పులను వసూలు చేసుకోవచ్చును.

## కేస్‌స్టడీ :

గడ్డియాముల మండలంలోని గని గ్రామంలో ఇందిరా గ్రూపులో 15 మంది సభ్యులు వుండేవారు. వారిలో ఇద్దరు సభ్యులు అప్పులు తిరిగి కట్టేవారు కాదు. నాయకురాలు ఈశ్వరమ్మ వీరి ఇద్దరి ఇండ్లకు తిరిగి, తిరిగి అప్పు అడిగితే ఎంతకాలమైనా సభ్యులు కట్టలేదు. మిగతా సభ్యులందరూ వాళ్ళు కట్టుట లేదు కదా మేము కట్టమని నాయకురాళ్లు అనేవాళ్ళు. నాయకురాలు ఒక శిక్షణకు వెళ్ళినప్పుడు అక్కడ కార్యకర్తలకు ఈ సమస్య చెప్పింది. దీనివల్ల సంఘంలో గొడవలు ఎక్కువ అవుతున్నాయి ఏమి చేయాలి అని అడగ్గా, అప్పుడు కార్యకర్తలు మీరు అడగడమేకాక సభ్యులందరు కలిసి అంతర్గత ఒత్తిడి తీసుకొని వస్తే అప్పుడు తొందరగా కడతారు అని సలహా ఇవ్వడం జరిగింది. దాని ప్రకారం నాయకురాలు వారి నెలవారీ సమావేశంలో సభ్యులందరితో ఈ సమస్య చర్చించింది. "ఫలానా ఇద్దరు సభ్యులు చాలా కాలం నుంచి అప్పులు కట్టడం లేదు, నేను ఎంత వాళ్ళ ఇంటికి తిరిగినా కూడా వాళ్ళు కట్టడం లేదు. కనుక సమావేశానికి పిలిచి అందరూ కలిసి అడిగితే వారికి భయము వుంటుంది, తొందరగా కడతారు. నాయకురాలు ఒక్కదానిదే బాధ్యత కాదు కదా! సంఘ సభ్యులందరిదీ బాధ్యత కదా! అందరం అడగాలి, లేకుంటే వాళ్ళు అప్పుకట్టరు. మనందరికీ అప్పులు అందవు. వాళ్లు కడితే ఇంకొక ఇద్దరు అప్పులు తీసుకోవచ్చు కదా! కనుక మనమందరము కలిసి వారు ఖచ్చితంగా అప్పు తిరిగి కట్టేటట్లు ఒత్తిడి తీసుకొనివద్దాము" అని నాయకురాలు చెప్పగా సరే అయితే అందరము అడుగుదామని సభ్యులందరూ కలిసి వారిద్దరినీ పిలిపించి అప్పు ఎందుకు కట్టలేదో కారణాలు తెలుసుకొని, తిరిగి ఎప్పటికి కడతారు అని ఒక తేదీ పెట్టి ఆ తేదీలోపల తిరిగి వాయిదాల రూపంలో కట్టేటట్లు మాట తీసుకున్నారు. దీని ప్రకారం ఆ తేదీకి వాళ్ళిద్దరూ అప్పు కట్టేశారు. అప్పటినుంచి సంఘంలో ఎవరు అప్పు సరిగా కట్టకపోయినా అందరూ కలిసి అడుగుతున్నారు.

## సమస్య : 5

## అప్పు ఒకసారి తీసుకున్న సభ్యులే మరలా అప్పులు తీసుకోవడం

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ ఒక అప్పు తీరకుండా రెండవ, మూడవ అప్పులు కూడా ఒకరు, ఇద్దరే తిరిగి, తిరిగి తీసుకొనుట<br>❷ అప్పు ఇచ్చే విషయంపై స్పష్టమైన కట్టుబాట్లు లేకపోవుట<br>❸ సంఘంలో వడ్డీరేటు తక్కువ చేసి లాబీ అవుట<br>❹ సంఘం నుంచి తక్కువ వడ్డీరేటుకు తీసుకొని బయట ఎక్కువ వడ్డీకి ఇవ్వడం | ❶ అప్పు ఇచ్చే విషయంపై నిర్దిష్టమైన కట్టుబాట్లు సంఘం నిర్ణయించుకోవాలి. అది ఏమిటంటే అప్పు ఇచ్చేటప్పుడు సభ్యుల అవసరాలలో ప్రాధాన్యతనుబట్టి ఇవ్వడం<br>❷ అప్పు అందరికీ అందేవరకు ఒక్కొక్క సభ్యురాలికి ఒక్కసారే ఇవ్వాలి.<br>❸ అప్పు తీసుకొనే వ్యక్తులు ముందే దరఖాస్తు పెట్టుకోవాలి.<br>❹ తీసుకున్న అప్పు పూర్తిగా తీరిన తరువాతే తిరిగి అప్పు తీసుకోవాలి.<br>❺ సంఘం డబ్బులు బయటి వ్యక్తులకు అప్పులుగా ఇవ్వకూడదని కట్టుబాట్లు ఏర్పాటు చేసుకోవాలి. |

## కేస్‌స్టడీ :

మిడ్జూర్ మండలంలోని దలకనూర్ గ్రామంలోని ఒక గ్రూపులో వున్న మొత్తం 15 మంది సభ్యులలో ముగ్గురు సభ్యులు నాయకురాలుకు బంధువులు. అందుకని అప్పు లీడరు ప్రతిసారి ఆ ముగ్గురికి ఇచ్చి తరువాత మిగతావారికి ఇచ్చేది. ఒకసారి చంద్రమ్మ అనే సభ్యురాలికి చాలా అవసరం వచ్చింది. సంఘం సమావేశంలో అప్పు అడిగితే నాయకురాలు లేదు సరిపోదు వచ్చే నెల తీసుకో అంది. అప్పుడు చంద్రమ్మ నా బిడ్డను స్కూల్‌లో చేర్పించాలి, వచ్చే నెలకు టైము అయిపోతుంది. కనుక ఈ నెలనే కావాలి అని అడగ్గా సభ్యులందరూ ఆమెకు ఎక్కువ అవసరం కదా మొదట చంద్రమ్మకు ఇద్దాము, తరువాత మిగతా వారికి ఇద్దాము, అసలు ఇప్పుడు ఇంకెవరు అప్పు అడిగారు అని నాయకురాలిని అడిగితే, నాయకురాలు తన చుట్టాలయిన ముగ్గురికి కావాలని చెప్పింది. అప్పుడు బుక్ కీపర్ వారికి ఇప్పటికే మూడుసార్లు అప్పు ఇచ్చాము కదా తీసుకున్నవారే తీసుకుంటే మిగతా వారికి ఎప్పుడు వస్తుంది అని అడగ్గా, అప్పుడు సభ్యులంతా ఎందుకు వారికి మూడుసార్లు ఇచ్చావు, ఇంక అలా జరగడానికి వీలులేదు, అప్పులు మంజూరీ అందరి నిర్ణయం తీసుకొని సమావేశంలో సభ్యులందరి సమక్షంలో జరగాలి, లేకుంటే మేము ఊరుకోము అని ఇకనుంచి సభ్యులందరికి వచ్చేవరకు ఒక్కొక్కరికి ఒకసారి మాత్రమే అప్పు ఇవ్వాలి అని కట్టుబాటు పెట్టుకొన్నారు. చంద్రమ్మకు అప్పు ఇప్పించి ఆ ముగ్గురికి అప్పు ఇవ్వకుండా చేశారు.

## సమస్య : 6

### ఆకాశాన్నంటే వడ్డీరేట్లు పెట్టుకుంటున్న సంఘాలు....

కొన్ని సంఘాలలో వడ్డీరేట్లు ఎక్కువగా పెట్టుకోవడం (నూటికి నాలుగు నుండి ఐదు రూపాయలు) వలన సభ్యులకు అప్పులు భారంగా అవుతున్నాయి. కనుక సభ్యులు అప్పు తీసుకోవడానికి భయపడుతున్నారు. దీని వలన సంఘంలో గొడవలు వచ్చి సంఘాలు విడిపోతున్నాయి.

**కారణాలు**

1. కొన్ని సంఘాలలో అధికమైన వడ్డీరేటు పెట్టుకుంటారు. మార్కెట్టులోని వడ్డీ వ్యాపారస్తుల వడ్డీరేటు మనం కూడా పెట్టుకుందాము, ఎక్కువ వడ్డీ వస్తే మన సంఘంలోనే కదా ఉండేది అనే భావన సభ్యులలో కలిగి కొంతమంది అవగాహన లేని నాయకులు ఇటువంటి అధిక వడ్డీ రేటును ప్రోత్సహిస్తారు.
2. అంతేకాక సంఘంలో అందరి అనుమతి తీసుకోకుండా కొందరి ఆమోదంతో చేయడంవలన సభ్యులకు గొడవలు వచ్చి సమస్యగా మారుతుంది.

   **ఒక చిన్న ఉదాహరణ :** విశాఖ జిల్లాలోని కొబ్బరితోట గ్రామంలో కనకమహాలక్ష్మి మహిళాభ్యుదయ పొదుపు సంఘం లీడరు జయమ్మ సంఘానికి పూర్వం చీటీలు నడిపేది. సంఘం పెట్టి లీడరయిన తరువాత సంఘంలో అప్పులపై నెలకు నూటికి అయిదు రూపాయలు పెట్టింది. సంఘంలోని మిగతా సభ్యులు చిన్నా చితక ఆకు కూరలు అమ్మేవారు, పాత బట్టలు అమ్మేవారున్నారు. మొదటి ఆరునెలల పాటు నలుగురు సభ్యులే అప్పు తీసుకున్నారు. రానురానూ సంఘం నుండి ఎవరూ అప్పు తీసుకోవటం లేదు. నెలవారీ పొదుపులు జయమ్మ చేతిలో నిల్వగా ఉండిపోసాగింది. చేతిలో నిల్వలను జయమ్మ

**పరిష్కారం**

1. సంఘంలో వడ్డీరేటు ఎంత పెట్టుకోవాలనేది ఒక నాయకురాలి ఇష్టంతోనో లేక ఒకరి, ఇద్దరి సభ్యుల ఇష్టంతోనో కాక సభ్యులందరూ కూర్చొని దానిపై చర్చించి అందరి పరిస్థితిని, సంఘాన్ని దృష్టిలో ఉంచుకొని ఎంత వడ్డీరేటు పెట్టుకుందాము, అది కూడా బయటి కన్నా సంఘంలో ఇచ్చే అప్పుకు తక్కువ వడ్డీరేటు ఉండేటట్లు పెట్టుకుందాము అని అందరూ చర్చించుకొని ఒకరేటు నిర్ణయించుకుంటే సమస్యలు రావు
2. ఆ రకంగా చేయడంవలన సభ్యులందరికీ, సౌకర్యంగా ఉంటుంది. సభ్యులు వడ్డీవ్యాపారస్తుల దగ్గరికి వెళ్లే అవసరం ఉండదు.
3. అంతేకాక బయటి వ్యక్తులకు సంఘం అప్పు ఇవ్వకూడదు అని కట్టుబాటును ఏర్పాటుచేసుకుంటే పై సమస్య రాదు.
4. ప్రస్తుతం ఏర్పాటైన సంఘాలలో ఈ సమస్య ఉంటే సభ్యులందరూ కూర్చొని అందరి పరిస్థితి దృష్టిలో ఉంచుకొని చర్చించి సభ్యుల ఆర్థిక పరిస్థితికి తగ్గట్టు వడ్డీ రేటును నిర్ణయించుకుంటే సంఘంలో సమస్య ఉండదు.
5. మనం సంఘాలు ఏర్పాటు చేసుకుంది అధిక వడ్డీరేట్లు పెట్టుకొని వడ్డీ వ్యాపారస్తుల లాగా

ఎక్కువ వడ్డీకి బయట వారికి అప్పులు ఇవ్వటం, ఎవరైనా సభ్యులు ప్రశ్నిస్తే తన పేరున అప్పులు రాసుకోవటం, సంఘంలోని సభ్యులు ఎవరూ ప్రశ్నించనపుడు వచ్చే వడ్డీని జయమ్మ అనుభవిస్తూ వుండటం చేసేది. సంఘంలోని సభ్యులు మాత్రం సంఘం నుండి అప్పు తీసేవారు కాదు. సరియైన లెక్కలు కూడా చూపకుండా చివరకు పొదుపుల వరకు మాత్రం లెక్కలు తేల్చింది. ఈ విధంగా రెండు సంవత్సరాలపాటు జయమ్మ సంఘం డబ్బుతో తను లాభపడింది. దీని వలన సంఘంలో గొడవలు వచ్చి సంఘం విడిపోయింది.

వ్యాపారం చేయడానికి కాదు. సంఘం ద్వారా ప్రతి ఒక్క సభ్యురాలి అవసరాలు తీరి ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ముందుకు వెళ్ళాలనే ఉద్దేశ్యంతో సంఘాలు ఏర్పరచుకొన్నాము అనే భావన పెరిగేలా చర్చలు చేయాలి.

మనం ఎంత నాయకులయినా, ఈ డబ్బు మనది కాదు. ఇది సంఘ సభ్యులందరి డబ్బు!

## సమస్య : 7

### నాయకురాళ్ళు మాత్రమే బ్యాంకు ఖాతా నిర్వాహణలో పాల్గొనటం....

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ కొన్ని సంఘాలలో సంఘ పొదుపు ఖాతా నిర్వాహణకు ఎప్పుడూ సంఘ నాయకురాళ్ళే బ్యాంకుకు వెళుతుంటారు. సంఘ సభ్యులు కూడా నాయకురాళ్ళకే అంతా తెలుసు, కనుక బ్యాంకు వ్యవహారాలన్నీ నాయకురాళ్ళే చూసుకుంటే బాగుంటుంది అని వారినే పంపుతారు. | ❶ ప్రతిసారి ఒక సభ్యురాలు కూడా బ్యాంకుకు వెళ్ళటం వలన సభ్యులు అందరికీ కూడా బయటి విషయాలు తెలుస్తాయి. బ్యాంకుకు అలవాటు పడతారు. బ్యాంకు అధికారులతో సభ్యులందరికీ సత్సంబంధాలు ఏర్పడతాయి. సంఘం మాది అనే భావన కలుగుతుంది, ఇచ్చిపుచ్చుకునే అలవాటు పెంపొందుతుంది |
| ❷ సభ్యులకు, సంఘానికి సంబంధించిన అన్ని విషయాలు తెలిస్తే మమ్మల్ని లెక్కచేయరు అనే భావన నాయకురాళ్ళకు ఉండటం. | ❷ బ్యాంకుకు ప్రతిసారి నాయకురాలు మాత్రమేకాక సభ్యులు కూడా వెళ్ళేటట్లు కట్టుబాట్లు పెట్టుకోవాలి. |
| ❸ సభ్యుల విషయానికి వస్తే మీరు నాయకురాళ్ళు కదా సంఘానికి సంబంధించిన అన్ని బాధ్యతలు మీరే చేపట్టాలి అని సభ్యులు అనుకోవటం, సభ్యులు బ్యాంకుకు వెళ్ళటానికి సుముఖత చూపకపోవడం. | ❸ బ్యాంకులో డబ్బులు కట్టిన తరువాత రశీదును సంఘ సభ్యులకు చూపించాలి. |

## సమస్య : 8

## ఋణాలు, గ్యాస్ కనెక్షన్ల కోసం ఎదురుచూసీ, చూసీ విసుగెత్తిన సంఘాలు....

సంఘ సభ్యులు మాకు బ్యాంకు నుంచి ఋణాలు కాని, గ్యాస్ కనెక్షన్లు కాని ఇంతవరకు రాలేదు కనుక మాకు పొదుపులు వద్దు, సంఘాలు వద్దు అని పొదుపులు కట్టడం మానేస్తారు

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సభ్యులకు బ్యాంకునుంచి ఋణాలు ఏమేమి వస్తాయి, ఎప్పుడు వస్తాయి, అవి రావాలంటే సంఘము ఏ విధంగా ఉండాలి అనే సమాచారం తెలియక పోవడం వలన మరియు వచ్చినవి నాయకురాలు ఉపయోగించుకొని సభ్యులకు చెప్పక పోవడం వలన సభ్యులకు బ్యాంకునుంచి వచ్చిన ఋణాలు అందడం లేదు. అదే విధంగా, సమాచారం కూడా తెలియడం లేదు.<br>❷ పొదుపులు, అప్పులు పద్ధతి ప్రకారం నెల నెలా సభ్యులు చెల్లించక పోవడం, నెలా నెలా జరిగే సమావేశాలు క్రమముగా జరుపుకోకపోవడం వలన ప్రభుత్వ పథకాల గురించి ఏ సమాచారం సభ్యులకు తెలియక పోవడంతో వారికి ఆ పథకాలు అందడం లేదు.<br>❸ సంఘంలో పొదుపుచేస్తే ఏదైనా వస్తుంది అని చేరడం<br>❹ పొదుపు ఆవశ్యకత, ప్రాముఖ్యత తెలియకపోవడం<br>❺ బ్యాంకులో సరియైన సంబంధాలు ఏర్పరుచుకోకపోవడం<br>❻ సంఘం అంటే ఏమిటి, సంఘం ఆవశ్యకత గురించి తెలియక పోవడం<br>❼ సంఘంగా ఉంటే లోన్లు, ఋణాలు వస్తాయి అనే ఆశతో సంఘం ఏర్పాటు చేసుకోవడం | ❶ సంఘానికి బయటినుంచి ఋణాలుకాని, గ్యాసు కనెక్షన్లు కాని రావాలంటే సంఘం ఏర్పాటుచేసుకొని కనీసం సంవత్సర కాలం అయి ఉండాలి. పొదుపులు, అప్పులు క్రమంగా కట్టాలి, సమావేశాలు, పుస్తక నిర్వహణ క్రమంగా ఉండాలి<br>❷ సంఘంలో పొదుపులు చేసుకోవడం వలన కావలసినప్పుడు అప్పులు తీసుకోవడానికి వీలుగా వుంటుంది మరియు వ్యక్తిగత, కుటుంబ అభివృద్ధికి ఉపయోగపడుతుంది. అంతేకాని గ్యాస్ కనెక్షన్లు, సబ్సిడీలు, రివాల్వింగ్ ఫండ్ల కోసమే సంఘంకాదు అనే విషయం సభ్యులకు తెలియచెప్పాలి.<br>❸ సంఘాలు ఏర్పడేటప్పుడు అప్పులు ఇస్తాము, గ్యాస్ కనెక్షన్లు ఇస్తాము అని చెప్పి సంఘాలు ఏర్పాటు చేయకూడదు<br>❹ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలన్నీ సభ్యులందరికీ తెలిసేటట్లు, అందేటట్లు చూడాలి. ఉదా: గ్రూపులు చేసుకొన్న ఒక సంవత్సరానికి అప్పులు వస్తాయి, గ్యాస్‌లు వస్తాయి. ఇవి అందరికీ ఒకేసారి ఇవ్వరు. మొదట కొంతమందికి, తరువాత కొంతమందికి అలా ఇస్తారు. ఆ వివరాలు సభ్యులకు చెప్పాలి.<br>❺ సభ్యులు ఏ నెల పొదుపు, అప్పు, ఆ నెలే కట్టాలనే కట్టుబాటు పెట్టుకోవాలి.<br>❻ సంఘ సభ్యులందరూ బ్యాంకులతో, ఇతర ప్రభుత్వ సంస్థలతో సత్సంబంధాలు పెంచుకుంటే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం తెలుస్తుంది. |

## కేస్‌స్టడీ :

మిడుత్తూరు మండలంలోని కలమందలపాడు అనే గ్రామంలో శ్రీలక్ష్మి గ్రూపులో 15 మంది సభ్యులున్నారు. వారికి 3 సంవత్సరాల వరకు ఎలాంటి లోన్లుకాని ఏమీ రాలేదు. అప్పుడు సంఘ సభ్యులనుంచి ఇన్ని సంవత్సరాల నుండి మాకు ఏమీ రాలేదు కనుక మాకు ఈ పొదుపులు వద్దు, సంఘం వద్దు అనే సమస్య ఎదురైంది. అప్పుడు సంఘం లీడరు సభ్యులందరినీ పిలిచి మీటింగ్ పెట్టి అందరికీ ఇటా చెప్పింది, "గ్రూపుల వలన గ్యాస్‌లు రావడం, లోన్లు రావడమే కాదు, గ్రూపుల వలన మనకు తెలివి పెరుగుతోంది, మన పనులు మనమే చేసుకోగలము. ఇప్పటి వరకు బ్యాంకు అధికారులతో పరిచయాలు లేవు, మరియు పుస్తకాలు సరిగా రాసుకోలేదు, మాకు లోను కావాలని మనము కూడా బ్యాంకుకు వెళ్ళి అడగలేదు. అందుకే ఇన్ని రోజులనుంచి మనకేమీ రాలేదు. నేను మొన్న ట్రైనింగ్‌కి వెళ్ళినప్పుడు కార్యకర్తతోపాటు బ్యాంకు అధికారులు కలిసి మన సంఘం గురించి చెప్పారు. అయితే సారు నేను వారం రోజుల్లో మీ గ్రూపుకు వస్తాను. ఈ లోపు మీరు పుస్తకాలన్నీ బాగా వ్రాయించుకోండి. నేను వచ్చి పుస్తకాలు చూసి మీ సభ్యులందరితో మాట్లాడి అన్నీ బాగా ఉంటే ఖచ్చితంగా లోను ఇస్తాను అని చెప్పారు" అని నాయకురాలు చెపుతుంది. వారం రోజులకు బ్యాంకు సారు వచ్చినప్పుడు సభ్యులందరూ తమ గ్రూపు ఎప్పుడు ఏర్పాటు చేసుకొన్నారు, ఎంతమంది వున్నారు, ఏమేమి కార్యక్రమాలు చేసుకొంటున్నారు అనేది వివరంగా చెప్పారు. అంటే, వారు పొదుపులు సక్రమంగా చేసుకుంటున్నది, సమావేశాలు, పుస్తక నిర్వహణ కూడా సక్రమంగానే జరుపుకుంటున్న విషయం అయితే వారికి మూడు సంవత్సరాలనుంచి ఏమీ రాలేదు అని చెప్పారు. అప్పుడు ఎ.పి.ఓ. ఇన్నిరోజుల నుంచి సక్రమంగా పొదుపులు చేసుకుంటుంటే ఎందుకు రాలేదు. మీరు పుస్తకాలు అన్ని రాసుకుంటున్నారా అంటే రాస్తున్నాము అని అన్నారు. మీరు పొదుపులు ఆపకుండా సక్రమంగా చేసుకుంటూ, పుస్తకాలు అన్ని రాస్తుంటే మీకు తప్పకుండా ఋణాలు వస్తాయి అని చెప్పారు. పుస్తకాలు అన్నీ చూసి అన్నీ బాగానే ఉన్నాయి కనుక మీకు ఈసారి గ్యాస్‌లు, ఆర్.ఎఫ్. వస్తుంది. అందరికీ ఒకేసారి ఇవ్వలేము కదా! కనుక తరువాత లిస్టులో మీ గ్రూపుకు ఇస్తాము అని బ్యాంకు మేనేజర్ సభ్యులందరికీ చెప్పారు. అప్పుడు సభ్యులందరు లీడరును మెచ్చుకొని గ్రూపులో అందరూ సఖ్యతగా వుంటున్నారు. పొదుపులు క్రమం తప్పకుండా చేసుకొంటున్నారు.

## సమస్య : 9

### లెక్కలు చెప్పని బుక్ కీపర్లు - ఇబ్బందులు పడుతున్న సంఘాలు....

సంఘంలో జరిగే ఆర్థికపరమైన లావాదేవీల గురించి సభ్యులకు ఎప్పటికప్పుడు వివరాలు నాయకురాలు, బుక్ కీపర్‌లు తెలుపకపోవుటం వలన సభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు ఏర్పడి సమస్యగా మారడం.

**కారణాలు**

1. నెల నెలా జరిగే సమావేశాలకు సభ్యులం దరూ హాజరు కారు, హాజరైన సభ్యులు కూడా సమావేశంలో కూర్చొని చర్చించ కుండా పొదుపులు కట్టేసి వెళ్లిపోతారు
2. బుక్‌కీపర్ సంఘనిధికి సంబంధించిన వివరాలు, అంటే ఎవరిపై ఎంత అప్పు ఉన్నది, సంఘం మొత్తంలో ఎంత అప్పు ఉన్నది, ఆ నెలకు ఎంత వడ్డీ వచ్చింది, మొత్తం ఎంత వడ్డీలు వచ్చినవి, సంఘంలో ఏ అవసరాలకు ఎంత ఖర్చు అయినది వంటి వాటిని సభ్యులందరికీ తెలియచేయక పోవడం
3. ఏయే సంస్థల నుండి ఎంత అప్పులు తెచ్చినదీ, ఎంత రివాల్వింగ్ ఫండ్ వచ్చినదీ వంటి విషయాలు అందరి సభ్యులకు తెలియకపోవుట వలన మరియు కొన్ని సంఘాలలో బుక్‌కీపర్ పుస్తకాలు ఇంటిలో రాయడం మరియు లెక్కలు ఎప్పటికప్పుడు పూర్తిగా రాయకపోవడం వలన సమావేశంలో సభ్యులకు వివరంగా చెప్పలేకపోవడం
4. నోటిలెక్కలు లేదా కాకి లెక్కలతో గడిపేస్తుంటారు. దీని వలన సంఘాలలో సభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు ఏర్పడతాయి
5. బుక్ కీపర్‌కు సరియైన శిక్షణలు లేకపోవడం వలన, ఎప్పటికప్పుడు లెక్కలు రాయడం పూర్తి చేయలేక పోవడం

**పరిష్కారం**

1. సభ్యుల పొదుపులు, అప్పుల వివరాలు ప్రతి సమావేశంలోనే పుస్తకాలలో వ్రాసి సభ్యులందరికీ వారి పొదుపు ఎంత ఉంది, వారి అప్పు ఎంత వున్నది, వడ్డీ ఎంత వున్నది వివరంగా సభ్యులకు బుక్ కీపర్ తెలియచెప్పాలి అనే కట్టుబాటు ఏర్పాటు చేసుకోవాలి.
2. సభ్యుల పొదుపే కాక, సంఘం నిధి ఎంత వున్నదీ, వడ్డీ ఎంత వచ్చినదీ, సంఘంలో అప్పులు ఎంత వున్నాయీ, ఖర్చులు ఎంత అయ్యాయి మొదలగు వివరాలన్నీ ఎప్పటికప్పుడు పుస్తకాలలో రాసి, సభ్యులందరికీ వివరంగా తెలియజెప్పాలి.
3. రివాల్వింగ్ ఫండ్ వివరాలు, అప్పుల రూపంలో ఎంత డబ్బులు సభ్యులమీద ఉంది అనే వివరాలు కూడ పుస్తకాలలో రాసి సంఘ సభ్యులకు తెలియజేయాలి.
4. ప్రతీ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలి. హాజరైనవారు సమావేశం ముగిసేవరకు ఉండి అన్ని విషయాలు తెలుసుకొని అన్నింటి గురించి చర్చించిన తరువాత అందరూ సంతకాలుచేసి వెళ్ళాలని కట్టుబాటు ఏర్పాటు చేసుకోవాలి.
5. బుక్ కీపర్ సంఘం గౌరవ వేతనం ఇచ్చి పెట్టుకున్న గుమస్తా. కనుక, బుక్ కీపర్ సంఘ సభ్యులకు జవాబు దారీ అని సభ్యులకు, బుక్ కీపర్‌కు తెలియ జెప్పాలి. అదే విధంగా బుక్ కీపర్ మాట వినకపోతే వారిని తొలగించే అధికారం కూడా సంఘానికి ఉన్నదని తెలపాలి.
6. సంఘం లీడరు సభ్యులు ఎన్నుకున్న వారే కనుక సభ్యులకు జవాబు దారీగా ఉండాలి. లేని పక్షంలో ఆ లీడరును తొలగించి ఆమె స్థానంలో సంఘ సభ్యుల మాటలు వినే వారిని నాయకురాలిగా ఎన్నుకోవచ్చునని కార్యకర్త సంఘం సభ్యులకు వివరించాలి.

## సమస్య : 10

### సంఘ నిధిని దుర్వినియోగపరుస్తున్న నాయకులు....

సంఘ నిధిని సంఘ నాయకులు కలిసి సభ్యులకు తెలియకుండా దుర్వినియోగం చేయడంవలన సంఘాలలో సభ్యుల మధ్య గొడవలు వచ్చి అవి విడిపోయే పరిస్థితి వస్తుంది

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ బ్యాంకుకు నాయకులు మాత్రమే వెళ్ళాలి, సభ్యులకు ఏమీ తెలియదు అనే భావన సంఘ సభ్యులలో ఉండటం<br>❷ సంఘం డబ్బును సభ్యులకు తెలియకుండా నాయకురాలు తన అవసరాలకు వాడుకోవడం<br>❸ సంఘ నాయకులు, బుక్ కీపరు కలిసి సభ్యులకు లెక్కలు సరిగా చూపించకుండా సంఘం డబ్బులను ఉపయోగించుకోవడం<br>❹ సమావేశాలు సక్రమంగా పెట్టుకోకపోవుట వలన సంఘంలో ఎంత ఖర్చులు అయ్యాయి, దేనికోసం పెడుతున్నారు, ఎంత పొదుపులు వచ్చినాయి, ఎంత మొత్తం అప్పుల కింద ఉంది అనే విషయాలు అందరికీ తెలిసే అవకాశం ఉండక పోవడం వలన సంఘ నాయకులు, సంఘ నిధిని దుర్వినియోగంచేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. | ❶ బ్యాంకు పనులకు నాయకులే కాక సభ్యులు కూడ వెళ్ళాలి అని కట్టుబాటు పెట్టుకోవాలి.<br>❷ సంఘం ఖర్చులు అనేవి ఎంత పెడుతున్నామో దేనిదేనికి పెడుతున్నామో సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజెప్పాలి<br>❸ నాయకుల వ్యక్తిగత ఖర్చులకు పెటుకున్న డబ్బులను సంఘం ఖర్చులలో కలపకూడదు అని కట్టుబాటు ఏర్పాటు చేసుకోవాలి.<br>❹ బ్యాంకు నుండి డబ్బు తీసే ముందు ఏ ఖర్చులకు తీస్తున్నాము, ఎంత తీస్తున్నాము అనేది సభ్యులందరికీ తెలియజెప్పి, సభ్యులందరి సంతకాలు తీసుకొని తరువాత డ్రా చేయాలి<br>❺ చేతి నిల్వలు కూడా ఎప్పటికప్పుడు బ్యాంకులో వేయాలి. వేసి వచ్చిన తరువాత సమావేశంలో సభ్యులందరికీ బ్యాంకులో ఎంత డబ్బు వేశాము, ఖర్చు ఎంత అయింది అనే లెక్కలు వివరంగా చెప్పాలి. చేతిలో ఏమి పెట్టుకోకూడదు. ఫైవన్నీ వుండేటట్లు కట్టుబాట్లు పెట్టుకోవాలి. ప్రస్తుతం ఏర్పాటైన సంఘాలలో అయితే సంఘ సభ్యులను అందరినీ సమావేశపర్చి బుక్ కీపర్ ద్వారా లెక్కలన్నీ సరిచూసుకొని ఎక్కడ తేడా వచ్చిందో దాని గురించి సభ్యులు, నాయకురాళ్ళు, బుక్ కీపరు అందరూ చర్చించి ఎక్కడ, ఎలా పొరపాటు వచ్చింది, దానికి ఏమి చేయాలి అనేది (అంటే ఎవరి ద్వారా పొరపాటు జరిగి ఉంటే వారు తిరిగి కట్టేటట్లు) అందరూ చర్చించి నిర్ణయం తీసుకోవాలి.<br>❻ సంఘం, దేనికి ఎంత ఖర్చు పెట్టాలి అన్నది గత ఆరు మాసాల ఖర్చులను చూసి కట్టుబాటు ఏర్పాటు చేసుకోవాలి. అంతకుమించితే ఖర్చు పెట్టటానికి కారణాలను సంఘంలో తెలియజేసి అనుమతి పొందాలి. ఆ ఖర్చు కూడా సాధారణంగా రానిది అయినప్పుడు మాత్రమే సంఘం ఆమోదించాలి. లేనిచో అనవసరమైన ఖర్చుకు ఎవరికి వారు వ్యక్తిగతంగా భరించాలని సంఘం కట్టుబాటు పెట్టుకుని అమలు చేయాలి. |

## కేస్‌స్టడీ :

సంఘం డబ్బును నాయకురాలు నాగమ్మ బ్యాంకులో డిపాజిట్ చేయటానికి బయలుదేరుతుంది. మొదట తన పనులు చూసుకొని అంటే, గేదెలకు కావలసిన తవుడు, కోళ్ళకు కావలసిన మందులు, పిల్లలకు కావలసిన తినుబండారాలు, భర్తకు కావలసిన చుట్ట, సిగరెట్లు అన్ని కొనుక్కొని రిక్షా ఎక్కి బ్యాంకు చేరేసరికి బ్యాంకు సమయం అయిపోవటం వలన బ్యాంకు కట్టేయడం జరిగింది. అప్పుడు నాగమ్మ ఆ డబ్బును తన స్వంత అవసరాలకు వాడుకొంది. సభ్యులకు ఏమి తెలుసులే వాళ్ళు ఎప్పుడో అడుగుతారు, ఆ రోజుకి తిరిగి బ్యాంకులో వెయ్యొచ్చులే అని తన స్వంత అవసరాలకు వాడుకొని సభ్యులకు తెలియ చెప్పదు. అంతేకాక నాగమ్మ బ్యాంకుకు తన అక్క కూతురిని కూడా వెంట తీసుకెళ్ళింది. ఆ రోజు ఇద్దరికి అయిన ఖర్చులన్నీ సంఘంపై వేసింది. ఈ రకంగా నాగమ్మ సంఘ నిధిని దుర్వినియోగం చేస్తూ వచ్చింది. ఇది తెలిసిన సభ్యులు నాయకురాలని అడిగితే నాయకురాలు సమాధానం చెప్పలేదు. సంఘానికి రావడం లేదు, దీనితో సభ్యుల మధ్య గొడవలొచ్చి సంఘం విడిపోయింది. కొన్ని రోజుల తర్వాత కార్యకర్త వచ్చి సభ్యులతో చర్చలు చేయడంతో సభ్యులు జరిగిన విషయం చెప్పారు. అప్పుడు నాయకురాలయిన నాగమ్మను పిలిపించి, సభ్యులందరూ కలసి బుక్ కీపర్ ద్వారా మొత్తం లెక్కలు తనిఖీ చేయించగా రూ. 1000/-కు లెక్క తేలడం లేదు. నాగమ్మను అడిగితే బ్యాంకుకు వెళ్ళినప్పుడు ఖర్చులు అయినాయి అని చెప్పింది. బ్యాంకు ఖర్చులు కొంత లెక్క చేసిన తరువాతనే రూ. 1000/- తక్కువ పడుతుంది అని అడగగా, అప్పుడు తన సొంత ఖర్చులకే వాడుకున్నానని కొంత సమయము ఇస్తే తిరిగి కట్టేస్తానంది. అప్పటి నుంచి సంఘ సభ్యులందరూ కలిసి నాయకురాలిను మార్చుకోవాలని, బ్యాంకుకు నాయకురాలు, ఒక సభ్యురాలు వెళ్ళాలి, వెళ్ళి వచ్చిన వెంటనే ఎంత ఖర్చు అయింది, దేనిదేనికి అయింది అని సభ్యులందరికీ తెలిపి పుస్తకాలలో రాయించాలి అని నిర్ణయం తీసుకున్నారు.



మనం ఈ డబ్బు దుర్వినియోగం చేస్తామేమోనని మన సభ్యులంతా ఎలా చూస్తున్నారో చూశావా?


వలస వెళ్ళుతున్న వెంకటమ్మ
కుటుంబము


వలస వెళ్ళిన వెంకటమ్మ ఇప్పుడే
బస్సు దిగింది. చూడండి

## సమస్య : 11

### వలస పోవడం వలన అప్పులు తిరిగి రాక వెలవెలబోతున్న సంఘాలు....

సంఘాలలో కొంతమంది సభ్యులు పనులు లేని కాలంలో వేరే చోటుకి వలస పోతారు. ఆ విధంగా వలసపోయిన సభ్యులు తీసుకున్న అప్పులు తిరిగి సక్రమంగా కట్టడం జరగకపోవడం వలన సమస్య రావడం.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ కరువుపీడిత జిల్లాలలోని కొన్ని గ్రామాల నుండి పేదలు పనులకు వలస వెళ్ళడం చూస్తుంటాము. ఆ విధంగా వెళ్ళేవారిలో సంఘ సభ్యులు కూడా వుంటారు.<br>❷ సభ్యులు మామూలు పరిస్థితులలో పొదుపు అప్పులు సక్రమంగా చెల్లిస్తున్నప్పటికీ కరువు పరిస్థితుల్లో వలస పోవడం వలన కనీసం అడుగుదామన్నా అందుబాటులో ఉండరు. వారు వ్యవసాయంపై పెట్టుబడులుపెట్టి వర్షాలు లేక పంటలు ఎండిపోవుట వలన అధిక నష్టాన్ని పొంది ఉంటారు కనుక వలసపోవాల్సి ఉంటుంది.<br>❸ కనుక ఇలాంటి సమయంలో వారు తీసుకున్న అప్పును సక్రమంగా చెల్లించలేక పోతారు. అంతేకాక బ్రతకడానికి దూర ప్రాంతాలకు వలస వెళ్ళడం వలన వారు అప్పును తిరిగి కట్టడం అనేది కొంచెం కష్టం అవుతుంది.<br>❹ అదనపు పొదుపుల గురించి సభ్యులకు తెలియక పోవడం<br>❺ సంఘాలకు జీవనోపాధులపై సరియైన అవగాహన లేకపోవడం<br>❻ సంఘానికి అప్పు చెల్లింపులు, సరియైన కట్టుబాట్లు లేకపోవడం | ❶ వలసపోయే వారు నెలకొక్కసారి వారి కుటుంబంలో వారిని చూసుకొని, వారి ఖర్చులకు డబ్బులు ఇవ్వడానికి వస్తారు కదా! కనుక ఆ వచ్చేది సంఘం సమావేశం పెట్టుకొనే రోజు వస్తే సమావేశంలో ఏమి జరుగుతుందో తెలుసుకోవచ్చు. అప్పు కట్టి వెళ్ళవచ్చు. కనుక ఆ విధంగా చేయాలని కట్టుబాట్లు పెట్టుకోవడం.<br>❷ వలసపోయేవాళ్ళు వెళ్ళే ముందు సంఘ సభ్యులకు ఎక్కడకు వెళుతున్నాము, ఎన్నిరోజులు వెళుతున్నాము, మధ్య మధ్యలో ఎన్నిరోజులకొక్కసారి వస్తాము, అప్పు పరిస్థితి ఏమిటి మొ॥అన్ని విషయాలు సంఘంవారితోమాట్లాడివెళ్ళేటట్లు కట్టుబాట్లు పెట్టుకోవాలి.<br>❸ వెలుగులాంటి ప్రాజెక్టులు పనులు లేని కాలంలో కూడా కొన్ని కార్యక్రమాలు చేసుకొని స్వంత ఊర్లోనే ఉండేటట్లు (వలస పోకుండా) చేయడానికి జీవనోపాధులమీద పనిచేస్తున్నారు. కనుక ముందు ముందు వలసపోవడం కొంత వరకు తగ్గవచ్చు.<br>❹ లెక్క నిర్వహణలో శిక్షణ పొందిన, బుక్ కీపర్ ఉన్న సంఘంలో వలస పోయే సభ్యులపేరున అదనపు పొదుపులకు వేరు ఖాతాలను నిర్వహించాలి. వ్యవసాయ పనులు అధికంగా ఉన్న సమయంలో సంపాదించే కొంత మొత్తాలను అదనపు పొదుపు చేసుకొని సభ్యులు వలసలు వెళ్ళిన సమయంలో తమ అప్పు వాయిదాలకు వాడుకునేటట్లుగా కట్టుబాటు పెట్టుకుని అమలు చేసుకోవడం వలన ఇటువంటి సమస్యలను పరిష్కరించవచ్చును. |

## కేస్‌స్టడీ :

రంగారెడ్డి జిల్లా కోదండరామాపురం గ్రామంలో రాజరాజేశ్వరీ సంఘంలో సుజాతమ్మ సంఘంలో సభ్యురాలు. ఆమె సంఘం సమావేశాలకు రావడం, పొదుపు డబ్బులు కట్టుకోవడం సక్రమంగా చేస్తుండేది. సుజాతమ్మ భర్త కూలీ పని చేసేవాడు. కాని గ్రామంలో పని దొరకడం లేదని, వేరే గ్రామానికి వలస వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. ఈ విషయం సుజాతమ్మ సంఘ సభ్యులకు చెప్పింది. అప్పుడు సభ్యులు సంఘంలో సుజాతమ్మ పొదుపు 1260/- అప్పు 3210/- ఉంది. కనుక నీ అప్పు సంగతేంటి అని సభ్యులందరు ఆమెను అడగడం జరిగింది. అప్పుడు సుజాతమ్మ తాను నెలకు ఒకసారి వచ్చి ఇంటి ఖర్చులకు డబ్బులు అత్తామామలకు ఇచ్చి వెళతానని, అప్పుడు అప్పు కట్టి సంఘ విషయాలను తెలుసుకుంటానని చెప్పి తాను వెళుతున్న గ్రామం, చిరునామా, పూర్తి వివరాలు కూడా ఇచ్చి వెళతాను అని చెప్పింది. ఒకవేళ తాను రాలేని పక్షంలో సంఘంలోని పార్వతమ్మను జామీనుగా ఉంచి, ఆమె ద్వారా అప్పు పంపించడం చేస్తాను అని చెప్పింది. ఆ రోజు నుంచి క్రమం తప్పకుండా అప్పును పంపించడం జరిగింది. అలా చేయడం వలన సుజాతమ్మ అప్పు తీరిపోయింది. సంఘ సభ్యుల మధ్య కూడా గొడవలు రావడం లేదు.

## సమస్య : 12

**పుస్తకాలలో లెక్కలుంటాయి కాని చేతిలో డబ్బులుండని సంఘాలు....**

సంఘం సమావేశం జరిగేటప్పుడు కొంతమంది సభ్యులు సమావేశానికి పొదుపు తేకుండా సాయంత్రం ఇస్తామని అప్పుడు లెక్కలు రాసేయమని చెప్పడం సమస్యగా మారింది

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ వివిధ కారణాల వలన సభ్యులు మీటింగు సమయానికి డబ్బు సమకూర్చుకోకపోవడం. వారు సమావేశానికి వచ్చి పొదుపులు చెల్లించవలసి వచ్చినపుడు ''పుస్తకంలో చెల్లించినట్టు రాయి, నేను పొదుపు సాయంత్రం ఇస్తాను'' అని నాయకులతోనో, అప్పు ఎవరు తీసుకుంటారో వారికి అప్పచెబుతాననటం. ఇలా చేయటం వలన సభ్యులు తమ దైనందిన కార్యక్రమాలలో పడిపోయి బాధ్యతలు మరచిపోతారు.<br>❷ పుస్తకాలలో రాస్తే సరిపోతుంది, డబ్బు తర్వాత | ❶ పొదుపులు కాని, అప్పులు కాని, సభ్యులు సమావేశానికి వచ్చి సమావేశంలో సభ్యులందరి సమక్షంలో కట్టి పుస్తకంలో రాయించుకోవాలి.<br>❷ అలా కాకుండా ఇంటి దగ్గర ఎక్కడ కనిపిస్తే అక్కడ పొదుపు డబ్బులు నాయకురాలికి ఇస్తే దానికి బాధ్యత సంఘానిది కాదు. ఇంకా ఇలా పొదుపులు సంఘంలో వచ్చి కట్టకుండా ఇంటి దగ్గర కలసినప్పుడు నాయకురాలికి ఇవ్వడం వలన ఆమె మరచిపోయి సంఘంలో ఇవ్వకపుస్తకంలో రాయించక పోవడం వలన మోసపోయిన సభ్యుల |

ఇవ్వవచ్చు అని భావిస్తుంటారు.

3. సభ్యుల మధ్య బంధుత్వం, స్నేహం ఉంటుంది. కనుక మా వాళ్ళే అనే భావనతో పరస్పరం ఒప్పుకోవడం
4. సమావేశం సమాయానికి డబ్బు సమకూర్చలేకపోవడం
5. సమావేశంలో ఆర్థిక లావాదేవీలు జరగాలనే కట్టుబాట్లు పెట్టుకోకపోవడం

గురించి చెప్పాలి.

3. పై విషయాలన్నీ కార్యకర్త సభ్యులకు ముందే చెప్పాలి. ఏర్పాటయిన సంఘాలలో సమస్యలుంటే సభ్యులందరకి,వ నాయకురాలికి, బుక్‌కీపరుకు వివరంగా చెప్పాలి. డబ్బులు సమావేశంలోకాక, బయట ఎక్కడ కనిపించి ఇచ్చినా కట్టించుకోవద్దని మరియు డబ్బులివ్వకుండా పుస్తకాలలో రాయకూడదని సభ్యులకు చెప్పాలి. ఇప్పటినుంచైనా అలాచేస్తే పై సమస్య రాదు.

## సమస్య : 13

## బయట నిధుల సమీకరణలో డిమాండ్ అసెస్‌మెంట్ చేసేటప్పుడు ఎదురయ్యే ఇబ్బందులు

### కారణాలు

1. డిమాండ్ అసెస్‌మెంట్ చేసేటప్పుడు అనువైన ప్రణాళిక గురించి సభ్యులకు తెలియకపోవడం, ఒకరి అవసరం గురించి ఇంకొకరికి తెలియచెప్పకపోవడం, ఏ సమయంలో ఎంత లోను కావాలి, ఏ కార్యక్రమం చేసుకోవాలి అనేది గుర్తించకపోవడం
2. సంఘ సభ్యులకు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన లేకపోవటం, అవసరానికి నిధులు సమకూరకపోవడం
3. బ్యాంక్ నుంచి అప్పు ఇవ్వాలంటే సొంత నిధిని 25% బ్యాంక్‌లో డిపాజిట్ చేయమనడం. బ్యాంక్‌లో సంబంధిత పేపర్లన్నీ ఇంగ్లీష్‌లో ఉండడం

### పరిష్కారం

1. సర్వసాధారణంగా కార్యకర్త స్వయం సహాయక సంఘం లోన్ డిమాండ్ అసెస్‌మెంట్ చేసేటపుడు అనుకూలమైన సమయం ఎంచుకొని సభ్యులందరితో సమావేశం ఏర్పాటుచేసి వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక పరమైన ప్రణాళికను తయారు చేయాలి
2. గ్రూపు నిధులు (జమా ఖర్చులు) వనరులు - ఉపయోగం వంటి అంశాలు కనీసం 3 నెలల వరకు అంచనా పట్టిక తయారు చేసుకొనే విధంగా చూడాలి.
3. బ్యాంకు వారికి అట్టి దరఖాస్తు అవసర మయ్యే నాటికి దానిని కనీసం రెండు లేదా మూడు నెలల ముందు అందజేయాలి.

| | |
|---|---|
| 4 సభ్యులకు బ్యాంకు అధికారులతో సరియైన సత్సంబంధాలు లేకపోవడం వలన | 4 బ్యాంకు వారి సూచనలు/సలహాలు పాటించాలి.<br>**ఉదా:** ఎ) బ్యాంకు వారు 25 వేలకు మించి అప్పును స్వయం సహాయక సంఘానికి మంజూరు చేయవలెనంటే పై అధికారి అనుమతి పొందవలసి రావడం వలన కొంత సమయం పడుతుంది.<br>బి) ఇదివరకు అప్పు తీసుకొని క్రమంగా వాయిదాలు చెల్లిస్తూ చివరి రెండు వాయిదాల కాలపరిమితి ఉండగానే మళ్ళీ డిమాండ్ అసెస్‌మెంట్ చేసి బ్యాంకు వారికి అప్పు దరఖాస్తు చేయగా వారు చివరి వాయిదా అయిపోయే నాటికి కొత్త అప్పు మంజూరు చేయుటకు అవకాశం వుంటుంది. ఆ ప్రకారం ప్రణాళిక చేసుకొనడం ద్వారా అప్పు పొందడం సులభతరమవుతుంది. |

| చేయవలసిన పనులు | చేయకూడని పనులు |
|---|---|
| 1 సంఘం బాగా అభివృద్ధి చెంది ముందుకు వెళ్ళాలంటే ఖచ్చితంగా సంఘానికి కట్టుబాట్లు ఏర్పాటు చేసుకోవాలి. | 1 కట్టుబాట్లను అమలు పర్చుటలో అసమాన భావన చూపకూడదు (బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు అంటూ.... ) |
| 2 ఏర్పాటు చేసుకున్న కట్టుబాట్లను సభ్యులు, నాయకులు అందరూ అమలు పరచాలి. | 2 కట్టుబాట్లు కేవలం సభ్యులకే కాని నాయకురాళ్ళకు కాదు అనే భావన ఉండకూడదు. |
| 3 అవసరమైతే సభ్యులందరి నిర్ణయం మేరకు కట్టుబాట్లలో మార్పులు చేర్పులు చేయాలి. | 3 కట్టుబాట్లను నాయకురాలు, ఒకరో లేదా ఇద్దరో సభ్యులు కలసి ఏర్పాటు చేయకూడదు. |
| 4 కట్టుబాట్లను సంఘ సమావేశాలలో సభ్యులందరి సమక్షంలో అందరి ఆమోదంతో ఏర్పాటు చేసుకోవాలి. | |

| నిర్వహణా పరమైన కట్టుబాట్లు | ఆర్థిక పరమైన కట్టుబాట్లు |
|---|---|
| 1 సభ్యత్వము (అర్హతలు, రద్దు, తొలగింపు తీసుకొనుట) | 1 పొదుపులు |
| 2 సమావేశాలు | 2 అప్పులు<br>1. అప్పు అవసరం<br>2. అప్పు కిస్తులు<br>3. అప్పు పరిమితి |
| 3 హాజరు | 3 సభ్యత్వ రుసుము |
| 4 సంఘంలోనే నిర్ణయాలు తీసుకొనుటకు కావలసిన సభ్యులు | 4 ఇతర రుసుములు |
| 5 నాయకులకు కావలసిన లక్షణాలు, ఎన్నిక, విధానము | 5 వడ్డీలు |
| 6 పుస్తకాల నిర్వహణ | 6 చేతిలో నగదు నిల్వ |
| 7 బ్యాంకు ఖాతా నిర్వహణ | 7 సంఘం ఖర్చులు |
| 8 అంతర్గత, బాహ్య ఆడిట్ | |
| 9 సామాజిక, సాంఘికపరమైన కట్టుబాట్లు | |

## కట్టుబాట్ల అమలులో సభ్యుల, లీడర్ల పాత్ర

| సభ్యుల బాధ్యత | లీడర్ల బాధ్యత |
|---|---|
| 1 లీడర్లకు సహకారం అందించాలి | 1 తాను పాటిస్తూ ఇతరులకు మార్గ దర్శకం కావాలి |
| 2 పోటీ పెట్టుకోరాదు | 2 సక్రమంగా అమలు పరచాలి |
| 3 ఖచ్చితంగా పాటించాలి | 3 సభ్యులందరూ కట్టుబాట్లు పాటించేటట్లు చూడాలి |
| 4 కట్టుబాట్ల ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలి | 4 ఉల్లంఘించిన వారి విషయం చర్చకు పెట్టి వారిపై చర్య తీసుకోవాలి |
| | 5 నిష్పక్షపాతంగా వ్యవహరించాలి |
| | 6 అవసరమయినప్పుడు ఒకసారి గుర్తు చేయాలి |
| | 7 సభ్యులలో పోటీతత్వాన్ని నివారించాలి |

# ఆర్థిక పరమైన కట్టుబాట్లు

**ప్రవేశ రుసుము :**

- క్రొత్తగా చేరేసభ్యులనుండి ప్రవేశ రుసుము మూడు రకములుగా వసూలు చేయవచ్చు.
- సభ్యులు సంఘంలో చేరునప్పుడే వారు చెల్లించవల్సిన రుసుము మొత్తం చెల్లించాలి
- క్రొత్తగా చేరే సభ్యులకు కొంత గడువు ఇచ్చి రుసుము చెల్లించుకోవాలి
- క్రొత్త సభ్యులను కొన్ని వాయిదాలలో రుసుము మొత్తమును చెల్లించమనాలి.
- క్రొత్తగా చేరిన సభ్యులకు అప్పులు సంఘంలో చేరిన ఎన్ని నెలల నుండి ఇవ్వాలనేది సంఘం ముందుగానే నిర్ణయించుకోవాలి. క్రొత్త సభ్యులకు వారు చేరిన మూడో నెలనుంచి చిన్న మొత్తాలలో అప్పు ఇవ్వడం మంచిది.

**మిగిలిన డబ్బు, పెట్టె నిర్వహణ :**

- సంఘంలో సాధ్యమయినంతవరకు డ బ్బుచేతిలో ఉంచుకోక, బ్యాంకుకు పంపాలి
- మిగిలిన డబ్బును సంఘ ప్రతినిధుల వద్ద ఉంచాలి
- పెట్టెనందు పుస్తకాలు, మిగిలిన డబ్బు ఉంచి తాళం వేసి పెట్టె ఒక నాయకురాలి వద్ద, తాళాలు మిగిలిన నాయకురాళ్ళ వద్ద ఉంచవచ్చు

**పొదుపులు :**

- గ్రూపు సభ్యుల శక్తిని బట్టి ఎంత పొదుపు చేసుకోవాలి అని నిర్ణయించుకొనుట, ఎన్ని రకాల పొదుపులు చేసుకోవాలి అని నిర్ణయించుకొనుట
- పొదుపు లావాదేవీలు సమావేశం నందే జరుగుట
- పొదుపులు నిర్ణయించుకున్నవారం లేదా తేదీలలో సక్రమంగా చెల్లించుట
- పొదుపు చెల్లించకపోతే జరిమానా విధించుట
- పొదుపులపై వడ్డీని నిర్ణయించుకొనుట

**అప్పులు :**

- సమావేశాల్లోనే అప్పులు మంజూరు చేయుట
- అప్పులు తీసుకొనుటకు కావలసిన సభ్యత్వ అర్హతలు
- ప్రాధాన్యతను బట్టి అప్పులు
- అప్పు రకాలు మరియు అప్పు మొత్తము
- అప్పు మంజూరు పద్ధతి
- ఇతర రుసుములు ఉదా : కమీషన్ ఫీజ్

**అత్యవసర నిధి :**

- సభ్యులకు ఆపదలో ఉదా : ఆరోగ్యం, అప్పులిచ్చుటకు సంఘం కొంత నిధిని ఉదా : రూ. 500/- అత్యవసర నిధిలో ఉంచుకొని ఇవ్వవచ్చు.

**సంఘం ఖర్చులు :**

- సంఘం ఎలాంటి అవసరాలకు ఎంత ఖర్చు చేయాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. సంఘం ఖర్చులు తక్కువగా ఉంచుకొంటే సంఘంకు ఎక్కువ లాభం వస్తుంది.

# బ్యాంక్ లావాదేవీలు- సమస్యలు

బ్యాంకులోకి వెళ్ళాలంటే భయపడే నేను ,నాలో ఎంత మార్పు వచ్చిందో......

అవెమ్మా! బ్యాంకులోకా? నాకు భయం నేను వెళ్ళ లేను.







బ్యాంకు మేనేజర్ అప్పు ఇస్తానని అన్నారు నాకు చాలా ఆనందంగా ఉంది.



బ్యాంకు మేనేజర్ మనకు అప్పు ఇస్తానని చెప్పారు. రేపు మన వూరు వస్తారు






మీ సంఘం సమావేశాలు,పుస్తకాల నిర్వహణ, సంఘ ప్రగతి నాకు నచ్చింది. అందుకే మీ సంఘానికి అప్పు ఇవ్వాలని నిర్ణయించాను.

## ☆. పొదుపు ఖాతా ప్రారంభించుటలో సమస్యలు - పరిష్కారాలు

| | |
|---|---|
| 1 **సమస్య :** సంఘ సభ్యులకు సర్వీసు ఏరియా బ్రాంచి గురించి అవగాహన లేకపోవుట వలన ఏ బ్రాంచితో లావా దేవీలు చేయాలో తెలియటం లేదు | 1 **పరిష్కారం :** ప్రతి జిల్లాలో నాబార్డు బ్యాంకు అధికారి మరియు లీడ్ బ్యాంక్ మేనేజరు ఉంటారు. వీరి వద్ద సర్వీసు ఏరియా బ్రాంచీల సమాచారము ఉంటుంది. ప్రతి బ్యాంక్ బ్రాంచీలోనూ ఆ సమాచారం బ్రాంచి మేనేజరు దగ్గర ఉంటుంది. మన ఊరికి దగ్గరలో ఉన్న బ్యాంకుకు వెళ్ళి సమాచారం తెలుసుకోవచ్చు |
| 2 **సమస్య :** పొదుపు ఖాతా తెరవటానికి ఎం.డి.ఓ., ఎం.ఆర్.ఓ., డి.ఆర్.డి.ఎ. అధికా రుల పరిచయ సంతకం కావా లంటున్నారు. | 2 **పరిష్కారం :** పరిచయ సంతకం ఎం.డి.ఓ., ఎం.ఆర్.ఓ., డి.ఆర్.డి.ఎ. అధికారులే కాకుండా, ఆ బ్రాంచిలో ఖాతా ఉన్న వారెవరైనా చేయవచ్చు |
| 3 **సమస్య :** ఖాతా తెరవడానికి కనీస మొత్తం (మినిమం డిపాజిట్) అధికంగా ఉండాలంటున్నారు | 3 **పరిష్కారం :** పొదుపు ఖాతా తెరవడానికి బ్యాంక్‌లో కనీస మొత్తం : మామూలు ఖాతాకు రూ.250/-, చెక్ బుక్ ఖాతాకు రూ.500/-లు సరిపోతుంది. |
| 4 **సమస్య :** సంతకాలు రాని గ్రూపులకు ఖాతా ప్రారంభించడానికి ఒప్పుకోవడం లేదు. | 4 **పరిష్కారం :** గ్రూపు లీడర్లు ఎవరైతే ఖాతా లావాదేవీలు చేస్తారో వారికి సంతకాలు వస్తే మంచిది. లేకపోయినా ఖాతా ప్రారంభిస్తారు కాని చెక్ బుక్ ఇవ్వరు. |
| 5 **సమస్య :** సంఘం నాయకురాళ్ళ ఫోటోలతో పాటు అందరి సభ్యుల ఫోటోలు కావాలంటున్నారు. | 5 **పరిష్కారం :** సంఘం నాయకురాళ్ళ ఫోటోలు సరిపోతాయి. మిగతా సభ్యుల ఫోటోలు అక్కర్లేదు. |
| 6 **సమస్య :** వారములో కొన్ని రోజులలోనే ఖాతాలు తెరుస్తున్నారు. | 6 **పరిష్కారం :** బ్యాంకు పని చేయు వేళలలో, సెలవు రోజులు తప్పించి, మిగతా అన్ని రోజులలో ఖాతాలు ప్రారంభిం చవచ్చు. కార్యకర్త బ్యాంకు అధికారులతో ముందుగా సంప్రదించి తర్వాత బ్యాంకు ఖాతా ప్రారంభించడానికి వెళ్ళాలి. |
| 7 **సమస్య :** బ్యాంకులో సంఘం ఖాతాలు ఇప్పటికే ఎక్కువ అయినవి, అందుచేత కొత్తఖాతా ప్రారంభిం చడానికి ఒప్పుకోకపోవడం | 7 **పరిష్కారం :** సర్వీసు ఏరియా బ్రాంచిలో ఉన్న సంఘాలన్నింటికీ ఖాతాలు తెరవాలి. లేకపోతే ఆ అంశాన్ని బ్యాంకుపై అధికారుల దృష్టికి తీసుకుపోవాలి. |
| 8 **సమస్య :** ఖాతా తెరిచిన తరువాత పాస్ బుక్ వెంటనే ఇవ్వకుండా ఇంకొక రోజు రమ్మంటున్నారు. | 8 **పరిష్కారం :** ఖాతా తెరిచిన వెంటనే మన డబ్బు వేసిన తరువాత రసీదు, పాస్ బుక్ వెంటనే ఇవ్వాలి. లేకపోతే బ్రాంచి మేనేజరు దృష్టికి తీసుకుపోవాలి. |
| 9 **సమస్య :** సంఘాన్ని రిజిష్టరు చేయి స్తేనే ఖాతా ప్రారంభి స్తామనడం. | 9 **పరిష్కారం :** 20 మంది కంటే ఎక్కువ సభ్యులు ఉన్న సంఘాలకే రిజిస్ట్రేషన్ అవసరం. నాబార్డు బ్యాంకు జిల్లా అధికారి దృష్టికి తీసుకుపోవాలి. |
| 10 **సమస్య :** సంఘ సభ్యులు బ్యాంకుకు వస్తే వారి మీద బ్యాంకు అధికారులు చిరాకు పడుతున్నారు. | 10 **పరిష్కారం :** సంఘ సభ్యులు ఖాతా లావాదేవీలు జరపవలసినపుడు బ్యాంకుకు వెళ్ళే హక్కు ఉన్నది. బ్యాంకు అధికారులను సమయానుకూలంగా సంఘ సమావేశాలకు ఆహ్వానిస్తే వారికి మనం చేసే కార్యక్రమాల మీద అవగాహన కలిగి సదభిప్రాయము ఏర్పడుతుంది. |

## ☆☆. పొదుపు ఖాతా నిర్వహణలో సమస్యలు

| | |
|---|---|
| 1 **సమస్య :** సంఘాలకు చెక్కుబుక్ ఇవ్వటం లేదు. అందువలన డబ్బు తీసుకున్న ప్రతిసారీ లీడర్లు బ్యాంకుకు వెళ్ళవలసి వస్తున్నది | 1 **పరిష్కారం :** మినిమమ్ డిపాజిట్ రూ.500/- జమచేసి, సంఘ సభ్యులు సంతకం వచ్చిన వారైతే తప్పనిసరిగా చెక్కుబుక్ ఇవ్వాలి |
| 2 **సమస్య :** పొదుపు డబ్బును ఖాతా ప్రారంభించిన 6నెలల వరకు బ్యాంకులోనే ఉంచాలనుకుంటున్నారు | 2 **పరిష్కారం :** పొదుపు ఖాతాలో డబ్బు తీసుకుని సంఘంలో అప్పుగా ఇచ్చుకోవచ్చు. కాని మినిమమ్ డిపాజిట్ బ్యాంకులో ఉంచాలి |
| 3 **సమస్య :** డబ్బు తీసుకోవడానికి ప్రతిసారీ నాయకురాళ్ళనే రావాలనడం | 3 **పరిష్కారం :** చెక్కుబుక్ ఖాతా అయితే సభ్యులెవరైనా కూడా బ్యాంకు నుండి డబ్బు తీసుకోవచ్చు. మామూలు ఖాతా అయితే నాయకురాళ్ళు వెళ్ళాలి |
| 4 **సమస్య :** నాయకురాళ్ళ మార్పును బ్యాంకులో వెంటనే నమోదు చేయటం లేదు | 4 **పరిష్కారం :** నాయకురాళ్ళు మారినప్పుడు, మీటింగ్‌లో తీర్మానం వ్రాసి ఆ కాపీని, క్రొత్త నాయకురాళ్ళ ఫోటోలను బ్యాంకు వారికి అందించి బ్యాంకులో నాయకురాళ్ళ మార్పును నమోదు చేయించాలి |
| 5 **సమస్య :** డబ్బు తీసుకోవాలన్న ప్రతి సంఘంలో తీర్మానం కాపీ కావాలంటున్నారు | 5 **పరిష్కారం :** ఖాతా తెరవడానికి, నాయకురాళ్ళ మార్పు చేసినప్పుడు మాత్రమే తీర్మానము కాపీ బ్యాంకు వారికి అవసరము. మిగిలిన సమయాలలో అక్కర్లేదు |
| 6 **సమస్య :** చెక్కు డ్రాఫ్టులు జమ చేసినప్పుడు ఎక్కువ సమయం తీసుకోవడం, ఎక్కువ కమీషన్ తీసుకోవడం చేస్తున్నారు | 6 **పరిష్కారం :** చెక్కు డ్రాఫ్టులు నియమిత కాలంలో డబ్బు బ్యాంకు వారు మన ఖాతాలో జమ చేయాలి. నిర్ణీత కమీషన్ కంటే ఎక్కువ తీసుకోరాదు. ఆ విధంగా జరుగకపోతే బ్యాంకు అధికారులపై అధికారుల దృష్టికి తీసుకుపోవాలి |
| 7 **సమస్య :** కొంతకాలం ఖాతాలో లావాదేవీలు జరపకపోతే మరలా ఖాతా నిర్వహణ చేసుకోనివ్వటం లేదు | 7 **పరిష్కారం :** బ్యాంకు నియమావళి ప్రకారం ఖాతాలో కనీసం 6 నెలల్లో ఒక్కసారైనా లావాదేవీలు జరపాలి. ఆ విధంగా చేయకపోతే ఆ ఖాతాను నిర్జీవ ఖాతాగా నమోదు చేస్తారు. ఆ తరువాత వెళితే నాయకురాళ్ళు బ్యాంకు వారికి సజాయిషీ అకౌంట్‌లో తిరిగి లావాదేవీలు జరపవచ్చు |

## ☆☆☆. బ్యాంకు నుండి అప్పు పొందడంలో సమస్యలు :

| | |
|---|---|
| 1 **సమస్య :** గ్రూపు ప్రారంభించిన తరువాత 12 నెలల వరకు అప్పు మంజూరు చేయటం లేదు | 1 **పరిష్కారం :** ఒక సంఘం ప్రారంభించిన తరువాత క్రమబద్ధంగా పొదుపులు చేసుకుంటూ, సమావేశాలు జరుపుకుంటూ, పుస్తక నిర్వహణ చేస్తూ, అంతర్గత రుణాలుఇస్తూ, రేటింగ్ సాధనం ప్రకారం 'ఎ' గ్రేడులోఉంటే 6 నెలల తరువాత అప్పు మంజూరు చేస్తారు |
| 2 **సమస్య :** బ్యాంకులో అప్పు సకాలంలో, సరిపడినంత ఇవ్వటం లేదు | 2 **పరిష్కారం :** సంఘానికి అప్పు తీసుకునే అర్హత వచ్చిన తరువాత బ్యాంకువారికి సంఘం గురించి చెప్పి అప్పు మంజూరీ చేయమని కోరాలి. మొదటిసారి సంఘ నిధికి రెండు రెట్లు బ్యాంకు ఋణం ఇస్తారు. రెండవసారి నాలుగు రెట్ల వరకూ ఋణం ఇవ్వవచ్చు |
| 3 **సమస్య :** సంఘ సభ్యులుగా ఎగవేతదారులుగాని, వారి కుటుంబ సభ్యులుగాని ఉంటే ఋణం మంజూరు చేయటం లేదు | 3 **పరిష్కారం :** సంఘ సభ్యులలో ఎక్కువ మంది ఇదివరలో ప్రత్యక్షంగా ఋణం తీసుకుని ఎగవేసి ఉంటే బ్యాంకు ఆ సంఘానికి ఋణం మంజూరు చేయదు. కుటుంబ సభ్యులు సంఘానికి ఋణం ఇవ్వవచ్చు. సంఘ సభ్యులు ఎగవేత దారులైతే వారి కుటుంబ సభ్యుల మీద వత్తిడి తెచ్చి వారి ఋణాలు కట్టించటానికి ప్రయత్నం చేయాలి |
| 4 **సమస్య :** ఋణం మంజూరీకి జామీను కావాలంటున్నారు | 4 **పరిష్కారం :** సంఘానికి ఋణం ఇచ్చినప్పుడు సంఘ సభ్యులందరి బాధ్యత ఉంటుంది కాబట్టి, వేరే జామీను అవసరం లేదు. నాబార్డు బ్యాంకు ఈ విషయంలో బ్యాంకులకు తగిన విధంగా సూచనలిచ్చింది |
| 5 **సమస్య :** బ్యాంకు ఋణం ఉండగా, పొదుపు ఖాతాలో డబ్బు తీసుకోనివ్వడం లేదు | 5 **పరిష్కారం :** బ్యాంకు ఋణం వాయిదాలు క్రమబద్ధంగా కట్టాలి. పొదుపు ఖాతాలో కనీస మొత్తం సొమ్ము ఉంచి మిగతా డబ్బు అంతర్గత ఋణాలకు కూడా వినియోగించవచ్చు |
| 6 **సమస్య :** వాయిదా కంటే ఎక్కువ డబ్బు చెల్లిస్తే తీసుకోవడం లేదు. అనుకున్న కాలానికంటే ముందుగా ఋణం చెల్లిస్తే బ్యాంకు వారు ఒప్పుకోవడం లేదు | 6 **పరిష్కారం :** సంఘం ఋణాన్ని తగినట్టుగా ఉపయోగించుకోవాలి. కొన్ని సంఘాలు ఎక్కువ ఋణం తీసుకోవడం కోసం పాత ఋణం ముందుగా చెల్లిస్తే కొన్ని ఇబ్బందులు వస్తాయి. కాని సంఘ నిధి ఎక్కువగా ఉండి, త్వరగా ఋణం తీర్చేయాలంటే ఏ విధమైన అడ్డంకి ఉండదు |
| 7 **సమస్య :** బ్యాంకు ఋణాన్ని సమంగా పంచుకోమని బ్యాంకు అధికారులు సభ్యులకు సలహా ఇస్తున్నారు | 7 **పరిష్కారం :** బ్యాంకు ఋణం సంఘానికి ఇస్తున్నది. సంఘ సభ్యులు, లీడర్లు కలిసి ఋణం ఏ విధంగా వాడాలన్నదీ వారే నిర్ణయం తీసుకోవచ్చు. అందరూ సమానంగా పంచుకుంటే అప్పు బాగా అవసరమున్న వారికి దొరకదు. అప్పు తిరిగి తీర్చడంలో సహసభ్యుల వత్తిడి ఉండదు |

## బ్యాంకు మార్గదర్శక సూత్రాలు

స్వయం సహాయక సంఘాలకు పొదుపు ఖాతా నిర్వహణ మరియు ఋణ సహాయము చేయుటలో భారతీయ రిజర్వు బ్యాంకు అన్ని బ్యాంకులకు ఇచ్చిన మూల సూత్రములు.

### పొదుపు ఖాతా నిర్వహణ:

1 ఏ స్వయం సహాయక సంఘం అయినా రిజిస్టర్డ్ అయినా కాకపోయినా ఒక బ్యాంకులో పొదుపు ఖాతా తెరవవచ్చును. సర్వీసు ఏరియా బ్రాంచిలో ప్రారంభిస్తే మంచిది. భవిష్యత్తులో ఋణం తీసుకోవడానికి సులభంగా ఉంటుంది

2 ఖాతా తెరవడానికి సమావేశ తీర్మానం కాపీ, ప్రారంభ ఖాతా నమూనా (అకౌంట్ ఓపెనింగ్ ఫాం), గ్రూపు లీడర్ల ఫోటోలు, రూ.250/- (సాధారణ ఖాతాకు) రూ.500/- (చెక్కుబుక్ ఖాతాకు) బ్యాంకులో బ్యాంకు పని చేయు దినము, పని వేళలలో ఇవ్వాలి

3 ఖాతా ప్రారంభించటానికి ఏదేని సంస్థగాని, ఒక వ్యక్తిగాని ఆ బ్యాంకులో ఖాతా ఉంటే అతను, ప్రభుత్వ అధికారులుగాని పరిచయము చేయవచ్చును

4 పొదుపు ఖాతా మీద సంఘానికి సంవత్సరానికి 4% వడ్డీ ఇస్తారు. ఇది 6 నెలలకు ఒకసారి ఖాతాలో జమ చేస్తారు

5 బ్యాంకులో డబ్బు జమ చేయడానికి సంఘ సభ్యులు ఎవరైనా వెళ్ళవచ్చు. డబ్బు తీసుకోవడానికి సాధారణ ఖాతా (చెక్‌బుక్ లేని ఖాతా) అయితే లీడర్లు తప్పనిసరిగా వెళ్ళాలి. చెక్ బుక్ ఖాతా అయితే ఎవరైనా బ్యాంకుకు వెళ్ళవచ్చు

6 పొదుపుఖాతా సంఘం పేరున మాత్రమే ప్రారంభించాలి కాని లీడర్ల పేరున ప్రారంభించకూడదు. లీడర్లు ఖాతా లావాదేవీలు నిర్వహిస్తారు. అందుచేత లీడర్లు మారినపుడు, కొత్త నాయకురాళ్ల ఫోటోలు, సంతకాలు, సమావేశ తీర్మానం కాపీ బ్యాంకుకు ఇవ్వాలి

7. బ్యాంకు ఖాతాలో కనీస మొత్తాన్ని ఉంచి మిగిలిన డబ్బు తీసుకుని అంతర్గత ఋణాలకు వాడవచ్చు.

8 ఖాతా లావాదేవీలు అవసరాన్ని బట్టి చేసుకోవచ్చు. అయితే వరుసగా 6 నెలల వరకు ఖాతా లావాదేవీలు చేయకపోతే అది నిర్జీవ ఖాతాగా ముద్రవేస్తారు. మళ్ళీ లావాదేవీలు చేయాలంటే బ్యాంకు వారికి సంజాయిషీ ఇచ్చుకోవాలి.

### ఋణం ఖాతా నిర్వహణ :

1 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు నుండి ఋణం తీసుకోవడానికి అర్హతలు

ఎ. కనీసం 6 నెలలైనా ముమ్మరంగా పని చేసి వుండాలి.

బి. అంతర్గత ఋణాలు ఇచ్చుకొని ఉండాలి.

సి. పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలి.

డి. రేటింగ్ టూల్ (సి.ఆర్.ఐ) ప్రకారము 'ఎ' గ్రేడ్ వచ్చి ఉండాలి.

2 ఋణం తీసుకునే పద్ధతి:

ఎ. పొదుపు ఖాతా అదే బ్యాంకులో ఉండాలి.

బి. ఋణం తీసుకోవడానికి సంబంధించిన సమావేశ తీర్మానం కాపీ ఇవ్వాలి.

సి. గ్రూపు నుండి ఋణం కావాలని దరఖాస్తు ఇవ్వాలి.

డి. బ్యాంకులో డాక్యుమెంటేషన్ చేయాలి. (ఋణం మంజూరు అయిన తరువాత)

వడ్డీరేటు - అగ్రిమెంట్ - లీడర్లు, సభ్యులు సంతకం చేయాలి.

లోన్ అగ్రిమెంట్ : లీడర్లు మాత్రమే సంతకం చేయాలి.

3 ఋణం పరిమితి

ఎ. మొదటిసారి సంఘనిధి, బ్యాంకు ఋణం 1:2 నిష్పత్తిలో ఇస్తారు.

బి. ఆ తరువాత 1:3 లేక 1:4 నిష్పత్తిలో ఇస్తారు.

సి. వడ్డీరేటు : భారతీయ రిజర్వుబ్యాంకు అన్ని బ్యాంకులకు ఇచ్చే ఆదేశాలను బట్టి ఉంటుంది.

డి. ఋణం తిరిగి కట్టే సమయం 2 నుండి 3 సంవత్సరాల వరకూ ఉంటుంది

ఇ. బ్యాంకు ఋణాన్ని సంఘం ఉత్పాదక అప్పులకు సభ్యులకు ఇవ్వాలి.

4 బ్యాంకు ఋణం కొరకు ఏ విధమైన జామీను ఇవ్వనక్కరలేదు.

5 ఒక సంఘంలో కొంతమంది సభ్యులు గతంలో బ్యాంకు ఋణాలు పొంది ఎగవేత దారులయినా కూడా బ్యాంకు ఋణం సంఘానికి ఇవ్వవచ్చు. కాని ఈ ఋణం నుండి సంఘం ఎగవేత దారులకు అప్పులు ఇవ్వకూడదు. వారిమీద సంఘం ఒత్తిడి తీసుకువచ్చి బకాయిలు చెల్లింపచేయాలి. ఆ తరువాత వారికి కూడా అప్పులు ఇవ్వవచ్చు.

6 బ్యాంకు అధికారులతో సత్సంబంధాలు :

చాలా సంఘాలు బ్యాంకుల నుండి వివిధ రకాల సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ప్రతి సమస్యను రెండు కోణాలలో పరిశీలించవలసి ఉంటుంది. సంఘానికి బ్యాంకు పద్ధతుల మీద అవగాహన లేకపోవడం, లేకపోతే బ్యాంకు అధికారులకు సంఘాల పనితీరుపై మరియు సంఘ ఋణాలు ఇవ్వడానికి రిజర్వుబ్యాంకు ఇచ్చిన సూచనల మీద సరైన అవగాహన లేకపోవడం.

బ్యాంకు అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండడానికి వారిని తరచుగా సంప్రదించడం, వారి వీలునుబట్టి సంఘ సమావేశాలకు ఆహ్వానించటం చేయాలి. వారి సలహాలు తీసుకోవాలి.

బ్యాంకు వారితో అభిప్రాయ భేదాలు వస్తే, వారిపై అధికారులనుగాని, జిల్లాలో ఉన్న నాబార్డు అధికారినిగాని, లీడ్‌బ్యాంక్/మేనేజర్‌ను గాని సంప్రదించాలి.

బ్యాంకువారు దైనందిన కార్యక్రమములలో వివిధ రకాలైన ఒత్తిడులతో, సమస్యలతో పని చేస్తుంటారు. అందుచేత వారిని సరైన రీతిలో అర్థం చేసుకొని యుక్తితో పని చేయించుకోవాలి.

# బ్యాంకులతో అనుసంధానము

సంఘాలుగా ఏర్పడక ముందు బ్యాంకుకు సంబంధించిన సమాచారము తెలియదు.




సంఘ సమావేశంలో క్రొత్త క్రొత్త సమాచారం గురించి చర్చించుకుంటున్న మహిళలు



సంఘ సమావేశాలలో అన్ని విషయాలు తెలుసుకుని, సులభంగా పనిపూర్తి చేసుకొని వస్తున్న సంఘ సభ్యులు




సంఘ సమావేశానికి వచ్చిన బ్యాంకు మేనేజర్ తో చర్చలు చేస్తున్న మహిళలు





బ్యాంకు నుంచి ఆర్థిక ఋణ సహాయం పొంది సంతోష పడుతున్న సంఘ సభ్యులు

# ఇతర సేవలు - సమస్యలు



## సమస్య : 1

## సామాజిక కార్యక్రమాలపై అవసరమైన సమాచారం అందజేయలేకపోవడం....

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సంఘానికి నిర్దిష్టమైన లక్ష్యం లేకపోవుట. సంఘంలోని సభ్యుల అవసరాలు గుర్తించక నామమాత్రంగా పొదుపులు- అప్పుల వరకు మాత్రమే సంఘం పరిమితం కావడం పొదుపు - అప్పుల కంటే వేరే అవసరాలు సభ్యులకు ఉంటాయి అనేది గమనించక సభ్యుల వ్యక్తిగత అభివృద్ధికి స్థానాన్ని కల్పించకపోవుట.<br>❷ ప్రభుత్వ, ప్రభుత్వేతర అభివృద్ధి కార్యక్రమాలైన సమగ్ర వ్యవసాయ అభివృద్ధి వంటి కార్యక్రమాలు సభ్యులకు చేరువలోకి రాకపోవుట, సభ్యులకు అవసరమైన వైద్య సేవలు అందించకపోవటానికి కారణం గ్రామంలో ఉన్న సంఘాలు సంఘటితం కాకుండా ఎవరికివారే యమునాతీరే అన్న విధంగా ఉండటం. | ❶ సంఘం అందించే సేవల గురించి, వాటికి సంబంధించిన సమాచారాన్ని సభ్యులకు అందివ్వాలి. సంఘం రకరకాల పొదుపులు, అప్పులు, సామాజిక సేవలు మొదలగు అన్ని సేవలను అందజేస్తుంది. అవేకాక సమగ్ర వ్యవసాయాభివృద్ధి, ఆరోగ్యము మొదలైన వాటికి సంబంధించిన సేవల గురించి తగిన సమాచారము సభ్యులకు అందజేయవలెను. |

మన సంఘం ద్వారా ఒక రోడ్డు వేశాము, పిల్లలకు పాఠశాల కట్టుకున్నాము, మన సంఘానికి ఒక కమ్యూనిటీ హాలు నిర్మించుకున్నాము. మన సంఘం ద్వారా ఇన్ని చేశామంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది.





## సమస్య : 2

### మార్కెటింగ్ సేవలు సభ్యులకు అందుబాటులో లేకపోవటం

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ రవాణా సౌకర్యాలు లేకపోవడం<br>❷ మార్కెటింగ్ సమాచారం తెలియక పోవడం, సమాచారం తెలిసినా అందుబాటులో లేకపోవడం<br>❸ మార్కెటింగ్ వ్యవస్థపై సభ్యులకు తగిన అవగాహన లేకపోవడం | ❶ మార్కెటింగ్ సేవలు సభ్యులందరికీ అందుబాటులో ఉండేటట్లు చూడాలి<br>❷ మార్కెటింగ్ వ్యవస్థల గురించి సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలి<br>❸ సంఘ సభ్యులు ఉత్పత్తి చేసే వస్తువులకు కావలసిన ముడిసరుకు ఎక్కడ దొరుకుతుంది, తయారు చేసిన తరువాత దానికి తగ్గ మార్కెటింగ్ సౌకర్యాలు ఎక్కడెక్కడ ఉన్నాయి అనే విషయాల గురించి సంఘ సభ్యులకు వివరంగా తెలియపరచాలి |

## సమస్య : 3

### బ్యాంకు వారు కూడా పొదుపులు, రుణాల సౌకర్యం కల్పిస్తున్నారు కదా! మేము బ్యాంకులోనే డబ్బు వేసుకోవచ్చు కదా, ప్రత్యేకమైన సంఘం ఎందుకు ఏర్పాటు చేసుకోవాలి అని సభ్యులు అడగడం సమస్యగా మారింది

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ సంఘంలో అయినా, బ్యాంకులో అయినా పొదుపు, అప్పులే కదా ఇంకా దానికెందుకు సంఘంగా ఏర్పడడం అనే అభిప్రాయం వుండడం<br>❷ సంఘం యొక్క ఉపయోగాలు తెలియక పోవడం<br>❸ సంఘం అందించే సేవల గురించి తెలియక పోవడం | ❶ సంఘంలో అప్పులు, పొదుపు కార్యక్రమాలే కాక సామాజిక కార్యక్రమాలు, చదువు, ఆరోగ్యము, వ్యవసాయము, వాటికి సంబంధించిన కార్యక్రమాలన్నీ జరుగుతాయి<br>❷ సంఘం సభ్యులకు సామాజిక సేవలు, ఆర్థిక సేవలు, సాంఘిక భద్రత, సాంకేతిక సేవలు మొదలగునవన్నింటిని అందిస్తుంది అనే విషయం సభ్యులకు తెలియజెప్పాలి<br>❸ సంఘం అనేది సభ్యుల సమస్యలను చర్చించుకొని పరిష్కరించుటకు ఒక వేదికగా ఉపయోగ పడుతుందని చెప్పాలి |

# వివిధ బీమా రకాలు :

### జీవిత బీమా అంటే

జీవిత బీమా అంటే మరణానికి బీమాచేసిన మొత్తాన్ని నామినీకి చెల్లించడము. ఇందులో మూడు రకాలైన బీమా కవరేజ్‌లు ఉన్నాయి. అవి 1. జీవితము మొత్తానికి 2. పరిమిత కాలము 3. ఎండోమెంట్

### జీవితము మొత్తానికి

జీవిత బీమా అనేది జీవితకాలము రక్షణ కల్పిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో తక్కువ ఆదాయము గల కుటుంబాల వారు ఈ బీమా సేవలను తక్కువగా పొందుతున్నారు.

### టర్మ్ (పరిమిత కాలం)

టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలు కొంత మొత్తానికి, నిర్ణయించబడిన కాలానికి అంటే ఒకటి, రెండు, మూడు లేదా ఇరవై సంవత్సరాలకు బీమా కవరు చేయబడుతుంది

### ఎండోమెంట్

ఎండోమెంట్ జీవిత బీమా పాలసీలో నిర్ణయించబడిన కాలంలో బీమా చేయబడిన వ్యక్తి మరణించినట్లయితే అతను ఎంతయితే బీమా చేయించాడో అంత మొత్తము చెల్లించబడుతుంది

### ఆరోగ్య బీమా అంటే

ఆరోగ్య బీమా అంటే అనారోగ్యం, ప్రమాదాల వలన ఏర్పడిన భౌతిక గాయాలకు బీమా సేవలను అందించడము. ఆరోగ్య కారణాల వల్ల పేదవారు ఋణ గ్రస్తులుగా మారుతున్నారనీ, వాటి కారణంగా తీసుకున్న ఋణాలను చెల్లించలేక పోతున్నారనీ, తద్వారా ఆర్థిక పరంగా ఎదగలేకపోతున్నారనీ మైక్రో ఫైనాన్స్ సంస్థలు గుర్తించాయి. కొన్ని మైక్రోఫైనాన్స్ సంస్థలు ప్రాథమిక దశలోనే ఆరోగ్యబీమా సేవలను అందిస్తుండగా మరికొన్ని సంస్థలు అందుబాటులో ఉన్న వివిధ సంస్థల బీమా సౌకర్యాలను తమ కార్యక్రమాలతో కలుపుకుని అమలు చేస్తున్నారు. ఇందులో వైద్యుని సందర్శనలు, మందుల కొనుగోలు, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలు వ్యాధినిరోధక సేవలు కొన్ని.

### ఆస్తుల బీమా అంటే

ఆస్తుల బీమా అంటే ఆస్తులు కోల్పోవడము లేదా ఆస్తులు దెబ్బతినుట వంటి సంఘటనలు జరిగినట్లయితే వాటికి బీమా సేవలు అందించడమే ఆస్తుల బీమా అంటారు. ఈ సేవలు అందించుటలో చాలా రకాలైన ఇబ్బందులు ఉన్నాయి. ఆ ఆస్తులు నిజంగా కోల్పోయారా? ఆస్తులు నిజంగా అనుకోకుండా దెబ్బతిన్నాయా? అని తెలుసుకోవడము కష్టము. ఈ విషయములో చాలా మైక్రో ఫైనాన్స్ సంస్థలు నిజాయితీ సేవలు అందించేబదులు ఒక గార్డులాగా వ్యవహరిస్తున్నాయి. మన భారత దేశములో సేవా అనే స్వచ్ఛంద సేవా సంస్థ గృహాలు దెబ్బతిన్నా లేక ఉత్పాదక ఆస్తులకు బీమా సేవలను అందిస్తుంది. బంగ్లాదేశ్‌లోని గ్రామీణ బ్యాంకు పశువులు మరణిస్తే యజమానికి బీమా అందిస్తుంది.

### వైకల్యము బీమా అంటే

చాలా వరకు ఈ వైకల్యము బీమా సేవలను ఇతర జీవిత బీమా సంస్థలతో కలిసి పేదలకు అందిస్తున్నారు. ఈ వైకల్యము బీమా సేవలను చాలా తక్కువ మైక్రోఫైనాన్స్ సంస్థలు అందిస్తున్నాయి. ఉగాండాలోని ఫిన్కా మరియు ఫిలిప్పీన్స్‌లోని కార్డ్ వంటి మైక్రోఫైనాన్స్ సంస్థలు ఈ వైకల్యము బీమా సేవలను అందిస్తున్నాయి. ఈ బీమా పాలసీ తీసుకున్న వారికి రక్షణతోపాటు, వారి కుటుంబానికి, తనకు లేదా తన కుటుంబంలో వైకల్యంతో బాధ పడుతున్న వారికి ఈ సేవలు అందించబడతాయి.

### పంటల బీమా అంటే

ప్రకృతి వైపరీత్యాలయిన వరదలు లేదా కరువు వల్ల పంటలు దెబ్బతిన్నట్లయితే వారికి భద్రత కల్పించడానికి అందించే బీమా సేవలే పంటల బీమా అంటారు. 1970 మరియు 1980 మధ్య కాలంలో గ్రామీణ వ్యవసాయ దారులు తీసుకున్న ఋణాలను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని పెంచే ఉద్దేశ్యముతో వ్యవసాయ అభివృద్ధి బ్యాంకులు, ప్రభుత్వాలు పంటల బీమా సేవలను అందించాయి.

### నిరుద్యోగ బీమా అంటే

నిరుద్యోగ భీమా అంటే ఉద్యోగము లేదా స్వయం ఉపాధి లేని వారికి అందించే బీమాను అందించడం. ఈ బీమాను పబ్లిక్ రంగము మాత్రమే అందించగలుగుతుంది, ప్రైవేట్ కంపెనీలు అందించలేవు.

# పుస్తకాల నిర్వహణ - సమస్యలు





## సమస్య : 1

## పుస్తకాలే భారమంటున్న సంఘాలు....

సంఘాలలో అసలు పుస్తకాలే నిర్వహించక పోవుట వలన ఏర్పడే సమస్య

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| 1. సంఘాన్ని ప్రవేటు చేసిన సంస్థలు పుస్తకాలు పెట్టించకపోవడం<br>2. పుస్తకాల ఖర్చులు భరించాలేమో అనే భయంతో పుస్తకాలు పెట్టకపోవడం<br>3. పుస్తకాల ప్రాముఖ్యత గురించి తెలియకపోవడం<br>4. పుస్తకాలు పెట్టినా రాయడానికి ఎవరూ అందుబాటులో లేరు. కనుక ఇంకా పుస్తకాలు ఎందుకు పెట్టడం అని అనుకోవడం<br>5. గ్రూపువాళ్ళు పుస్తకాలు లేకపోయినా బాగా చేసుకొంటారు అనే నమ్మకంతో పుస్తకాలు పెట్టకపోవడం, దీనివలన గ్రూపులలో ఆర్థిక లావాదేవీల గురించి అందరికీ తెలియకపోవడం వలన సమస్యలు వస్తున్నాయి | 1. పుస్తకాలు పెట్టుకుని ఎప్పటికప్పుడు పొదుపులు, అప్పులు అన్ని వివరాలు రాసుకుంటేనే బ్యాంక్ నుండి కాని, ఇతర సంస్థల నుండి గాని ఋణాలు వస్తాయని సభ్యులకు చెప్పాలి<br>2. సంఘంలో వారు చేసుకొనే పొదుపులు, అప్పులు, సమావేశంలో చర్చించే విషయాలు, ప్రతి సమావేశానికి ఎంతమంది వచ్చారు అని హాజరు వేసుకోవడానికి, వారు సమావేశములో తీసుకున్న నిర్ణయాలు రాసుకోవడానికి మొదలైన వాటన్నింటికి ప్రతి సంఘం పుస్తకాలు పెట్టుకుని ఎప్పటికప్పుడు రాసుకుంటేనే తెలుస్తుంది<br>3. పుస్తకాల ప్రాముఖ్యత గురించి, పుస్తకాల వల్ల వచ్చే లాభాల గురించి కార్యకర్తలు తెలుసుకొని సంఘ సభ్యులకు తెలియపరచాలి<br>4. పుస్తకాలు రాయడానికి బుక్ కీపర్ దొరికే వరకు సంఘంలో ఎవరైనా చదువుకున్నవారు వుంటే వారు రాయడం లేదా సంఘంలోని సభ్యులకు చదువుకున్న పిల్లలు ఎవరైనా ఉంటే వారిచేత లేదా కార్యకర్త చేతనైనా రాయించడం<br>5. ఎంత బాగా నడిచే సంఘమైనా పుస్తకాల నిర్వాహణ లేకుంటే సంఘంలో జరిగే ఆర్థిక వివరాలు సక్రమంగా లేకపోవడం వలన సభ్యుల మధ్య గొడవలు వచ్చే అవకాశం వుంది. కనుక ఎంత బాగా నడిచే సంఘం అయినా పుస్తకాలు పెట్టుకోవాలి అని సభ్యులకు తెలియజెప్పాలి<br>6. సంఘ అభివృద్ధికి పుస్తకాలే మూలకారణం అని తెలియజేయాలి |

## కేస్‌స్టడీ :

మిడుత్తూరు మండలంలో చెరుకుచెర్ల గ్రామంలోని మమత గ్రూపు సభ్యులు ఎంత చెప్పినా పుస్తకాలు పెట్టుకోలేదు. ప్రతినెల సభ్యులు చేసుకొన్న పొదుపులు, రూ. 800/-లు, రివాల్వింగ్ ఫండ్ రూ. 25,000/-లు, మొత్తం రూ. 33,000/-లు ఉన్నది. అయితే అది ఎక్కడా సభ్యులు పుస్తకాలలో రాసుకోలేదు. మనకెందుకు పుస్తకాలు, మనకు అన్నీ గుర్తుంటాయి అని పుస్తకాలు పెట్టుకోలేదు, రాసుకోలేదు. అయితే సంఘం లీడరు మొత్తం రూ. 33,000/- నుంచి రూ. 20,000/- వరకు వాడుకుంది. సభ్యులందరూ మీటింగ్ పెట్టుకొని రివాల్వింగ్ ఫండ్ పంచుకొని ఏదయినా కార్యక్రమాలు చేసుకుందాము అనుకొని నాయకురాలిను అడిగితే నాయకురాలు రూ. 13,000/- మాత్రమే వుంది అని చెప్పింది. మిగతా డబ్బు ఏమయింది అంటే, మిగతా అంతా ఖర్చు అయ్యిపోయింది అని చెప్పేసింది. అయితే సభ్యులందరూ దేనికి దేనికి ఖర్చు పెట్టావు అంటే దేనికి పెట్టానో మరచిపోయాను, నాకన్నీ గుర్తులేవు, ఎక్కడయినా రాసివుంటే చూపించేదాన్ని, నేను ఎక్కడా రాయలేదు. రాయడానికి పుస్తకాలు లేవు కదా అని చెప్పింది. దాంతో సభ్యులందరూ గొడవపడి సంఘం వద్దని వెళ్ళిపోయారు. అప్పుడు కార్యకర్త వచ్చి ఇలా సంఘం విడిపోతే ఎలా? ఇప్పటికైనా సభ్యులు, నాయకురాళ్ళు కలిసి చర్చించుకొని పొదుపులు, అప్పులు, వడ్డీ, సంఘు ఖర్చులు గుర్తుతెచ్చుకొని దేనిదేనికి ఎంత ఖర్చు పెట్టాము అనేది రాసుకోండి అని చెప్పగా అప్పుడు సభ్యులందరూ కలిసి నాయకురాలిపై వత్తిడితీసుకొని రాగా ఆమె వచ్చింది. అప్పుడు అందరూ కలిసి అన్ని లెక్కలు రాస్తే మొత్తం ఖర్చులుపోగా 5వేల రూపాయలు నాయకురాలు స్వంత ఖర్చులకు వాడుకుందని తేలింది. అప్పుడు సభ్యులందరూ ఆ డబ్బులను నీవే తిరిగికట్టాలని నాయకురాలిని నిలదీయగా నాయకురాలు అత్యవసరముండి వాడుకున్నాను, కొంచం సమయమిస్తే వాయిదాల ప్రకారం కడతానని అంది. అప్పటినుంచి సంఘంలో పుస్తకాలు పెట్టుకొని బుక్ కీపర్‌ను నియమించుకుని ఎప్పటికప్పుడు లెక్కలు రాసుకుంటున్నారు.

## సమస్య : 2

**శిక్షణ లేని బుక్ కీపర్ వల్ల సంఘానికి కలిగే కష్టాలు**

సంఘంలో పుస్తకాలు వ్రాసేవారు సరియైన శిక్షణ లేకుండా సంఘంలో పుస్తకాలు వ్రాయుట వలన సమస్యలు రావడం జరుగుతుంది.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ బుక్ కీపర్‌ని పెట్టుకుని పుస్తకాలు రాయించేబదులు ఆ పది, ఇరవై కూడా మాకే వస్తాయి అని సంఘు నాయకురాళ్ళే పుస్తకాలు రాయడం.<br>❷ నాయకురాళ్ళు పుస్తకాలు రాయుటలో | ❶ సంఘంలో చదువుకున్న వారు వున్నా పుస్తకాలు రాయడంపై శిక్షణ పొందాలి. శిక్షణ పొందిన తరువాతే పుస్తకాలు రాయాలి<br>❷ సంఘంలో పుస్తకాలు రాయడానికి అనుభవం ఉన్న వ్యక్తిని బుక్ కీపర్‌గా |

నిపుణ్యవైనై వారి విధులు, బాధ్యతలు మరచిపోవుట వారు సంఘ సమావేశాన్ని నిర్వహించవలసి ఉండగా, అది చేయకుండా పుస్తకాలు రాస్తూ వుంటారు.

3 సభ్యుల కుటుంబాలలోని చదువుకున్న బాలికలు ఉన్నా వారికి కూడా పుస్తక నిర్వహణలో తర్ఫీదు ఇచ్చి వినియోగించుకోరు.

4 సంఘ సభ్యులు మేముకూడా చదువుకున్న వారివేకదా, ఇంకా శిక్షణ ఎందుకు అనుకోవడం

5 రాసిన ప్రతీసారి ఒక్కొక్కరు మారుతూ ఉండడం

పెట్టుకోవాలి

3 బుక్ కీపర్‌కు శిక్షణ ఇవ్వాలి. పుస్తకాలు రాసిన వారికి ఎంత పారితోషికం ఇవ్వాలి అనేది సంఘ సభ్యులే నిర్ణయించాలి

4 పుస్తకాలు వ్రాయడంలో శిక్షణ లేకుండా బుక్ కీపర్ వ్రాయకూడదు

5 శిక్షణ తీసుకొనే వరకు పై అధికారుల సలహాలు, సూచనలతో బుక్‌కీపర్ పుస్తకాలు వ్రాయాలి

బుక్ కీపర్‌గా నా బాధ్యతను నేను సక్రమంగా నిర్వహిస్తున్నాను. సంఘ సభ్యులంతా నన్ను ఎంతగానో మెచ్చుకుంటున్నారు. నాకు చాలా ఆనందంగా ఉంది.



## సమస్య : 3

### ఎంతకీ తేలని లెక్కలు - సతమతమవుతున్న సంఘాలు....

బుక్ కీపర్ పుస్తకాలు సమావేశాలలో విధిగా ఎప్పటికప్పుడు రాయకపోవుట, తద్వారా అన్నీ ఒకేసారి గుర్తు పెట్టుకుని రాయడం, దానివల్ల లెక్కలు తేలకపోవడం వలన సమస్య.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| 1 పుస్తకాలు ఉన్నా వాటిని సంఘం సమావేశంలో పూర్తిగా రాయరు. సమావేశం ముగించిన తరువాతో లేక తరువాతి సమావేశంలోనో గుర్తు ఉండిన విషయాల లెక్కలు మాత్రమే రాస్తారు.<br>2 నాయకురాళ్లు లెక్కలు సరిగా | 1 సభ్యులకు పుస్తకాలు, వాటి ప్రాముఖ్యతను గురించి తెలియజెప్పాలి. పుస్తకాలు సంఘంలోనే ఉండాలని, ఎవరైతే సభ్యురాలు ఎప్పుడు అందుబాటులో వుంటుందో ఆమె దగ్గరే పుస్తకాలు వుంచాలని నిర్దిష్టమైన కట్టుబాటును |

అప్పుచెప్పకపోవటం

❸ బుక్ కీపర్ సమావేశంలో జరిగే లావాదేవీలపై శ్రద్ధపెట్టకపోవటం

❹ నెలపొడవునా లావాదేవీలు జరుగుతుండటం, నెల మధ్యలో ఎవరికైనా అప్పు, కావాలన్నా, డబ్బులు లీడర్ల దగ్గర పెట్టుకొని మధ్య మధ్యలో సభ్యులకు ఇస్తుండటం.

❺ సక్రమంగా సమావేశాలు నిర్వహించకుండా పొదుపులు, అప్పులు నిర్వహించడం

❻ పుస్తకాలు రాసే బుక్ కీపరు సమావేశంలో రాయక పోవడం

సంఘంలో ఏర్పాటు చేసుకోవాలి.

❷ పుస్తకాలు రాయడం అనేది కేవలం సమావేశంలోనే జరగాలి. అంతేకాని బయటకాని, ఇళ్ళ దగ్గర కాని రాయకూడదు అనే కట్టుబాటు ఏర్పాటు చేసుకోవాలి.

❸ సమావేశంలో పుస్తకాలు రాయడం పూర్తి చేసిన తరువాత అందరికీ చదివి వినిపించి, సభ్యుల దగ్గర సంతకాలు చేయించాలి. పుస్తకాలు రాయడం పూర్తయ్యే వరకు సభ్యులందరూ సమావేశంలోనే ఉండేటట్లు చూడాలి.

❹ పుస్తకాలు సమావేశంలో రాస్తున్నారా లేదా అనేది కార్యకర్త అప్పుడప్పుడు తనిఖీ చేస్తుండాలి.

❺ సమావేశంలో నాయకురాలు అన్ని లెక్కలు బుక్ కీపర్‌కు చెప్పి రాయించాలి. నెల మధ్యలో ఏ లావాదేవీలు జరగకూడదు అన్ని సమావేశంలోనే జరగాలి.

## కేస్‌స్టడీ :

మహబూబ్‌నగర్ జిల్లాలోని కోసంగి అనే గ్రామంలో స్వయం సహాయక సంఘంలోని సుజాత అనే బుక్‌కీపర్ పుస్తక నిర్వహణ అంతా ఇంటిలో చేసుకొని వచ్చేది. ఎప్పుడూ సమావేశంలో చేసేది కాదు. అయితే కొంతకాలం తరువాత కార్యకర్త ఆ సంఘ సమావేశానికి వచ్చి సంఘం పుస్తకాలు తీసుకుని రండి చూద్దాము అని పుస్తకాలు చూసింది. వారి పొదుపులు, అప్పులు, వడ్డీలు అన్నీ లెక్కచూడగా, కొంత తేడా వచ్చింది. ఆ సంఘంలోని లింగమ్మ అనే సభ్యురాలు ప్రతినెల పొదుపు కడుతోంది. కాని పుస్తకాలలో ఆరు నెలల నుంచి ఆమె పొదుపు కట్టడం లేదని వుంది. ఈ విషయం గురించి సభ్యులందరితో చర్చిస్తే సభ్యులందరు "ఆమె ప్రతినెల కడుతోంది, మేము కూడా చూశాము. మా బుక్ కీపర్ పుస్తకాలన్నీ ఇంటిలో రాస్తుంది. అప్పుడు మరచిపోయిందేమో" అని బుక్ కీపర్‌ని అందరు అడగ్గా ఆమె గుర్తు తెచ్చుకొని, ఇంట్లో రాయడం వలన మరచిపోయాను అని అప్పుడు రాసింది. అప్పటి నుంచి పుస్తకాలు సమావేశంలోనే రాయాలని గట్టిగా ఆ సంఘ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు పుస్తకాలన్నీ సమావేశంలోనే ఎప్పటికప్పుడు రాస్తున్నారు.

## సమస్య : 4

### పుస్తకాలలో తగిన సమాచారం లేక సతమతమవుతున్న సంఘాలు....

కొన్ని సంఘాలలో పుస్తకాలు ఉన్నా అందులో తగిన సమాచారం లేకపోవుట – ఉండవలసిన పుస్తకాలు లేకపోవుట వలన సమస్య.

# పుస్తక నిర్వహణలో సమస్యలు

## కారణాలు

1. పుస్తకాలున్నప్పటికీ అవసరమైన పుస్తకాలు లేకపోవటం, తీర్మానాల పుస్తకం ఒకటి మాత్రమే వుండటం, అన్నీ ఒకే పుస్తకంలో రాసుకుంటే సరిపోతుంది, ఒక్కొక్క దానికి ఒక పుస్తకం ఎందుకులే అని, అన్నీ కలిపి ఒకే పుస్తకంలో రాయడం జరుగుతుంది.
2. అంతేకాక ఆ ఒక్క పుస్తకంలో కూడా కొన్ని రాయడం, కొన్ని రాయక పోవడం, ముఖ్యమైన సమాచారం రాయకపోవడం జరుగుతుంది. దానివల్ల సంఘంలో సభ్యులకు అర్థం కాకుండా పోతుంది. వివరంగా ఉండకపోవడం వల్ల గొడవలు రావడం, దానితో గ్రూపులు ఆగిపోవడం జరుగుతుంది.
3. పుస్తకాలు ఎలా రాయాలో తెలియక పోవడం
4. తరువాత రాయవచ్చులే అని అశ్రద్ధ చేయడం/ మర్చిపోవడం
5. పూర్తికాలం పుస్తకాలు రాసేవారు లేకపోవడం వలన, తెలియని వారితో రాయించడం వలన సరిగా రాయలేకపోవడం

## పరిష్కారం

1. సంఘంలో సమావేశాల వివరాలు రాయడానికీ, తీర్మానాల పుస్తకం, సంఘంలో వచ్చిన వారి హాజర్లు తీసుకొనడానికీ హాజరు పుస్తకం, పొదుపు, అప్పులు, జమలు రాయడానికి నగదు రిజిస్టరు, వ్యక్తిగత ఖాతా పుస్తకం, సాధారణ లెడ్జర్ వంటి పుస్తకాలు ఉంటాయి.
2. ఈ విధంగా ఒక్కొక్క దానికి ఒక్కొక్క పుస్తకం పెట్టుకొని, బుక్ కీపర్‌ని పెట్టుకొని ఎప్పటికప్పుడు సమావేశంలోనే పుస్తకాలు వివరంగా రాసుకొని అందరికీ చదివి వినిపించి సంతకాలు చేయించడం వలన సభ్యులమధ్య అభిప్రాయ బేధాలు రావడానికి అవకాశం ఉండదు అని సభ్యులతో చర్చలు చేయాలి.
3. సభ్యులకు గ్రూపు ఏర్పాటు చేసేటప్పుడు పై విధంగా కార్యకర్త చెప్పాలి. గ్రూపు ఏర్పాటైనచోట ఈ సమస్య ఉంటే సభ్యులందరినీ కూర్చోబెట్టి పుస్తకాల ఆవశ్యకత సభ్యులకు తెలియజేసి ఇప్పటినుంచి అయినా పుస్తకాలు పెట్టమని చెప్పాలి.
4. సభ్యులందరికీ సంబంధించి ఎవరెవరు ఎంతెంత పొదుపు కడుతున్నారు, అప్పులేమైనా ఉన్నాయా మొ॥ వివరాలన్నీ పుస్తకాలలో రాసుకోవాలి. దానికి కావలసిన సమాచారాన్ని సభ్యులద్వారా, సంఘ నాయకుల ద్వారా, సంఘాన్ని చూసుకునే కార్యకర్తల ద్వారా సేకరించాలి. అలా కనీసం ఇప్పటినుంచైనా బుక్ కీపర్‌ను పెట్టుకుని విధిగా పుస్తకాలను రాస్తూ, నిర్వహిస్తూ ఉంటే పై సమస్యలు పునరావృతం కావని సభ్యులకు తెలియచెప్పాలి.

## సమస్య : 5

# సంఘంలో ఎప్పటికప్పుడు లెక్కల నాణ్యత తనిఖీ (ఆడిట్) చేయకపోవడం సమస్య

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ పుస్తకాల నాణ్యత ప్రామాణికంగా ఉందా? లేదా, అన్ని పూర్తి చేయబడ్డాయా, బ్యాంకులో నిల్వలు, చేతిలో నిల్వలు ఎంత ఉంటున్నాయి వంటి విషయాలను సరిచూసుకోవడానికి కార్యకర్త ప్రతినెలా తనకు నిర్దేశించబడిన సంఘాలను సందర్శించి సంస్థకు నివేదికను ఇవ్వాలి. ఇలా జరగకపోవుట వలన సమస్యలు వస్తాయి. | ❶ సంఘంలో లెక్కలన్నీ అంటే బ్యాంకు నిల్వలు, చేతిలో నిల్వలు, పొదుపులు, అప్పులు వంటి విషయాలను బుక్ కీపర్ సరిచూసుకోవాలి |
| ❷ పై స్థాయి కార్యకర్తలు సరియైన మార్గదర్శకాలను ఇవ్వకపోవటం. | ❷ ప్రతి నెల అన్ని సంఘాలతో సరిచూసుకోవాలి |
| ❸ సంఘ సందర్శన ప్రణాళికను తయారు చేసుకోకపోవటం | ❸ సంఘం వారు కూడ సరిచూసుకోవాలి |
| ❹ సంఘ సమావేశాల సమయానికి ఫెసిలిటేటర్ గ్రామంలో లేకపోవటం, వెళ్ళకపోవటం | ❹ సంవత్సరానికి ఒకసారి గుర్తింపు పొందిన సంస్థకు చెందిన వ్యక్తులతో సంఘం లెక్కలను ఆడిట్ చేయించాలి |
| ❺ ఆడిట్ చేయించాలని సభ్యులకు తెలియక పోవడం | ❺ సంఘం బుక్ కీపర్‌తో ప్రతీ మూడు నెలలకొకసారి, ఆరు నెలలకొకసారి అంతర్గత లెక్కల తనిఖీ చేయించాలి |
| ❻ ప్రోత్సాహక సంస్థ నుండి సరియైన సలహాలు, సూచనలు రాకపోవడం మరియు తప్పనిసరిగా ఆడిట్ చేయించాలని చెప్పకపోవడం | |

లెక్కల తనిఖీ వల్ల మనం చేసిన తప్పులు గుర్తించాము చూశారా?



## సమస్య : 6

### అంతర్గత లెక్కల తనిఖీ (ఇంటర్నల్ ఆడిట్) చేసేటప్పుడు సరియైన సమాచారం పుస్తకాల నుండి దొరకకపోవుట వలన సమస్య

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ అంతర్గత తనిఖీ గురించి సభ్యులకు అవగాహన కల్పించకపోవడం<br>❷ స్వయం సహాయక సంఘాల బుక్ కీపర్ అందుబాటులో ఉండకపోవడం<br>❸ సంఘంలోని పుస్తకాలు సరిగా రాసుకోకపోవడం<br>❹ నెలనెలా కాకుండా రెండు మూడు నెలలకొకసారి పుస్తకాలు రాయడం<br>❺ ఇంటిదగ్గర పుస్తకాలు రాసేటప్పుడు నాయకురాలికి గుర్తున్నవే చెప్పి రాయించడం<br>❻ అంతర్గత లెక్కల తనిఖీ చేసేటప్పుడు పుస్తకాలు రాసే వ్యక్తి అందుబాటులో లేకపోవడం<br>❼ అన్ని లావాదేవీలు ఒక్క తీర్మానాల పుస్తకంలో మాత్రమే రాయడం | ❶ అంతర్గత తనిఖీ గురించి సభ్యులకు సరియైన అవగాహన కల్పించాలి.<br>❷ అంతర్గత తనిఖీ ఎన్ని రోజులకొక్కసారి చేయించాలి అనేది (మూడు నెలలకొక్కసారి, ఆరు నెలలకొక్కసారి, సంవత్సరమునకు ఒక్కసారి ఇలా.....) సంఘం, సభ్యులందరూ నిర్ణయించుకోవాలి.<br>❸ అనుకున్న సమయం ప్రకారం అంతర్గత తనిఖీ చేయించేటప్ప టికీ దానికి తగ్గ సమాచారం అంతా సిద్దంగా ఉంచుకోవాలి. (పుస్తకాలన్నీ పూర్తిగా రాసుండాలి, లెక్కలకు సం బంధించిన సమాచారం అంతా సంఘంలో ఉండాలి)<br>❹ అంతర్గత తనిఖీ చేయించేటప్పుడు బుక్ కీపర్ సంఘానికి సంబంధించి ఆర్థికపరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి. ఆ సమయంలో బుక్ కీపర్ కూడా ఉండాలి. |

## సమస్య : 7

### పుస్తకాల దిద్దుబాట్లు - సంఘానికి వచ్చిన పాట్లు....

పుస్తకాలు నెల మధ్యలో ఎప్పుడుబడితే అప్పుడు లీడర్లు, ఇతర సభ్యులు దిద్దుబాట్లు చేయడం వలన సమస్యలు రావడం.

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ మగవారితో మహా బెడద. కొన్ని సంఘాలలో సభ్యుల భర్తలు మహిళా సంఘాలు అంటే | ❶ సంఘానికి సంబంధించిన పుస్తకాలన్ని, సంఘంలోవారు, సంఘం పెట్టుకొనే |

అసలు ఇష్టపడకపోతే, వంరికొన్ని సంఘాలలో మహిళల భర్తలు సమావేశం తేదీకి దాక్కుని కూర్చుంటారు. తగుదునమ్మా అని సంఘం సమావేశంలో అనవసరపు జోక్యం చేసుకోవడం, పుస్తకాలలో చేతులుపెట్టి తెలిసీ తెలియంది అసంపూర్తిగా రాస్తుంటారు.

2 శిక్షణ లేనివారితో పుస్తకాలు రాయించడం

3 పొదుపులు, అప్పులు ఎప్పుడు పడితే అప్పుడు చెల్లించడం

4 సమావేశంలో రాసిన పుస్తకాలు ఇంటి దగ్గరికెళ్లి మార్చి వ్రాయడం

5 ఒకసారి పుస్తకాలు వ్రాసిన తర్వాత మర్చిపోయిన వాటిని గుర్తుతెచ్చుకొని తిరిగి రాసిన దానిని దిద్దుబాట్లు చేయడం

ఆఫీసులోగాని, కమ్యూనిటీ హాలులోగాని, పంచాయతీ ఆఫీసులోగాని ఉంచాలి.

2 సంఘం పుస్తకాలను బుక్ కీపర్ మాత్రమే సంఘం సమావేశాలలో రాయాలి. మార్పులు, చేర్పులు వున్నా సమావేశాలలోనే చేయించవలయును.

3 సంఘంలో లేని, సంఘానికి సంబంధం లేని ఇతర వ్యక్తులు ఎవ్వరూ పుస్తకాలు వ్రాయకూడదు.

4 ఆర్థిక లావాదేవీల విషయంలో మగవారుగాని, బయట వ్యక్తులుగాని జోక్యం చేసుకోకూడదు.

5 బుక్ కీపర్ తప్పకుండా పుస్తకాలు వ్రాయడంలో శిక్షణ తీసుకోవలెను.

## కేస్‌స్టడీ :

మిడ్తూరు మండలంలోని కలమందపాడు గ్రామంలో శ్రీలక్ష్మి గ్రూపులో పుస్తకాలను లీడరు లక్ష్మమ్మ తన ఇంట్లో పెట్టుకునేది. ఒకసారి కార్యకర్త వచ్చి పుస్తకాలన్నీ చూసింది. చూస్తే, పుస్తకాలలో అన్నీ దిద్దుబాట్లు, కొట్టివేతలు ఎక్కువగా వున్నాయి. సభ్యులేమో తమకేమీ తెలియదన్నారు. గ్రూపులోని లక్ష్మమ్మ తను కట్టవలసిన అప్పు, నెలనెలా క్రమంగా కడుతోంది కాని పుస్తకాలలో 2 నెలల పొదుపు కట్టలేదు అని రాసి వుంది. దాని గురించి లక్ష్మమ్మను అడిగితే నేను కట్టాను అంది. లీడరును అడిగితే లీడరు ఇంటికెళ్ళిన తరువాత నా భర్తతో పుస్తకాలను రాయిస్తాను అందుకని మా భర్తను అడిగి చెపుతాను అంది. అప్పుడు సభ్యులందరూ నువ్వు ఇంటికిపోయి నీ భర్తతో రాయించడం వలనే ఈ సమస్య వచ్చింది. ఇప్పటి నుంచి సమావేశంలోనే పుస్తకాలు రాయాలి, ఇంట్లో రాయకూడదు అని కట్టుబాటు పెట్టుకున్నారు. ఇంకా పుస్తకాలు కూడా ఎవ్వరి ఇంట్లోనో కాకుండా ఒక పెట్టె తెచ్చుకొని అందులో పెట్టి తాళం వేసి అందరికీ అనుకూలమైనచోట పెట్టుకొందాము అని నిర్ణయం తీసుకున్నారు. మరియు పుస్తకాలు రాయడానికి బుక్‌కీపర్‌ను పెట్టుకొని అతనితో సమావేశాలలోనే పుస్తకాలు రాయించుకోవాలి అని నిర్ణయం తీసుకున్నారు.

## సమస్య : 8

### ఎంతకీ చేతి నిల్వ చెప్పని నాయకురాలు....

నాయకురాలు చేతిలోని నిల్వలను ఎకౌంటు రాసేటప్పుడు సరిగా చెప్పకపోవటం సమస్య

| కారణాలు | పరిష్కారం |
| --- | --- |
| ❶ చేతిలో నిల్వలను స్వంత ఖర్చులకు వాడటం.<br>❷ వాడిన డబ్బు ఎంతో కూడా గుర్తు పెట్టుకోకపోవటం<br>❸ ఎప్పటికప్పుడు జమా ఖర్చులు మరియు నిల్వలు పుస్తకాలలో రాయకపోవడం<br>❹ ఆర్థిక లావాదేవీలను నాయకురాలే సొంతంగా నిర్వహించడం | ❶ బుక్ కీపర్ సమావేశంలో లెక్కలు రాసేటప్పుడు లీడరు చేతిలో నిల్వ ఎంత వున్నాయి, బ్యాంకు ఖాతాలో ఎంత వున్నాయి, ఈ వివరాలన్నీ వివరంగా కనుగొని పుస్తకాలలో రాసి సంఘ సభ్యులందరికీ వివరంగా చెప్పాలి<br>❷ నాయకురాలు చేతిలో నిల్వలను స్వంత ఖర్చులకు వాడుకోకూడదు. అదేవిధంగా, చేతిలో ఎక్కువ నిల్వ ఉంచుకోకూడదు<br>❸ నాయకురాలు ఖర్చు పెట్టిన డబ్బులు ఎప్పుడెప్పుడు ఖర్చు పెట్టినది, గుర్తు పెట్టుకొని చెప్పాలి. ఒకవేళ గుర్తుంటే ఎప్పటికప్పుడు ఎవరితోనైనా పేపరుమీద రాసుకుని వాటిని సమావేశంరోజు బుక్ కీపర్‌తో పుస్తకాలలో రాయించాలి |

## సమస్య : 9

### సంఘాలలో పుస్తకాలను తరచూ మార్పులు చేర్పులు చేయుట వలన సమస్య

| కారణాలు | పరిష్కారం |
| --- | --- |
| ❶ సంఘాలను ప్రమోట్ చేస్తున్న రకరకాల సంస్థలు, అంటే డి.ఆర్.డి.ఎ.వారు తమ పుస్తకాలుండాలనీ, స్వచ్ఛంద సంస్థలు తమ పుస్తకాలుండాలనీ, బ్యాంకు వారు తమకు | ❶ ఒక్కసారి తయారైన పుస్తకాలు కనీసం 1 సంవత్సరం లేదా 2 సంవత్సరాల వరకు ఎటువంటి మార్పులు, చేర్పులు లేకుండా కంటిన్యూ చేయాలి |

నచ్చిన పుస్తకాలు పెట్టాలనీ అలా రకరకాలుగా మార్పులు చేర్పులు చేయటం జరుగుతోంది

2 ఈ విధంగా మార్పులు జరగడం వలన సంఘంలో పుస్తకాలు రాసేవారు మరియు సభ్యులు కూడా విసుగు చెంది, ఇన్నిసార్లు మార్చాలంటే కష్టం, అసలు ఈ పుస్తకాలే మాకొద్దు, మేము రాయలేము అని పుస్తక నిర్వహణ సక్రమంగా చేయకపోవడం వలన గ్రూపులో సమస్యలు వస్తాయి

2 సంఘాలను ప్రమోట్ చేసేవారు మన సంఘాలకు ఎటువంటి పుస్తకాలు పెడితే అన్ని విధాలుగా అనుకూలంగా వుంటుందోనని ఆలోచించి పెట్టాలి

3 ఒకసారి పెట్టిన పుస్తకాలను కనీసం సంవత్సరం ఆడిట్ అయ్యేవరకు మార్చకూడదు అని నిర్ణయం తీసుకోవాలి

4 సంఘాలు ఏర్పాటు చేసేవారు డి.ఆర్.డి.ఎ. వారు బ్యాంకు వారు మిగతా ఎన్.జి.ఓ.లు కలిసి చర్చించి ఒకే రకమైన (కామన్‌గా వుండే) పుస్తకాలను పెట్టాలి

5 పుస్తకాలు మార్చినప్పుడు, సంఘ సభ్యులకీ, పుస్తక నిర్వాహకులకూ శిక్షణలు ఇప్పించడం

## కేస్‌స్టడీ :

మిడ్తూరు మండలంలో కలమందపాడు గ్రామంలో కావేరి అనే గ్రూపులోని సభ్యులందరూ డబ్బులు వేసుకొని సంఘానికి కావల్సిన పుస్తకాలు తెచ్చుకొన్నారు. తెచ్చుకొన్న 3, 4 నెలలకంతా కార్యకర్త వచ్చి మన పుస్తకాలు అన్ని మార్చాలి, కొత్త పుస్తకాలు తెచ్చుకోవాలి, ఎందుకంటే పుస్తకాలు మారినాయి అని చెప్పింది. సంఘ సభ్యులందరూ 4 నెలల క్రితమే 300 రూపాయలు పెట్టి పుస్తకాలు అన్ని తెచ్చుకున్నాము కదా! ఇప్పుడు అవి కాదు మారినాయి, కొత్తవి అంటే మరలా డబ్బులుపెట్టి తెచ్చుకోవడం మా వల్ల కాదు అన్నారు. కార్యకర్త అందరికీ నచ్చచెప్పి పుస్తకాలు మార్చటానికి ఒప్పించింది. బుక్ కీపర్ ఈ పుస్తకాలలో వున్న సమాచారం అంతా కొత్త పుస్తకాలలో రాసేటప్పుడు కొన్ని లోటుపాట్లు వచ్చాయి. కొన్ని రాయడం మర్చిపోయాడు, కొన్ని ఒకదానికి ఒకటి రాయడం జరిగింది. దీనివల్ల లెక్కలు సక్రమంగా రాలేదు. దీనివల్ల సంఘంలో గొడవలు వచ్చాయి. అప్పుడు సభ్యులందరితో కార్యకర్త కూర్చొని బుక్ కీపర్ చేసిన లెక్కలను అన్నీ చూసి, సభ్యులను అడిగి సవివరంగా తెలుసుకొని పాత పుస్తకాలలో రాసినవి అన్నీ చూసి వివరంగా కొత్త పుస్తకాలలో రాసుకొని సభ్యులందరికీ చెప్పడం జరిగింది. అప్పటినుంచి సభ్యులందరు కలిసి మన సంఘంలో సంవత్సరం వరకు పుస్తకాలు మార్చకూడదు, పుస్తకాలు తరచూ మార్చడం వలన సమస్యలొస్తున్నాయి, కనుక మొదటే ఆలోచించి గ్రూపుకు అన్ని విధాలా ఏ పుస్తకాలు పెడితే బాగుంటుందో చర్చించి పెట్టుకోవాలి అని గట్టి నిర్ణయం తీసుకొన్నారు.

## పుస్తక నిర్వహణలో చేయవలసిన, చేయకూడని పనులు

### చేయవలసిన పనులు

1 ప్రతీ సంఘంలో ఖచ్చితంగా పుస్తకాలు పెట్టుకోవాలి. పెట్టుకున్న పుస్తకాలు రాసుకోవాలి.

2 లెక్కలు తప్పకుండా ఆడిట్ చేయించాలి.

3 పుస్తకాలు రాసే విధానంపై శిక్షణ తీసుకోవాలి.

4 సంఘంలో పెట్టుకున్న పుస్తకాల గురించి ప్రతీ సభ్యురాలికి తెలియాలి.

5 పుస్తకాలను ఎవరి ఇంట్లోనూ (ఉదా : బుక్ కీపర్) ఉంచకూడదు. ఒకవేళ వేరే దారి లేక ఉంచాల్సిన అవసరం వస్తే పుస్తకాలన్నీ పెట్టెలోపెట్టి తాళం వేసి ఉంచాలి. నాయకురాలి ఇంట్లో ఉంచొచ్చు.

6 పుస్తకాలు సమావేశంలోనే రాయాలి. మరియు అందరికీ చదివి వినిపించి అందరితో సంతకాలు చేయించాలి. మధ్య మధ్యలో పుస్తకాలను లీడర్లుకాని, ఇతర సభ్యులు కాని దిద్దుబాట్లు చేయకూడదు.

7 సంఘం డబ్బులను నాయకురాలు కాని, సభ్యులుకాని చేతిలో నిల్వ ఉంచుకోకూడదు. ఎప్పటి కప్పుడు బ్యాంకులో జమ చేయాలి.

### చేయకూడని పనులు

1 పుస్తకాలు బుక్ కీపర్‌కాని, నాయకురాలుకాని సమావేశంలో తప్ప బయట ఎక్కడా రాయకూడదు, దిద్దుబాట్లు చేయకూడదు.

2 బుక్‌కీపర్‌కాని, కార్యకర్తలు కాని సభ్యులు చెప్పింది పుస్తకాలలో రాయడం వరకే చేయాలి, సంఘ నిధి విషయంలో, అప్పులిచ్చే విషయంలో మొదలైన వాటిలో నిర్ణయాలు తీసుకోకూడదు.

3 సంఘానికి సంబంధించిన పుస్తకాలు సంఘ సభ్యుల దగ్గర కాకుండా బయటి వ్యక్తుల దగ్గర పెట్టకూడదు.

4 సంఘంలో సంబంధం లేని వ్యక్తులకు పుస్తకాలు ఇవ్వకూడదు

# పుస్తక నిర్వహణ

స్వయం సహాయక సంఘాలలో
నిర్వహించవలసిన పుస్తకాలు

1. వ్యక్తిగత పాస్ పుస్తకము
2. మీటింగ్ మినిట్స్ పుస్తకము
3. అప్పు లెడ్జరు
4. సాధారణ లెడ్జరు
5. లావాదేవీల పుస్తకము
6. బ్యాంకు పాస్ పుస్తకము

**1. వ్యక్తిగత పాస్ పుస్తకము :**

ఇందులో సభ్యురాలి పొదుపు, తీసుకున్న అప్పు, చెల్లించిన అప్పు, వడ్డీ, అప్పు నిల్వలు వ్రాయాలి. దీనిని సభ్యురాలి వద్దే ఉంచుకొని సమావేశానికి వచ్చేటప్పుడు తీసుకొని రావాలి.

2. మినిట్స్ పుస్తకము :

సంఘమునకు అతి ముఖ్యమైనది మీటింగ్ మినిట్స్ పుస్తకము. ఇందులో సమావేశములో సభ్యులు చర్చించిన విషయములు, తీసుకున్న నిర్ణయాలు మరియు కట్టుబాట్లు వ్రాయాలి.

**3. అప్పు లెడ్జరు :**

ఇందులో వ్యక్తిగత అప్పు వివరాలు వ్రాయాలి. దీని వలన ప్రతి ఒక్క సభ్యురాలు తీసుకున్న అప్పు తెలుస్తుంది. ఏ అవసరానికి తీసుకున్నారు, ఎంత తీసుకున్నారు, తిరిగి చెల్లించిన విధానము, వాయిదాలు, వడ్డీ శాతం, చెల్లించిన మొత్తము మరియు అప్పు నిల్వ, మొండి బకాయిలు తెలుస్తాయి.

**4. సాధారణ లెడ్జరు :**

ఇందులో సంఘంలోని వివిధ పద్దుల వివరాలను తెలుపవలెను, హాజరు మరియు సభ్యులు చేసిన పొదుపు వివరాలు వ్రాయాలి. దీనివలన ఒక్కొక్క సభ్యురాలి వారం లేదా నెల పొదుపు, మొత్తం పొదుపు, ఒక్కొక్కరికి పొదుపై చెల్లించిన వడ్డీ, సభ్యులందరి పొదుపు తెలుస్తుంది. ఇంకా ఇతర సంస్థలు ఉదా॥ బ్యాంకు, సమాఖ్యలతో సంఘం జరిపే లావాదేవీలనుకూడా ఇందులో వ్రాయాలి. ఒక్కొక్క సంస్థకు కొన్ని పేజీలు కేటాయించి అందులో ఆ సంస్థకు సంబంధించిన లావాదేవీలను వ్రాయవలెను. సంఘానికి అయిన ఇతర ఖర్చులు, వచ్చిన ఇతర ఆదాయాలు ఇందులో వ్రాయాలి. ఇతర సంస్థలతో లావాదేవీలు వ్రాయడం వలన సంఘం తీసుకున్న అప్పు మొత్తము, తేది, వడ్డీ రేటు, అప్పు చెల్లింపు విధానము, చెల్లించిన అప్పు, అసలు, వడ్డీ, జరిమానాలు, అప్పు బకాయిలు, అప్పు నిల్వ తెలుస్తాయి.

**5. లావాదేవీల పుస్తకము :**

ఇందులో సమావేశంలో జరిగిన లావాదేవీలు అంటే సమావేశంలో ఎవరెవరు ఎంత పొదుపు, అప్పు చెల్లింపులు, జరిమానాలు కట్టారో వ్రాయాలి. దీని వలన సభ్యుల స్థాయి తెలుస్తుంది. సమావేశంలో జరిగిన ఇతర వసూళ్ళు, ఖర్చులు, బ్యాంకు, సమాఖ్యకు కట్టినది వ్రాయాలి. సమావేశంలో జరిగిన మొత్తం జమలు, చెల్లింపులు వ్రాయాలి. దీనివలన సంఘం స్థాయి మరియు పుట్టుకనుండి ఇప్పటివరకు జరిగిన జమలు, చెల్లింపులు, వచ్చిన ఆదాయము, జరిగిన ఖర్చులు మొత్తం సంఘ నిధి తెలుస్తుంది.

**6. బ్యాంకు పాస్ పుస్తకము :**

బ్యాంకులో జమ చేసినప్పుడు, తీసినప్పుడు తప్పనిసరిగా బ్యాంకు పాస్‌పుస్తకములో, బ్యాంకు అధికారులతో వ్రాయించుకోవాలి. దీనిని జాగ్రత్తగా దాయాలి. బ్యాంకు పాస్‌బుక్ ద్వారా సంఘ నిల్వ బ్యాంకులో ఎంత మిగిలి ఉన్నదో తెలుస్తుంది. బ్యాంకు అప్పు పాస్‌బుక్‌నుండి అప్పు తీసుకున్న తేది, అప్పు మొత్తము, చెల్లించిన అప్పు, అసలు, వడ్డీ, అప్పు నిల్వ తెలుస్తాయి.

# సుస్థిరత - సమస్యలు

ఇక నుంచి మీ సంఘాన్ని మీరే నడుపుకోవాలి



మీ సంఘ ప్రణాళికలు మీరే చేసుకోవాలి



వ్యాపార కార్యక్రమాలు చేపట్టాలి



మీ సంఘ లెక్కలను మీరే నిర్వహించుకోవాలి



సంఘ కార్యక్రమాల ద్వారా మీ పేదరికాన్ని రూపుమాపి, మహిళా సాధికారత సాధించండి.



## సమస్య : 1

## సంఘాలకు లక్ష్యాలు, ప్రణాళికలు లేకపోవుట

### కారణాలు

1. క్రమమైన పొదుపులు, అప్పులు వంటివి జరుగుట లేదు. ప్రభుత్వ సహాయం కోసమే చూస్తున్నారు. సభ్యులు అయోమయంలో ఉంటున్నారు. గ్యాస్‌లు, సబ్సిడీల కోసం సంఘాలు ఏర్పడటం, అవగాహన లోపం, రాజకీయ పార్టీలు మొ॥ వాటివల్ల సంఘాలకు లక్ష్యాలు, ప్రణాళికలు లేకుండా పోతున్నాయి.
2. మట్లపాలెం గ్రామంలో 5 సంఘాలు ఒకేసారి ఏర్పడ్డాయి. వారు ప్రభుత్వం నుండి గ్యాస్ పొయ్యిలను సబ్సిడీలలో పొందాలని ఏర్పాటు చేసుకున్నారు. అవి ఇంతవరకు రాలేదు. ఇప్పుడు వారు ప్రభుత్వం నుండి అప్పు కావాలని, గ్యాస్ కావాలని ఎదురు చూస్తున్నారు.

### పరిష్కారం

1. సంఘం పెట్టుకొన్నప్పుడు సంఘానికి లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి, అంటే సంఘం దేనికోసం పెట్టుకున్నాము, సంఘం పెట్టుకొని ఏమి సాధిస్తాం అనే లక్ష్యాలను ప్రతి సంఘం ఏర్పాటు చేసుకోవాలి.
2. లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యాలను సాధించే దిశలో ప్రతి సంఘం ప్రయత్నాలు చేస్తూ ప్రయాణించాలి. అప్పుడే సుస్థిరత సాధ్యమవుతుంది.
3. సంఘం ఎప్పటికప్పుడు ఏమి చేసుకోవాలి అనేది ప్రణాళికలు తయారు చేసుకోవాలి. తయారు చేసుకొన్న ప్రణాళిక ప్రకారం కార్యక్రమం చేసుకోవాలి.
4. చేసుకున్న ప్రణాళికను అప్పుడప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. (అంటే ప్రణాళిక ప్రకారం అన్ని కార్యక్రమాలు సక్రమంగా లక్ష్యాలను సాధించుకునే విధంగా పూర్తి చేసుకుంటున్నాము అని)
5. పై వన్నీ ఉంటే సంఘానికి కొంతవరకు సుస్థిరత ఉంటుంది.





## సమస్య : 2

# బయటి సంస్థలతో అనుసంధానం లేకపోవుట సమస్య

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ వనరులను కోల్పోతున్నారు. సమాచారం తెలుసుకోలేక పోతున్నారు. సంఘటితం కాలేకపోతున్నారు. హక్కులు కోల్పోతున్నారు. తమ అనుభవం పెంపొందించు కోలేకపోతున్నారు. ఎలా సంబంధాలు మెరుగు పరుచు కోవాలో తెలియడం లేదు. అవగాహన లేకపోవడం, ఎవరెవరు ఏమి చేస్తారో తెలియకపోవడం, భయం, ఎదుటివారు చదువుకున్నవారు మనం కాదనే ఆత్మన్యూనతా భావం ఉండటం వలన సంబంధాలు పెంచుకోలేకపోతున్నారు | ❶ సంఘం సభ్యులు, గ్రామంలో, మండలంలో పనిచేసుకుంటున్న సమస్యలు, వ్యవస్థలతో సత్సంబంధాలు పెంచుకోవాలి. |
| ❷ రామన్నపేట గ్రామంలో ధనలక్ష్మి పొదుపు సంఘం ఉంది. వారు మత్స్యశాఖ వారితో సంబంధాలు పెంపొందించుకున్నారు. వారు పట్టిన చేపలను ఎండబెట్టడానికి వారి నుండి సబ్సిడీతో కూడిన డ్రైమిషన్ పొందారు. మరొకవైపు బ్యాంకుల నుండి అప్పును పొందారు. కాని వారు మార్కెటింగ్ కోసం ఎవరినీ సంప్రదించలేదు. వారికి ప్రస్తుతం | ❷ మండలంలో వున్న ఎం.డి.ఓ. ఆఫీసు, ఎం.ఆర్.ఓ., కలెక్టర్ మొదలగు గవర్నమెంట్ ఆఫీసులకు వెళ్ళి పరిచయాలు చేసుకొని తమ సంఘం గురించి, సంఘం చేసే కార్యక్రమాల గురించి చెప్పడం సంఘానికి సంబంధించి అక్కడ ఏదైనా అవకాశాలుంటే తెలుసుకోవడం మొదలగునవి చేస్తుండాలి<br>❸ అక్కడ పనిచేస్తున్న ప్రైవేట్ సంస్థలతో కూడ పరిచయాలు పెంచుకొని వారు ఏయే కార్యక్రమాల మీద పని చేస్తున్నారో తెలుసుకొని, అక్కడ మనకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడం, సంఘం గురించి వారికి చెప్పడం. అలా చేయడం వలన ఇతర సంస్థలతో సత్సంబంధాలు పెరుగుతాయి |

## సమస్య : 3

# ఏమి చేయాలన్నా ప్రమోటర్‌పై ఆధారపడుతున్నారు

| కారణాలు | పరిష్కారం |
|---|---|
| ❶ స్వయం నిర్వహణ చేసుకోలేకపోతున్నారు. ప్రమోటర్స్ అందుబాటులో లేకపోవుట వల్ల సమావేశాలు జరుపుకోలేక పోతున్నారు. నిర్ణయాలు చేయలేకపోతున్నారు.<br>❷ భైరవలంక గ్రామంలో ఒక సేవా సంస్థ 5 స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసింది. వారు పొదుపులు చేసుకుంటున్నారు, అప్పులు ఇచ్చుకుంటున్నారు. కాని వారేదయినా కార్యక్రమం చేపట్టాలన్నా, బ్యాంకుల వారిని కలవాలన్నా ఆ సేవా సంస్థ సహాయంతోనే నిర్ణయాలు చేస్తున్నారు. | ❶ సంఘంలో వాళ్ళు అన్ని విషయాల మీద శిక్షణలు తీసుకొని అన్ని విషయాల గురించి తెలుసుకుని ఏ సమస్య వచ్చినా తమంతట తావే పరిష్కరించుకుని నిర్ణయాలు తీసుకుని సంఘాన్ని ముందుకు తీసుకుపోతుండాలి. అంతేకాని ప్రతిదానికీ ప్రమోటర్ మీద ఆధారపడకూడదు. |



మన సంఘ లక్ష్యం సాధించడానికి అతి చేరువలో ఉన్నాము

## సీతాకోక చిలుక –దశలు




# స్వయం సహాయక సంఘము– దశలు

పైన చూశారు కదా. ఒక సీతాకోకచిలుక దాని జీవిత చకం. గ్రుడ్డు దశతో ప్రారంభమయిన ఈ సీతాకోకచిలుక జీవిత చక్రం మూడు దశలు దాటిన తరువాత మాత్రమే పరిపూర్ణత సాధించినది. అదే విధముగా ప్రతి స్వయం సహాయక సంఘము ఏర్పాటు దశ, నిర్మాణ దశ, అభివృద్ధి దశ అను మూడు దశలు దాటి సుస్థిర దశలోకి లేదా పురోగమన దశలోకి అడుగు పెడుతుంది.

మన సంఘం స్థాపించుకున్న రోజే సుస్థిర దశలోకి వెళ్ళలేదు. సంఘంలోని సభ్యులందరు సమిష్టి కృషితో అన్ని దశలు దాటుతూ సుస్థిర దశలోకి వెళ్ళాలి. అన్ని దశలు దాటాలంటే మనకున్న సమస్యలను మనము పరిష్కరించుకోవాలి.